# 5

# శమనొందుతున్న దేవుని ప్రజల వలె ప్రవర్తించుట

# (రెండవ భాగము)

## (1 పేతురు 3:1-22)

లోబడుట గూర్చిన చర్చ, విశ్వాసులు పౌర అధికారులకును, దాసులు వారి సొంతదారులకును మర్యాద ఇచ్చుచు వారికి విధేయులై యుండవలెనని పేతురు విశ్వాసులను మరియు దాసులను బ్రతిమలాడునట్లు చేసింది. దాసులు అనుభవించుచుండిన శ్రమ, క్రీస్తు అనుభవించిన శ్రమలను మననం చేయునట్లు పేతురును నడిపించింది, కాని మూడవ అధ్యాయంలో అతడు మరలా లోబడుట గూర్చియే చర్చిస్తున్నాడు, ఈసారి అది భార్యలు తమ భర్తలకు లోబడి యుండుటకు సంబంధించినదై యున్నది. దాసులకును, భార్యలకును ఇవ్వబడిన మందలింపులు కుటుంబ విషయాలకు సంబంధించినవై ఉండినవి, కాని భార్యలు తమ భర్తలతో కలిగియుండిన సంబంధానికిని, దాసులు తమ యజమానులతో కలిగియుండిన సంబంధానికిని మధ్య చాలా తక్కువ పోలిక ఉండింది. భావావేశపూరిత బంధములు మరియు స్త్రీపురుషుల సామాజిక సాంప్రదాయాల్లో కొత్తదనమేమీ లేకపోవడం భార్యాభర్తల సంబంధాన్ని మరింత జటిలం చేస్తుంది.

### భార్యలు తమ భర్తలకు లోబడుట (3:1–6)

**1-2అటువలె స్త్రీలారా, మీరు మీ స్వపురుషులకు లోబడియుండుడి; అందువలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే, వారు భయముతోకూడిన మీ పవిత్రప్రవర్తన చూచి, వాక్యము లేకుండనే తమ భార్యల నడవడివలన రాబట్టబడవచ్చును. 3జడలు అల్లుకొనుటయు, బంగారునగలు పెట్టుకొనుటయు, వస్త్రములు ధరించు కొనుటయునను వెలుపటి అలంకారము మీకు అలంకారముగా ఉండక, 4సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారముగల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగా ఉండవలెను; అది దేవుని దృష్టికి మిగుల విలువగలది. 5అటువలె పూర్వము దేవుని ఆశ్రయించిన పరిశుద్ధ స్త్రీలును తమ స్వపురుషులకు లోబడియుండుటచేత తమ్మును తాము అలంకరించుకొనిరి. 6ఆ ప్రకారము శారా అబ్రాహామును యజమానుడని పిలుచుచు అతనికి లోబడి యుండెను. మీరును యోగ్యముగా నడుచుకొనుచు, ఏ భయమునకు బెదరకయున్న యెడల ఆమెకు పిల్లలగుదురు.**

**వచనము 1.** క్రైస్తవులందరు వారి అధికారులకును, దాసులందరు వారి యజమానులకును లోబడవలసి యుండిన **అటువలెనే, భార్యలు** తమ **భర్తలకు లోబడి యుండవలెనని** పేతురు వారిని విన్నవించుకుంటున్నాడు. కుటుంబములో క్రమము

మరియు సమాధానము నెలకొని యుండు నిమిత్తము వారు లోబడియుండవలెను. భర్తలు తమ కుటుంబములో నాయకత్వము వహించు బాధ్యతను దేవుడు వారికి అప్పగించాడను అర్థం పేతురు మాటల్లో ధ్వనిస్తుంది. భర్త నాయకత్వాన్ని రూఢిపరుస్తున్నంత మాత్రాన అతని అధికారతత్వముగల, నిరంకుశమైన పరిపాలన ఆమోదింపబడుతుందని అర్థం కాదు. పేతురు మాటలు భర్త యెడల కాదు కాని భార్య యెడల గురిపెట్టబడినవై యుండుట గమనార్హమైన విషయమై యున్నది. పేతురు, "భర్తలారా, మీ భార్యలను మీ అదుపులోనికి తీసుకొనండి" అని చెప్పడంలేదు, కాని "స్త్రీలారా, మీ స్వపురుషులకు లోబడియుండుడని" చెప్పుతున్నాడు. ఒకరు ఇష్టపూర్వకంగా లోబడినప్పుడు, లోబడుతున్నవారు హీనపరచబడుతున్నారను అర్థంకాదు. భార్య తన భర్త నాయకత్వాన్ని మరియు సంబంధిత అధికారాన్ని ఇష్టపూర్వకంగా అంగీకరిస్తే తప్ప, అతడు దానిని ఉపయోగించుకొనజాలడు – కనీసం, తానే క్రీస్తు అనుచరునిగా జీవిస్తున్నంత కాలం ఉపయోగించుకొనజాలడు.

లోబడుట, స్త్రీలపై పురుషుల ఆత్మసంబంధమైన లేక మేధావి సంబంధమైన ఆధిక్యత కంటె, యజమానులు వారి దాసులపై కలిగియుండిన దాని కంటె ఎక్కువే అనే అర్థమీయదు. క్రైస్తవులు తమ కుటుంబాల్లో క్రమబద్ధమైన సామాజిక పరస్పర ప్రభావాన్ని పాటించాలన్నదే పేతురు ఆందోళనయై యున్నది. సామాజికపరమైన ఏ ఏర్పాటులోనైనను, అది వ్యాపార రంగమైనా లేదా పాఠశాల తరగతి గదియైనా, నాయకత్వం మరియు లోబడుట కొంత స్థాయిలో ఉండవలసిందే. చర్యలు చేపట్టడానికి ఏ ఒక్కరైనను బాధ్యత తీసికొననట్లయితే లేదా అధికారాన్ని వినియోగించినట్లయితే, పరిస్థితి అంతా అస్తవ్యస్తమైనదౌతుంది. క్రైస్తవ కుటుంబంలోని భర్త మరియు తండ్రి కుటుంబ సభ్యుల ఆధ్యాత్మిక, భావావేశ, మరియు భౌతిక సంక్షేమము గూర్చిన బాధ్యత అంగీకరించాలని వారిని విన్నవించుకొన్నప్పుడు, పేతురు మరియు పౌలు (ఎఫెసీయులకు 5:22–6:4; కొలొస్సయులకు 3:18–21) కూడ ఒకే మనస్తత్వంగలవారై యుండిరి. భర్త యొక్క నాయకత్వ పాత్రలో భార్య అతనికి పూర్తి మద్దతియ్యడం ఉచితమని ఈ ఇరువురు అపొస్తలులు ప్రతిపాదించారు.

భార్యలు తమ భర్తలకు లోబడవలెనను ఎదురుచూపు, ఆధునిక పాశ్చాత్య ప్రచంచంలో కంటె, గ్రీకులు మరియు రోమీయులు మిళితమై జీవించుచుండిన ఆ నాటి ప్రపంచంలోని సంస్కృతిలో ఎక్కువ లోతుగా నాటుకొని యుండింది. సర్వమానవ సమత్వాన్ని కోరుచుండిన పాశ్చాత్య సంస్కృతిలో, స్త్రీపురుష లింగ భేదమును ఆధారం చేసుకొని లోబడుట, ప్రాచీన ప్రజలకు ప్రమాదకరమైనదై యుండిన దాని కంటె ఎక్కువ ప్రమాదకరమైనదై యుండుటకు ఆస్కారముండింది. బైబిలు సంబంధమైన ఉత్తరువులను మనకాలీన ప్రపంచంలో ఎలా అన్వయించాలో నిర్ధరించడం ఆధునిక పాఠకమహాశయునికి తరచుగా కష్టమైనదై యుంటున్నది, ఎందుకనగా ఇవి తన సొంత సమాజము కంటె చెప్పుకోదగినంత భిన్నంగా ఉండిన మర్యాదలు పాటించుచుండిన సమాజములపై గురిపెట్టబడి యుండినవి. చర్చనీయాంశమును లోతుగా చర్చించడానికి ఇది సమయం లేదా సందర్భం కాదు, కాని క్రొత్త నిబంధన దాని పాఠకులకు ఒక నిర్ధిష్టమైన సామాజిక కట్టుబాటులకు కట్టిపెట్టియుంచడం లేదని మనము ప్రస్తుతానికి గమనించాలి. కుటుంబ విషయాలు పరస్పరము తృప్తికరమైన పరిస్థితుల్లో నిర్వహింపబడు నిమిత్తము భార్యాభర్తల మధ్య జరుగాల్సిన చర్చను, లోబడుట అడ్డగించదు. కొన్ని పర్యాయాలు వివాహం దృఢమైన సంకల్పముగల ఇద్దరి చేత

నిర్మింపబడినదై యున్నదనే ఒక గుర్తింపై యున్నది. ఈ విషయాల్లో, భార్యాభర్తలు ఆధిక్యం కోసం ఒకరితో మరొకరు పోటీపడుచుందురు. ఇటువంటి పోటీ తరచుగా జీవితకాలమంతా లేదా విడాకులు తీసికొనబడేంత వరకు కొనసాగుతుంటుంది. ఇతర వివాహాల్లో, బాధ్యతను చేపట్టి, ఇంటి పనులు నిర్వహించడానికి ఏ ఒక్కరును ముందడుగు వేయుటకు ఇష్టపడరు. నాయకత్వ బాధ్యతను భర్త చేపట్టుట ఇటువంటి సమస్యలకు పరిష్కారమై యున్నది. ఈ బాధ్యతను అంగీకరించడం ద్వారా అతడు దేవుని సంతోషపర్చుచున్నాడు.

పేతురు మందలింపునకు సంబంధించిన సందర్భం కుటుంబమైయున్నదను విషయాన్ని పక్కనబెట్టేయకూడదు. వ్యాపార ప్రపంచానికి లేదా ఇతరమైన సామాజిక నిర్మాణములకు సంబంధించిన ధ్వనింపులు ఇచ్చట లేవు. సంఘంలో స్త్రీపురుషులు వహించు బాధ్యతల నిర్దేశనము కొరకు, మనము బైబిలులో మరొక చోట చూడవలసి యున్నది. 1 కొరింథీయులకు 14:34, 35 మరియు 1 తిమోతి 2:11, 12లో సంఘములో ఉపదేశించుట మరియు అధికార హోదాలకు సంబంధించిన బాధ్యతను పురుషులు చేపట్టాలని పౌలు కోరుచున్న విషయం స్పష్టమౌతుంది. కుటుంబము మరియు సంఘము దేవుడు నిర్మించిన మరియు దేవుని పర్యవేక్షణలో నున్న వ్యవస్థలై ఉన్నాయి. ఈ రెండింటిలోను నాయకత్వమును దేవుడు చాలా సులభతరం చేసాడు: క్రైస్తవులైన పురుషులు మాదిరికరంగా ఉంటూ మార్గమును చూపించుచుండవలెనని ఆయన ఆశిస్తున్నాడని దేవుడు సెలవిచ్చాడు. ఇంకా, స్త్రీపురుషులు వహించు పాత్రల విషయంలో ఆత్మసంబంధమైన, నైతికమైన, లేదా మానసికమైన ఆధిక్యత కలదను ధ్వనింపు నిచ్చు మాటలేమియు లేవు. కుటుంబము మరియు సంఘమునకు వెలుపటి సంబంధములలో, అవి సామాజికమైనవైనా లేదా దైవికమైనవైనా, స్త్రీ అని గాని పురుషుడనిగాని ఏ భేదము లేదు.

భార్యలు తమ భర్తలకు లోబడియుండవలెనను పేతురు మందలింపు, ఉద్యోగస్థులు వారి యజమానులకు లోబడవలెను, లేదా పౌరులు ప్రభుత్వంచేత నియమింపబడిన చట్టములకు లోబడవలెనని చెప్పుట కంటే, స్త్రీల విషయంలో వారిని తిరస్కరించి వారికి కోపము పుటించు విషయం ఏమాత్రమును కాదు. సమకాలీన పాశ్చాత్య సంస్కృతిలో, భార్య ఆర్జించు వేతనం చెప్పుకోదగినంత మొత్తంలో ఉండవచ్చు, ఆమె వ్యాపార రంగంలోగాని లేదా ప్రభుత్వంలోగాని ఒక బాధ్యతాయుతమైన ఉన్నత పదవిని అలంకరింపవచ్చు, లేదా అత్యంత అల్పమైన పని సహితము చేయుచుండవచ్చు. ఆమె గృహిణిగా దినమంతా ఇంటి పనులలో నిమగ్నమై యుండవచ్చు లేదా తన భర్తకు వలె ఉదయం ఎనిమిది గంటలు మొదలుకొని సాయంకాలం ఐదు గంటల వరకు పూర్తి కాల ఉద్యోగంలో ఉండవచ్చు. ఆమె చేపట్టిన ఇతర పాత్రలు లేదా బాధ్యతలు ఏవైనా, ఆమె తన భర్తను కుటుంబ యజమానిగా ప్రోత్సహిస్తూ అతనికి తన తోడ్పాటు నందించవలసిందని పేతురు క్రైస్తవ స్త్రీలను విన్నవించుకుంటున్నాడు. ఈ మందలింపు ప్రాచీన స్త్రీలకు ఏ విధంగా వర్తించిందో లేక వారికది ఎంత ప్రాముఖ్యమైనదై యుండిందో నేటి స్త్రీలకు సహితం అలాగే వర్తిస్తుంది. అంతే ప్రాముఖ్యమైనదై యున్నది.

పురుషుడు, భర్తగాను తండ్రిగాను తన బాధ్యతను దూషిస్తాడనేది లేదా పరిత్యజిస్తాడనేది కొన్ని పర్యాయాలు నిజమే. భర్త అశ్రద్ధచేయువాడు, బాధ్యతారహితుడు, లేదా క్రూరుడునై యున్నప్పుడు, క్రైస్తవురాలైన భార్య తన కుటుంబమునకు అవసరమైన ఆత్మసంబంధమైన

నాయకత్వం విషయంలో ఆలంబనమును తన శాయశక్తులా అందించుచుండవలెను. భర్త అవిశ్వాసి, భార్య విశ్వాసియై యున్నప్పుడు, వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే, **వారు భయముతో కూడిన భార్య యొక్క ప్రవర్తనను చూచి, వాక్యము లేకుండనే తమ భార్యల నడవడివలన రాబట్టబడునట్లు**, తన భర్తలో కనుగొనబడు మంచి యంతటికి మద్దతిస్తూ ప్రోత్సాహించుచుండవలెను. "వాక్యమునకు అవిధేయులై యుండుట" అనగా "సువార్తకు అవిధేయులై యుండుటయే" ఔతుంది (4:17). ఇటువంటి సందర్భంలో భర్త క్రీస్తు సందేశము యెడల ఉదాసీనుడై ఉండియుండవచ్చు లేదా దాని యెడల నిర్మాణాత్మకంగా శత్రుత్వ భావంగలవాడై ఉండియుండవచ్చు. భార్య మాత్రమే క్రైస్తవురాలై యుండినప్పుడు, ప్రాచీన ప్రపంచంలో, ఆమె స్థానం అదివరకే అనిశ్చితమైనదై యుండింది. భార్య, తన భర్త అనుసరించు విశ్వాస విధానమునే అనుసరించునని ఆశింపబడింది. అంతే గాని భర్త, భార్య అనుసరించు విశ్వాస విధానమును అనుసరించడం కాదు. కాబట్టి క్రైస్తవురాలైన భార్య తన నెమ్మదియైన మరియు తోడ్పాటునిచ్చు స్వభావం ద్వారా తన భర్త యెదుట మాదిరిని ప్రదర్శింపవలెనని పేతురు కోరుచుండెను. క్రైస్తవ విశ్వాసి నోటి మాటల చేత మాత్రమే కాదు, కాని తన నడవడి ద్వారా కూడ ఉపదేశించును.

"వాక్యము లేకుండానే తమ భార్యల నడవడివలన రాబట్టబడవచ్చును" అని KJV అనువాదంలో నున్న మాటలు కొంత మేరకు దారి తప్పుతున్నాయా అన్నట్టు ఉన్నవి. దేవుని వాక్యం కర్తయై యున్నదని "వాక్యము" అను మాటకు ముందున్న నిర్దిష్టోపపదము సలహా ఇస్తుంది. అవిశ్వాసియైన భర్త క్రీస్తు నంగీకరించిన కొన్ని సందర్భాలో దేవుని "వాక్యము" ఎటువంటి పాత్ర వహించదని పేతురు చెప్పుచుండలేదు. "ఒక మాట లేకుండనే" అని అనువదిస్తూ, NASB సరైన అర్థాన్ని మనముందుంచుచున్నది. కొన్ని సందర్భాల్లో అవిశ్వాసియైన భర్తను లేదా భార్యను నిర్దిష్టమైన ఏ మాటయైనను రాబట్టజాలదని పేతురు చెప్పుచుండెను. దానికి బదులుగా, దైవభక్తిగల నడవడితోపాటు మద్దతిచ్చు దేవుని వాక్యం అవిశ్వాసియైన భర్తను లేదా భార్యను క్రీస్తు కొరకు రాబట్టును. భర్త "రాబట్టబడుట" అదే సమయంలో క్రీస్తు మహిమ కొరకును భర్త రక్షణ కొరకును ఉద్దేశింపబడినదై యుంటుంది. పేతురు చెప్పిన మాటల్లో ఇతర ధ్వనింపులు కూడ ఉండినవి. పేతురు పత్రికలను చదువుచుండిన వారిలో విశ్వాసులైన భర్తల కంటె, విశ్వాసులైన భార్యలుండుట ఎక్కువ సామాన్యమైన సంగతై యుండింది. క్రైస్తవులై యుండిన భార్యలు వారి భర్తలకు దేవుని వాక్యమును ఉపదేశించుట ద్వారా వారిని క్రీస్తు కొరకు సంపాదించడానికి ప్రయత్నించుచుండిరని స్పష్టమౌతుంది. భర్త క్రైస్తవ విశ్వాసి కానప్పుడు, విశ్వాసియైన భార్య తన భర్తను రక్షించుట కొరకు చొరవ తీసుకొనుటను పేతురు స్పష్టంగా ఆమోదించాడు.

గ్రీకులు మరియు రోమనులు మిళితమై జీవించుచుండిన ప్రపంచంలో శక్తిహీనులై యుండినవారు – కనీసం తక్కువలో తక్కువ శక్తి కలిగియుండినవారు (బీదలు, స్త్రీలు, దాసులు) – సందేశమును ఎంతో శక్తిమంతముగా, ఎంత శక్తిమంతముగా అంటే చివరకు శత్రువులై యుండిన దేవతలు మరియు తత్వములన్నీ జయింపబడునంత శక్తిమంతముగా ప్రచురించుచుండిరనేది గమనార్హమైన విషయమై యున్నది. దేవుని యెదుట సమస్త జనులు సమానమైనవారే అను సందేశం క్రీస్తు సువార్తలో ఉన్నది. మానవజాతి మధ్య దేవుడు సమానత్వమునే కోరుచున్నాడను ఒప్పింపు, నజరేతువాడైన యేసును

సేవించుట వలన ఎదురయ్యే తప్పించుకొనబడజాలని పర్యవసానమై యున్నది. దేవుని యొద్ద పక్షపాతము లేదు. కాబట్టి ఆయన ప్రజలు కూడ పక్షపాతము లేనివారై యుందురు (యాకోబు 2:1).

క్రొత్త నిబంధన యుగము వెనువెంట ప్రవేశించిన తరువాతి శతాబ్దములలో, క్రైస్తవ్యము తీవ్రమైన విమర్శకులను ఆకర్షించింది. రెండవ శతాబ్దము నాటి వారిలో ఒకడైన సెల్సస్, క్రైస్తవులను ఖండిస్తూ సుదీర్ఘ రచనలు గావించాడు. కాలగమనంలో, అది నాశనమయ్యింది, గనుక మర్చిపోబడింది. ఏది ఏమైనా, మూడవ శతాబ్దంలో ఐగుప్తు దేశంలోని అలెగ్జాంఢ్రియాకు చేదిన క్రైస్తవుడు, ఓరిగేన్, సెల్సస్ రచించినదంతా తప్పని నిరూపిస్తూ ఒక ప్రత్యుత్తరం రచించాడు. ఓరిగెన్ తన ప్రతివాదములో సెల్సస్ రచించిన ఎన్నో విషయాలను ఎత్తి చూపించాడు గనుక సెల్సస్ చెప్పదలచినదేమిటో మనకు సులభంగా అర్థమౌతుంది. సెల్సస్ రచించిన దానిలో ఒక భాగం ఈ దిగువన ఈయబడింది:

> ప్రభుత్వ పదవుల్లోలేనివారి ఇళ్లలో కూడ మనము ఉన్ని వస్త్రాలల్లేవారిని, చెప్పులు కుట్టేవారిని, చాకలివారిని, చదువుసంధ్యలేమీ అసలే నిరక్షరాస్యులను, పశువుల కాపరులైన జానపదులను చూడగలము, పెద్దలు మరియు వారి కంటె తెలివిమంతులైన యజమానుల ముందర వీరు నోరుతెరువజాలకుండిరి. కాని ఏకాంత స్థలాల్లో ఉన్న పిల్లలను వారితోపాటు బుద్ధిలేని కొందరు స్త్రీలను వీరు పట్టుకొనగలిగినప్పుడు, వారు అమితాశ్చర్యమును గొలుపు కొన్ని ప్రకటనలు చేయుచుండిరి, ఉదా॥ వారు తమ తండ్రులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు ఉపదేశించు విషయాల పట్ల శ్రద్ధ వహించకూడదు, కాని వారికి లోబడవలెను; వీరు అర్థంపర్థంలేని మాటలు మాటలాడుచుందురు, వారికి తెలివిలేదు, మరియు వాస్తవానికి వారికి ఏమియు తెలియదు, మరియు ఏమియు చేయలేకపోతున్నారు, కాని నిరర్థకమైన వాగుడు వాగుచుందురని వారు చెప్పుచుందురు.[1]

బహుశా అది వారి తాత్పర్యమై ఉండియుండదు, కాని బలహీనులు మరియు అధికారములో లేనివారు (బీదలు, స్త్రీలు, దాసులు), గ్రీకులు మరియు రోమనులు మిళితమై జీవించుచుండిన ప్రపంచంలో మొదటి కొన్ని క్రైస్తవ శతాబ్దాలలో క్రీస్తును ప్రచురించుచుండిన పోరాటంలో వహించిన పాత్రను సెల్సస్ మరియు ఓరిగెన్ కూడ గుర్తించారని ఎత్తి చూపింపబడిన రచనలు సాక్ష్యమిస్తున్నాయి.

**వచనము 2.** తన భర్తను క్రీస్తు కొరకు రాబట్టగల భార్య **నడవడి**, లోబడియుండుట యై యుండింది, అయినప్పటికిని అది **భయముతో కూడిన పవిత్ర ప్రవర్తన** కూడ అయియుండింది. భార్యలు మాత్రమే కాదు కాని తన పాఠకమహాశయులందరు వారి సమకాలీనులకు సరైన క్రైస్తవ సాక్ష్యమునిచ్చుజీవిత విధానం కలిగియుండాలని పేతురు ఆందోళన చెందుచుండెను (1:14-16; 2:12). వారు క్రీస్తును ధరించియున్నారనియు, ఏర్పరచుకొనబడిన వారిలో వారు సహితం ఉన్నారనియు అన్యమతావలంబికుల లోకం చూడాల్సిన అవసరం ఉండింది మరియు వినాల్సి యుండింది. విశ్వాసులు సువార్తను చేపట్టి భక్తిహీనులైనవారిని తమ నోటి మాటలతోను నడవడితోను చేరవలెనని పేతురు ఆశించుచుండెను. (నడవడి) "వలన" (*epopteuō*) అని అనువదింపబడిన మాట, ఇచ్చట మరియు 2:12లో మాత్రమే ప్రయోగింపబడింది, క్రొత్త నిబంధనలో యింకెక్కడను ప్రయోగింపబడలేదు. ఇది "వలన" అను మాట కంటె బలమైనదై యున్నది. భర్త తన

తలను ఒక ప్రక్కకు త్రిప్పుకొని తన సతీమణి విశ్వాసపుటొప్పుకోలునకును ఆమె ప్రవర్తిస్తున్న విధానమునకును గల సంబంధం గూర్చి దీర్ఘంగా మననం చేయుటను ఈ మాట చిత్రీకరించుచున్నది. "పవిత్ర ప్రవర్తన"తో కూడిన ఆమె జీవిత విధానం, ఆమె యొక్క లైంగిక నడవడి అనింద్యనీయమైందని భావిస్తుంది. కాని ఈ మాట యొక్క అర్థం దీనిని మించినదై యున్నది. అది అమాయకత్వమును మరియు దేవునితోనైనను రాజీపడక తదేక దృష్టితో మంచితనము పట్ల గల స్వభావమును సూచిస్తుంది. ఆమె యొక్క "పవిత్ర ప్రవర్తన" "భయముతో కూడినదై" (*en phobōi*) యుండవలెనని గ్రీకు మాట చెప్పుచున్నది. భార్య నైతికంగా భయముతో కూడిన జీవితం జీవించాలని పేతురు భావించలేదు. పేతురు "భయము" అను పదాన్ని "దేవునికి భయపడుడి" (2:17) అను ఆజ్ఞ అర్థమిచ్చుచున్న అదే భావంతో ప్రయోగిస్తున్నాడు. ఆమె తన భర్త యెడల మర్యాద మరియు నమ్రతను ప్రదర్శించాలి; కాని అంత కంటే ఎక్కువగా, ఆమె యొక్క పవిత్ర ప్రవర్తన దేవుని యెడల ఆమెకున్న భయము మరియు భక్తితో కూడిన వైఖరి ఫలితమని తన భర్త తెలిసికొనునట్లు ఆమె తనను తాను సమాళించుకోవాలి. *En phobōi* అను పదాన్ని NASB "మర్యాదపూర్వకంగా" అని అనువదించడం వలన అన్యాయమేమియు చేయడం లేదు.

**వచనము 3.** క్రైస్తవ స్త్రీ ఆమె ఇతరుల కనుచూపుకు ఎంత చూడముచ్చటైన అందంగాను, ఆకర్షిణీయమైనదానిగాను ఉన్నదో యని చూచుకొనుట కంటె ఎక్కువ, ఆమె ఎవరైయున్నదీ, మరియు ఆమె ప్రవర్తనా విధానం ఎలా వున్నదో యని ఆందోళన చెందుచున్నదై యుండవలెనని పేతురు సలహా ఇస్తున్నాడు. దైవభక్తిగల భార్య "భయముతో కూడిన పవిత్ర ప్రవర్తనతో" తన జీవితాన్ని అంలంకరించుకొనవలెను. క్రీస్తు నందు ఆమె **అలంకారము కేవలము వెలుపటి అలంకారమై యుండకూడదు.**[2] అలాగని, స్త్రీ తన శారీరక అవతారము గూర్చి ఏమాత్రమును పట్టించుకొనకూడదను భావం పేతురు మాటల్లో ధ్వనించుట లేదు. ఎదుటి వ్యక్తికి, స్త్రీ పురుషునికి, పురుషుడు స్త్రీకి ఎంత ఆకర్షణీయమైమనవారుగా అగుపిస్తున్నారన్నదే విషయమై యుండింది. పేతురు స్త్రీలను గౌరవించాడు, గనుక వారి గౌరవము మరియు గుర్తింపు, వారు ఎవరై యున్నారో అను దానిలో ఉన్నది. కాని వారు ఏమి ధరించారో అను దానిలో లేదని ఎరిగి వారు తమ్మునుతాము సహితం గౌరవించుకోవాలని ఆయన ఆశించుచుండెను.

గ్రీకులు మరియు రోమనులు కలిసి జీవించుచుండిన ప్రపంచంలోని సమకాలీన నైతికవాదులు పేతురు మాటలను ప్రతిధ్వనించారు. తత్వశాస్త్రవేత్తయైన ప్లూటార్క్ మరియు యాజకుడైన డెల్ఫి, పేతురు సమకాలీనులలో ఒకడైన వాని మాటలపై జే. రామ్సే మైఖేల్స్ తన దృష్టిని మళ్లించి ఇలా వ్యాఖ్యానిస్తున్నాడు: "స్త్రీకి అలంకారము నిచ్చేది బంగారము లేదా వెలగల రాళ్లు లేదా సింధూరము కాదు, కాని ఆమె గౌరవమునకు సత్ప్రవర్తనకు మరియు సచ్ఛీలతకు గుర్తింపు నిచ్చుచుదేదైనను అందమైన ఆకర్షణీయమైన అలంకారమై యుంటుంది."[3] పౌలు కూడ ఇదే విధమైన మాటలు రాస్తున్నాడు.

> మరియు స్త్రీలును అణుకువయు స్వస్థబుద్ధియు గలవారై యుండి, తగుమాత్రపు వస్త్రములు చేతనేగాని జడలతోనైనను బంగారముతోనైనను ముత్యములతోనైనను మిగుల వెలగల వస్త్రములతోనైనను అలంకరించుకొనక, దైవభక్తిగలవారమని చెప్పుకొను స్త్రీలకు తగినట్టుగా సత్క్రియలచేత తమ్మును తాము అలంకరించుకొనవలెను (1 తిమోతి 2:9, 10).

ఎక్కువ ప్రశాంత చిత్తముగల మన సమకాలీనులతో సహా పేతురు ఏక మనస్సుగలవాడై యుండెను. పేతురు పురుషుల విషయంలో కూడ ఒక ఆరోపణ చేయుచుండెనను భావం బయటపడుచున్నది. వెలుపటి అందచందాలు మరియు అలంకారాల గూర్చి ఆందోళన చెందుచుండిన స్త్రీలకు వలెనే, ఇటువంటి విషయాలను ఆకర్షితులైన పురుషులు కూడ ఉండిరి. ఒక స్త్రీ ప్రధానంగా తన భాహ్య ఆకర్షణతో తనను తాను ఇతరుల ముందుంచుకొనినప్పుడు, స్త్రీలలో శరీర అందాన్ని మించి ఇతర విషయాన్ని చూడని పురుషులను మాత్రమే ఆకర్షిస్తుంది. కాలము గడిచిన కొలది భౌతిక ఆకర్షణ ఆధారంగా కట్టుకొనబడు సంబంధం త్వరలోనే సన్నగిలిపోతుంది. కాబట్టి భార్యలో వెలుపటి అలంకారమును మించి చూడవలెనని పేతురు పురుషులను మందలిస్తున్నాడు.

పేతురు యింకా ఎక్కువ నిర్దిష్టంగా చెప్పాడు. అలంకారమనేది **జడలు అల్లుకొనుటయు, బంగారు నగలు పెట్టుకొనుటయు, వస్త్రములు ధరించుకొనుటయునను** వెలుపటి అలంకారమై యుండకూడదని చెప్పాడు. పేతురు కాలమునకు దాదాపు సమకాలీనమైన ప్రపంచంలో నుంచి పదిలం చేయబడిన నగిషీపని ఆ నాటి ఘనులైన స్త్రీల వస్త్రధారణ ఎంత గంభీరంగా ఉండిందో తేటపరుస్తుంది. కాబట్టి ఈ రోజుల్లో వెలుపటి అలంకారానికి మితిమీరిన శ్రద్ధ చూపించబడటమనేది ఆధునిక అన్వేషణ ఏమీ కాదు. తన పాఠకులలో షుమారు అధిక శాతం మంది సిరిమంతులై యుంటారనియు, అందువలన వారు ఇంత విడమర్చిన విధంగా అలంకరించుకుంటారనియు ఆయన ఆశించిన సూచన పేతురు మాటల్లో కనిపించడం లేదు. వెలుపటి అలంకారము గూర్చి మితిమీరి ఆందోళన చెందుచుండిన వారి మనస్తత్వమును పేతురు తెలుపుచుండెను. ఇట్టి మనస్తత్వము ధనికుల్లోను, దరిద్రుల్లోను ఒకే విధంగా ఉండింది. స్త్రీలు బంగారు ఉంగరము మరియు ముంజేతి గొలుసు ధరించడం గాని, క్రొత్త వస్త్రాలు ధరించడం గాని, లేదా తమ శిరోజాలను కొత్త కొత్త విధానాల్లో అలంకరించుకొనడం గాని, పాపమని చెప్పలేదు. విశేషంగా, స్త్రీలు ఇటువంటి విషయాలకే మితిమీరిన ప్రాధాన్యత ఇచ్చినప్పుడు, తమ స్వపురుషులతో కూడ మెలగవలసి యుండిన గంభీరమైన విషయాల సామర్థ్యంలో వారు రాజీపడాల్సిన వస్తుందేమో, గనుక తగు జాగ్రత్త వహించవలసిందని పేతురు చెప్పుచుండెను.

**వచనము 4.** వ్యతిరేకార్థకంగా చూచినట్లయితే, క్రైస్తవ భార్యలు వారి భర్తలకు కేవలము వెలుపటి అలంకారాలనుబట్టి ఆకర్షితులై యుండాలని పేతురు కోరలేదు; నిర్మాణాత్మకంగా చూచినట్లయితే, వారు **సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలకారమును** తమ స్వపురుషుల యెదుట ప్రదర్శించాలని కోరాడు. భార్య తన భర్తకు లోబడి యుండవలెనను విషయంతో అపొస్తలుడు తన విన్నపాన్ని ఆరంభించాడు, కాని లోబడుట అనగా తన భర్త ఎవరైయున్నాడో, లేక ఏమేమి చేస్తున్నాడో యను సందర్భాల్లో వారు నిశ్చేష్టమైన ఉదాసీనతతో ఉండుటయే యని ఎంచబడకూడదనేది స్పష్టంగా తెలుస్తుంది. భార్య తన భర్తపై ప్రదర్శించుచుండిన ప్రభా(తాప)వం గూర్చి కాదు గాని పద్ధతి గూర్చియే పేతురు ఆందోళన చెందుచుండెను. భర్త తన జీవితవిధానం ద్వారా తన భార్యను ప్రభావితం చేస్తూ ఆమెను మలచు విధానంలోనే, భార్య కూడ తన జీవితవిధానం ద్వారా తన భర్తను ప్రభావితం చేస్తూ అతనిని మలచును. స్త్రీ తన **హృదయపు అంతరంగ స్వభావం** చేత తన స్వపురుషునికి ఆకర్షితురాలైయున్నప్పుడు, ఆమె దేవునికి మహిమ కలుగుటకు

కారణమౌతుంది. అపొస్తలుడు స్త్రీల నుద్దేశించి సలహాలు సూచించుచుండినప్పటికిని, అవి పురుషులకు సహితం సమానంగా ప్రాముఖ్యమైనదై యుండినవి. పురుషులు సహితం, వారి హృదయపు అంతరంగ స్వభావాన్నిబట్టి తమ భార్యలకు ఆకర్షితులై యుండవలెను. దేవునికి ప్రీతికరమైనది వెలుపటి అలంకారమునకు సంబంధించిన విషయాలు – బంగారము, వెండి, విలువైన వస్త్రాలు, పరిమిళ వాసనలు – కాదు.

పేతురు మానవ స్వభావం గూర్చి ఆశ్చర్యంగా ఆశాజనకమైనదైయున్న అంచనాను ప్రదర్శిస్తున్నాడు. భర్త వెలుపటి చిత్తవృత్తి ఏదైనా, అతడు తన భార్య యొక్క వెలుపటి అల్కారమును మించి, భక్తిగల ఆమె ప్రవర్తనకు ఎక్కువ విలువనిచ్చు "హృదయపు అంతరంగ స్వభావం" అతనిలో ఉన్నదను అంతర్భావం అగుపిస్తుంది. భార్య తన భర్త యొక్క ఆత్మసంబంధమైన సంక్షేమము గూర్చిన బాధ్యతలో సరైన పాలుపంపులు చేపట్టడం లేదని ఈ వాంగ్మూలము చెప్పుతున్నట్లు అగుపిస్తుంది. ఏది ఏమైనా, సంబంధిత సందర్భాన్ని పునఃనరాలోచన చేసినట్లయితే పాఠకుని దృష్టికోణం పునరుద్ధరింపబడటానికి అవకాశాలున్నాయి. పేతురు అడుగుతున్న ప్రశ్న: "క్రైస్తవురాలైన భార్య తన భర్తపై సరైన ప్రభావం చూపునట్లు ఆమె అతని యెదుట ఎలాంటి సత్ప్రవర్తన ప్రదర్శించాల్సి వున్నది?" "సువార్త యెడల భర్త ఉదాసీనుడై ఉన్నప్పుడు లేదా శత్రుభావం కనుపర్చినప్పుడు, భర్త బాధ్యుడా లేక భార్య బాధ్యురాలా?" అని పేతురు ప్రశ్నించడం లేదు. క్రీస్తు ప్రభావం చేత తన భార్య ప్రవర్తనను ప్రభావితం చేయగల "హృదయపు అంతరంగ స్వభావం" కొందరు పురుషుల్లో ఉండకపోవచ్చు, కాని భార్య మాత్రం తన భర్తలో ఈ స్వభావం ఉన్నదన్నట్టుగానే ప్రవర్తించాలి. "హృయపు అంతరంగ స్వభావం" ఉన్నా లేకపోయినా, ఆమె అతనికి ఆకర్షితురాలై యుండవలెను.

"సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారము" **దేవుని దృష్టికి మిగుల విలువగలదని** పేతురు సెలవిస్తున్నాడు. "దేవుని దృష్టికి మిగుల విలువగలది" మైయున్నదనే విషయమే క్రైస్తవ జీవితమంతటి తాపత్రయమై యున్నది. ఒకరు ధరించే బంగారము లేదా వెలగల వస్త్రములను దేవుడు కోరుట లేదు. "మనష్యులు పైరూపమును లక్ష్యపెట్టుదురు, గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును" (1 సమూయేలు 16:7). "అక్షయమైన" అను పద ప్రయోగం, క్రైస్తవురాలైన భార్య తన ప్రవర్తనను నిత్యత్వ దృష్టికోణాన్నిబట్టి సరిచేసుకొనవలెనని ఆమెను ప్రేరేపిస్తుంది. బంగారము "నశించిపోతుంది" (1:7); సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణము "నశించిపోనిదై" యున్నది. "అక్షయమైనది" "యేసు క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు" మెప్పునకు మరియు ఘనతకు వారణమౌతుంది (1:7); కాని బంగారు ఆభరణములు నిలువవు. "సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణము," స్త్రీలు అనుసరించాలని పేతురు విన్నవించుకొనుచుండినది మరియు నశించనిదియునైన లక్షణమై యున్నది.

ప్రతి ఒక్క విశేషణ పదము బహు జాగ్రత్తగా పరీక్షింపబడుటకు తగినదై యున్నది. "సాధువైనట్టి" (*praus*) అని అర్థమిచ్చునట్లు NASB అనువదించిన పదము యేసు చెప్పిన ధన్యతల జాబితాలో ఉన్నది (మత్తయి 5:5). ఈ పదము కొన్ని పర్యాయాలు "సాత్వికము" అని అనువదింపబడుతుంది. మృదువైన మనస్సు మరియు బలహీనమైన మనస్సు ఒకటే కాదు. క్రైస్తవురాలైన భార్య తన భర్త యెదుట నెమ్మది మరియు ఇతరుల మేలు గూర్చి

ఆలోచించే మన మనస్సును ప్రదర్శించాలి. లోబడియుండుట హానికరమైందని ఇట్టి మనస్సు ఎంచదు. తన మాటే చెల్లాలని పట్టుబట్టే మనస్సు, "దేవుని దృష్టికి విలువగల" విషయాల కంటె స్వయంతృప్తే ప్రాముఖ్యమని చింతించే మనస్సు, సాధువైనట్టి, మృదువైనట్టి స్వభావమునకు వ్యతిరేకమైనదై యున్నది. "నెమ్మది" (*hēsuchios*) అని అర్థమిచ్చునట్లు NASB అనువదించిన పదము, 1 తిమోతి 2:12లో అగుపిస్తున్న నామవాచకము యొక్క విశేషణ రూపమై యున్నది. "స్త్రీ మౌనముగా ఉండవలసినదేగాని, ఉపదేశించుటకైనను, పురుషుని మీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను." "మౌనముగా ఉండుట" అనగా, అక్షరాలా "శాంతముగా ఉండుట" లేక "మాటలాడకుండా ఉండుట"యై యున్నది. ఈ రెండు మాటలు వినయము, నమ్రతగల మనఃస్థితిని సూచిస్తున్నాయి. తన భర్త సమ్మతము లేదా ఆశీర్వాదము లేకుండా ఒక స్త్రీ క్రైస్తవురాలగుట, గ్రీకులు మరియు రోమనులు మిళితమై జీవించుచుండిన సమాజంలో గౌరవింపదగిన ఒక స్త్రీకి అది ఎంతో సాహసంతో కూడిన చర్యయై యుండేది. ఆమె తన భర్త అభీష్టమునకు తావిచ్చు మనస్సు మరియు మర్యాదతో మెలగుట ద్వారా, తన స్వాతంత్ర్యమునుబట్టి తన భర్తకు కోపము పుట్టించెడు ఏ చర్యనైనను, మనఃపూర్వకంగా ప్రయాసపడుతూ ఎదుర్కోవాలని పేతురు విన్నవించుకుంటున్నాడు. ఆమె క్రైస్తవురాలగుట, తిరస్కారపూర్వకము మరియు స్వతంత్రముగల తన సొంత ఇష్టమునే నెగ్గించుకొనడం కాదు, కాని దేవుని సంతోషపరచవలెనను ఆమె ఆశించుచుండిన విషయమై యుండింది. ఈ వచనములోని "స్వభావము" అను పదము ఆమె అంతరంగములోని అమర్త్యమైన స్వభావమును కాదు, కాని ఆమె అంతరంగమునే ఆమె చిత్తవృత్తినే సూచించుచుండినది. (1 కొరింథీయులకు 4:21; గలతీయులకు 6:1 చూడుము, అచ్చట "సాత్వికమైన మనస్సు" మృదువైన స్వభావమును సూచిస్తుంది.)

"సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణము" దేవుని దృష్టికి ఎందుకు విలువగలదై యున్నది? ఎందుకనగా భర్తకు, యజమానునికి, లేదా పోలీసు అధికారికి లోబడవలెనని కోరుచున్న అదే చిత్తవృత్తి, దేవునికి లోబడగోరువారికి ఆవశ్యకమైన అంశమై యున్నది. ఇదే పత్రికలో పేతురు సామెతలు 3:34ను అటుతరువాత ఉల్లేఖించాడు, "అపహాసకులను ఆయన అపహసించును, దీనుని యెడల ఆయన దయ చూపును" (5:5). ఇంకా, "కాబట్టి దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతిక్రింద దీనమనస్కులై యుండుడని" కూడ చేర్చుతున్నాడు (5:6; యాకోబు 4:10 చూడుము). ప్రభుత్వ అధికారులకు, పనిచేయు స్థలములో పైఅధికారికి, ఇంటి యజమానునికి, చివరకు రక్షకుని అధికారమునకు సహితం లోబడాలని ఆశించునప్పుడు, అహంకారము అడ్డు వస్తుంది. వినయము అవతలివారి అభీష్టమునకు తావిచ్చు మనస్సును పెంపొందించుకొనడం, దేవునికి లోబడుతూ ఆయనతో సమాధానము కలిగియుండుటకు మార్గమై యున్నది. ఒకడు మరొకరి అధికారమును గౌరవిస్తున్నాడు గనుక అతడు తన సొంత తీర్మానము మరియు అభిప్రాయం విషయంలో – మనస్సాక్షికి సంబంధించిన విషయాలు లేనప్పుడు – అవతలివారి అభీష్టమునకు తావిచ్చు మనస్సును ప్రదర్శిస్తే తప్ప, లోబడుట జరగదు.

**వచనము 5.** వారి నుంచి ఆయన ఆశించుచుండిన ప్రవర్తన వారి ఆత్మసంబంధమైన పూర్వీకుల చేత ప్రదర్శింపబడిందని పేతురు క్రైస్తవ స్త్రీలకు గుర్తుచేస్తున్నాడు. **పూర్వము** అను పదము, అబ్రాహాము మరియు అతని వంశస్థులు దేవుని ప్రజలై యుండిన

కాలమును సూచిస్తుంది (హెబ్రీయులకు 1:1, 2 చూడుము). సంఘము మరియు ప్రజలు మరియు ఇశ్రాయేలు రచనలకు మధ్య గల కొనసాగింపు పేతురు రాసిన మొదటి పత్రిక నిర్మాణంలోనికే అల్లబడియున్నది. వారి కథలు బైబిలులో రచింపబడిన పరిశుద్ధ స్త్రీలు, వారి భర్తలకు లోబడుచుండిన జీవితం జీవిస్తూ సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణముతో తమ్మును తాము అలంకరించుకొనడం ద్వారా దేవుని సంతోషపరచారు. పేతురు విన్నవించుకొనుచుండిన స్త్రీల పరిశుద్ధత **దేవుని ఆశ్రయించుట** ద్వారా ప్రదర్శింపబడింది.

పౌలు తన పత్రికల్లో విశ్వాసమునకు ఇచ్చిన ప్రాధాన్యత దృష్ట్యా, “పరిశుద్ధ స్త్రీలు” “దేవుని యందు విశ్వాసముంచారని” పేతురు చెప్పవలసి యుండెనని ఒకరు అనుకొనవచ్చు. ప్రభువు రాకడ గూర్చిన నిరీక్షణ అతని మనస్సులో చెక్కబడి అచ్చొత్తింపబడినట్టుగా ఉండినందు వలన అపొస్తలుడు “ఆశ్రయించిరి” అను పదాన్ని ఉపయోగించియుండవచ్చు. “నమ్మకమైన సృష్టికర్తకు తమ ఆత్మలను అప్పగించుకొనిన” తన పాఠకమహాశయుల వలె (4:19), “పరిశుద్ధ స్త్రీలు” “దేవుని ఆశ్రయించారు.” వారు లోబడుటలో మాత్రమే కాదు, కాని వారి నిరీక్షణలో పేతురు పాఠకమహాశయులకు ఎక్కువ సూక్ష్మబుద్ధితో కూడిన మాదిరియై యుండిరి. పేతురు మనస్సులో ఉండిన “పరిశుద్ధ స్త్రీలు” మన పితరులైన అబ్రహాము, ఇస్సాకు, మరియు యాకోబుల భార్యలై యుండిరని తరువాతి వచనంలో శారా గూర్చి నిర్దిష్టముగా ఉదాహరింపబడి చెప్పబడిన విషయం సూచిస్తుంది. పూర్వీకులు ఇశ్రాయేలు తండ్రులై యుండిరి గనుక, ఇశ్రాయేలు తల్లులు శారా, రిబ్కా, లేయా, మరియు రాహేలు అయియుండిరి. ఈ పరిసుద్ధ స్త్రీలు **వారి స్వపురుషులకు లోబడియుండుటచేత** దైవభక్తిగల వారి ప్రవర్తనతో **తమ్మునుతాము అలంకరించుకొనచుండిరి.**

పరిశుద్ధురాలై యుండిన స్త్రీ, పరిశుద్ధుడుకాని పురుషుని వివాహమాడిన విషయం గూర్చి పేతురు వ్యవహరించలేదు. చాలావరకు ఇటువంటి సందర్భంలో “సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణము”తో లోబడుట, ఆమె దేవుని యెడల విశ్వసనీయమైన జీవితము కొనసాగించడానికి లోబడుచుండుట ఆమెను అనుమతించినంత వరకు, అది ఇంకను క్రమమైన విషయమే అయియుండునని అపొస్తలుడు చెప్పవచ్చు. లోబడవలెనని పేతురు ఆదేశించిన మూడు విషయాల్లోను – పౌరుడుగా, దాసుడుగా, మరియు భార్యగా – ఆయన కొన్ని సక్రమమైన ప్రతిపాదనలు చేయుచుండెనను విషయాన్ని ముఖ్యంగా గమనించాలి. శాంతిసమాధానాలతో వారి దైనందిన జీవితాన్ని కొనసాగిస్తూ, ప్రశాంతంగా పనులు చేసుకొనుచుండిన వారిని సాధారణంగా ప్రభుత్వం ఖండించలేదు. దాసుడు యజమాని యొక్క సొంత సొత్తై యుండుట గాక ఇతరమైన ఏ హేతువునుబట్టియైనను, సామాన్యంగా యజమాని తన దాసుని దూషించలేదు, భార్యాభర్త లిరువురును క్రైస్తవులైయున్న కుటుంబానికి, లేదా భర్త, క్రైస్తవేతరుడై యున్న సందర్భంలో, భర్త ఎలాగైనా సరే కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండవలసినదని పేతురు సెలవిచ్చినది, ఆదర్శమై యుండింది. అపొస్తలుల కార్యములు 5:28, 29లో, పేతురు యెరూషలేములో అధికారులకు లోబడకుండాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నాడు. దాసుడు తన యజమానునికి లేదా భార్య తన భర్తకు లోబడకుండాల్సిన పరిస్థితుల గూర్చి ఊహించుకొనడం కష్టమైన పనేమీకాదు.

పౌరుడుగాని, దాసుడుగాని, లేదా భార్యయైనను, లోబడుటను ఏ ఒక్కరైనను చులకనగా చూస్తూ నిరాకరించరాదని పేతురు తర్కించుచుండెను. క్రమప్రకారమైన అధికార శ్రేణి

సామాన్యంగా మంచి మరియు భక్తిపూర్వకమైన జీవితం జీవిచాలని ఆశించువారికి మద్దత్తు పలుకుతుంది. ఒకరు అధికారానికి రెండింటిలో ఏదో ఒక కారణాన్నిబట్టి లోబడటానికి నిరాకరించవచ్చు: (1) చేయవలెనని తన పైఅధికారి చెప్పేది చేయకూడదని దేవుని చేత ఆదేశింపబడవచ్చు. (2) తాను చేయగోరతున్నది అదేనని అతడు తన సొంత కోరికలనే కంఠోక్తిగా ప్రకటించవచ్చు మరియు అనుసరించవచ్చు. క్రైస్తవ జీవితంలో తావుండకూడదని పేతురు సెలవిచ్చుచుండినది, అధికారమునకు ప్రతిస్పందనగా చూపింపబడు రెండవ కోవకు చెందిన ప్రతిస్పందనయై యున్నది.

**వచనము 6.** "పూర్వము" "పరిశుద్ద స్త్రీలు" "తమ్మును తాము అలంకరించుకొనుచుండిన" విధానమునకు **శారా** ప్రవర్తన ఒక సోదాహరణ చిత్రీకరణమై యున్నది. పేతురు మందలింపునకు ఆమె ప్రవర్తన బలమును చేకూర్చినది, ఎందుకనగా శారా కనీసం ఈ సందర్భంలోనైనా, క్రైస్తవ ప్రవర్తనకు మాదిరియై యున్నది. శారా తన భర్తకు లోబడియుండిన తీరు ఆదికాండములోని ఒక నిర్దిష్టమైన సంఘటనలో అగుపిస్తుంది. అబ్రాహాము వంశస్థులు మామ్రే దగ్గర గూడారమేర్పరచుకొని యుండినప్పుడు, ముగ్గురు పురుషులు అగుపించారు. పితరుడైన అబ్రాహాము వారి యెడల చూపించాల్సిన ఆతిథ్యం చూపించిన మీదట, మీదటికి సారా ఒక కుమారుని గర్భము దాల్చునని వారు అతనికి వాగ్దానం చేసారు. గుడారము లోపల నుంచి శారా ఈ మాటలు వినుచుండినది గనుక ఇట్టి ఆలోచన, ఆశ గూర్చి ఆమె నవ్వింది. ఎందుకనగా అబ్రాహాము మరియు శారా వంటి వృద్ధ దంపతులకు బిడ్డ పుట్టుననునది ఊహాతీతమైన సంగత్తై యుండింది. తనలో తాను ముచ్చటించుకుంటూ, ఈ సందర్భంలో శారా అబ్రాహామును "నా యజమానుడు" అని సంబోధించుచున్నది (ఆదికాండము 18:12). "నా యజమానుడు" అను పదజాలమే పేతురు నొక్కివక్కాణించాలని ఆశిస్తున్న విషయాన్ని విశదపరుస్తుంది. **అబ్రాహామును యజమానుడు అని పిలువడము ద్వారా** శారా తాను లోబడుచుండిన విషయాన్ని ప్రదర్శించుచున్నది.

క్రీస్తునంగీకరించిన ఒక స్త్రీ క్రీస్తునంగీకరించని పురుషుని వివాహమాడుటలోగల సాధ్యత గూర్చి పేతురు యోచించినప్పటికిని, "భయముతో కూడిన ప్రవర్తన" అట్టి పురుషుని క్రీస్తు కొరకు రాబట్టుకొనవచ్చునని సూచించినప్పటికిని, అవిశ్వాసియైన భర్తలను ప్రభువు కొరకు సంపాదించడం పేతురు చర్చించుచుండన అంశము కాదు. గ్రీకులు మరియు రోమనులు మిళితమై యుండిన కుటుంబములలోని పురుషుని పెత్తనం దృష్ట్యా, భార్యలు తమ క్రైస్తవ విశ్వాసమును అమలుచేయుటలో తమ భర్తలను అనుసరించియుందురని ఒకరు భావించుకొనవలెను. శారా ఉదాహరణము, ఆమె తన భర్తను "నా యజమానుడు" అని పిలువబడం ద్వారా విధేయురాలై యుండుట, దాంపత్య భాగస్వాము లిరువురును విశ్వాసులై యుండిన పరిస్థితిని మనముందుంచుతున్నది. విమోచనలో స్త్రీలని పురుషులని భేదం లేదు గనుక, వైవాహిక సంబంధంలో సహితం ఈ సమానత్వం పొడిగింపబడుతుందని కొందరు క్రైస్తవ భార్యలు అనుకొనియుండవచ్చు. విషయం ఇది కాదని అపొస్తలుడు చెప్పుతున్నాడు. భార్యలు శారా మాదిరిని అనుసరిస్తూ తమ భర్తలకు లోబడి యుండవలెనని పేతురు వారిని విన్నవించుకుంటున్నాడు.

లోబడుటకును విధేయతకును గల కొంచెమే అయిన్నప్పటికిని, NASB ప్రకారం, శారా అబ్రాహామునకు "లోబడి యుండెనని" చెప్పడానికి బదులుగా, **విధేయురాలై**

**యుండెనని** పేతురు చెప్పునని ఆశించబడలేదు. పిల్లలు తమ తలిదండ్రులకు విధేయులై యుందురు, దాసులు తమ యజమానులకు విధేయులై యుందురు, పౌరులు దేశ చట్టానికి విధేయులై యుందురు, కాని భార్యలు తమ భర్తలకు విధేయులై యుండవలెనని సామాన్యంగా మందలింపబడరు. బహుశా అపొస్తలుడు "లోబడియుండుట" అను పదము కంటె దీనిని మించిన బలమైనది "విధేయులై యుండుట" అను పదమును నిష్కారణంగా విడిచిపెట్టియుండవచ్చును, ఎందుకనగా. క్రీస్తునంగీకరించడానికి అవకాశములుండిన క్రైస్తవులు తొట్రిల్లడానికి హేతువై, కుటుంబంలో తమ సొంత స్వతంత్రం కొరకు తలబిరుసుతనంతో వదించుచుండిన కొందరు క్రైస్తవ స్త్రీలుండిరి.

వంశ క్రమానుసారంగా యూదులు అబ్రాహాము మరియు శారా పిల్లలై యుండిరి. ప్రవక్తల ద్వారా చేయబడిన దేవుని వాగ్దానములను వారు స్వాస్థ్యముగా పొందారని క్రైస్తవులు సాధికారంతో చెప్పుకొనుచుండిరి ఎందుకనగా వారు దేవుడు అభిషేకించిన వాని యందు విశ్వసించారు మరియు ఆయనకు విధేయులయ్యారు. విశ్వాసము ద్వారా వారు అబ్రాహాము మరియు శారా యొక్క ఆత్మసంబంధమైన వారసులై యుండిరి. అబ్రాహాము మరియు శారా పేర్ల గూర్చి అన్యజనులైన క్రైస్తవులు సాధికారంతో చెప్పుకొనుచుండిన విషయం నిజము కానిదై యుండింది ఎందుకనగా వారు వారి వంశ క్రమమును అబ్రాహాముతో ఆరంభించలేదు. బాప్తిస్మమిచ్చు యోహాను చెప్పినది సరియే. దేవుడు రాళ్ల వలన అబ్రాహామునకు పిల్లలను పుట్టింపగలడు (మత్తయి 3:9). వారు శారా వలె జీవిస్తూ, తమ భర్తలకు లోబడుతూ, సరైనది చేసినప్పుడు వారు శారా పిల్లలై యుండిరని పేతురు అన్యజనులై యుండిన క్రైస్తవ భార్యలకు చెప్పుచుండెను. వారు శారా పిల్లలై యుండుటలో షరతుతో కూడిన కోణముండింది. **మీరును యోగ్యముగా నడుచుకొనుచు, ఏ భయమునకు బెదరక యున్న యెడల ఆమెకు పిల్లలగుదురు**. వారు శారా ప్రవర్తించిన విధానంలో ప్రవర్తించినంత వరకు వారు శారా పిల్లలై యుండిరి.

పేతురు తికమకపెట్టుచుండిన ఒక వాంగ్మూలముతో తాను క్రైస్తవ భార్యలకిచ్చుచుండిన మందలింపును ముగించాడు. వారు యోగ్యముగా నడుచుకొనుచు, **ఏ భయమునకు బెదరకయున్న యెడల** శారా పిల్లలగుదురని క్రైస్తవ భార్యలకు చెప్పాడు. ఈ సమయంలో "భయము" అనే ప్రస్తావన ఎందుకు వచ్చినట్లు? శారాను గూర్చిన విషయమే యింకా అపొస్తలుని మనస్సులో ఉండిందా? అలాగైతే, క్రైస్తవ భార్యలు భయపడకుండుటకు వారికి నేర్పించే విషయం శారా చూపిన మాదిరిలో ఏముండింది? ఇంకా, క్రైస్తవ భార్యలకు భయము కలిగించుచుండిన విషయమేమై యుండింది? మనము శారాకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పగలము. ఆమె సాహసమునకు లేదా భయము లేకుండుటకు మాదిరియై యుండెనని అగుపించడం లేదు గనుక, ఈ సందర్భంలో ఆమెను గూర్చిన ప్రస్తావనకు తావులేదని చెప్పడం క్షేమకరము. ఇంకా, పేతురు ప్రయోగించిన పదజాలములో అతని అర్థం ఏమైయుండిందో కచ్చితంగా తెలియదు.

"ఏ భయమునకు బెదరక యున్నయెడల" అను మాటల్లో కనీసము మూడు అర్థాలుండగలవు: (1) బహుశా, వారు తమ శక్తి కొలది చేయగలిగిన మంచి అంతటిని చేసిన మీదట, మిగతా విషయాలను వారు దేవునికి వదిలిపెట్టాలని పేతురు క్రైస్తవ భార్యలకు చెప్పుచుండవచ్చు. వారి నిరీక్షణ ఈ లోకం వరకే పరిమితమైనవారికి ఆందోళనను మరియు

అనిశ్చయమును కలుగుజేయు నటువంటి విషయాలకు భయపడకుడి. నిరీక్షణ మరియు నమ్మకము గూర్చి నిశ్చయాత్మకమైన వాంగ్మూలమును తెలియజెప్పడం అసాధారణంగా అర్థాంతరమైన అంశమౌతుండగా, పేతురు చెప్పుతుండిన విషయం ఇదే అయియుండవచ్చు. (2) క్రైస్తవులై యుండిన భార్యలు, అవిశ్వాసులై యుండిన తమ భర్తల నుంచి ఎదురుచూచు వ్యతిరేకతకు డొంకతిరుగుడుగా నున్న ప్రస్తావనయై యుండవచ్చు. పేతురు పత్రికను చదువుచుండిన క్రైస్తవులైన భార్యలలో అధిక శాతం మందికి అవిశ్వాసులైన భర్తలుండిరని సూచిస్తున్న విషయముగాని, మాటలుగాని ఈ వాక్యభాగంలో ఏమియు లేకపోవడమనేది సమస్యయై యున్నది. కొందరుండిరనేది వాస్తవమే. ఏది ఏమైనా, శారా అబ్రాహామునకు లోబడియుండుట గూర్చిన ఉదాహరణమును పేతురు ప్రయోగించినప్పుడు, అత్యధికంగా క్రైస్తవ విశ్వాసులై యుండిన భార్యలు తమ భర్తలకు లోబడి యుండవలెనని పేతురు వారిని విన్నవించుకొనుచుండెనని ఇది సూచిస్తుంది. (3) పేతురు పత్రికను చదువుచుండిన పాఠకమహాశయులందరును శ్రమల నెదుర్కొనుచుండిరను విషయం మాత్రం ఈ పత్రికయందంతటను స్పష్టంగా అగుపిస్తుంది. క్రైస్తవులై యుండిన భార్యలు, వారు విశ్వాసులందరితోను పాలుపంపులుగలవారై యుండినందు వలన, విశ్వాసులందరినీ అలుముకొని యుండిన వ్యతిరేకతకు మరియు శ్రమలకు భయపడాల్సిన పనిలేదని బహుశా పేతురు భావించి యుండవచ్చు. సమస్తమును దేవుని ఆధీనములో ఉన్నది. “వారి బెదరింపుల మూలాన బెదరిపోవద్దు మరియు కలవరపడవద్దు” (3:14); “అన్నిటి అంతము సమీపమై యున్నది” (4:7); “లోకము యొక్క ఆగ్రహము మిమ్ములను భయముతో అణగద్రొక్కనీయకుదని” ఆయన సెలవిచ్చుచుండెను.

## భార్యలు తమ భర్తల చేత గౌరవింపబడుట (3:7)

**[7]అటువలెనే పురుషులారా, జీవమను కృపావరములో మీ భార్యలు మీతో పాలివారైయున్నారని యెరిగి, యెక్కువ బలహీనమైన ఘటమని భార్యను సన్మానించి, మీ ప్రార్థనలకు అభ్యంతరము కలుగకుండునట్లు, జ్ఞానము చొప్పున వారితో కాపురము చేయుడి.**

భార్యలకు యియ్యబడిన మందలింపు కంటె భర్తలకు యియ్యబడిన మందలింపు క్లుప్తంగా ఉన్నది, కాని ఈ కొద్ది మాటల్లో ఎంతో విశేషమైన విషయమున్నది. కుటుంబములోని నాయకత్వముతోపాటు బాధ్యత కూడ కలిసి యున్నది. కుటుంబములో భర్త ఒక నియంతగా ప్రవర్తించడానికి అతనికి అధికారపత్రము అందజేయబడలేదు. అతడు తన భార్య చెప్పెడి విషయాలను ఆలకించాలి, ఆమెను గౌరవించాలి మరియు ఆమెకు మర్యాద ఇవ్వాలి.

**వచనము 7.** లోబడుట గూర్చిన ఇదివరకటి రెండు మందలింపులలో ప్రభుత్వాలు మరియు యజమానులు సంబోధింపబడకలేదు. క్రైస్తవ భార్యల నుద్దేశించి ఆదేశింపబడిన ‘లోబడుట’ మాత్రమే, క్రైస్తవ **భర్తలు** తమ **భార్యలను** పరిగణలోనికి తీసికొనవలెననియు, వారిని గౌరవించాలనియు వారికి యియ్యబడిన మందలింపు చేత సమతుల్యం చేయబడింది. ప్రాచీన సమాజంలో ప్రబోధింపబడిన యేసు క్రీస్తు బోధలు, స్త్రీల స్థాయిని చెప్పుకోదగినంతటి ఔన్నత్యానికి తీసుకెళ్లాయి. ప్రాచీన సాహిత్యాన్ని తెరచి చూచినట్లయితే, స్త్రీలలో ఉన్న

గొప్పతనం ఏమాత్రమును పట్టించుకొనబడక వారు పురుషుల చేత ఎంత అల్పులుగా ఎంచబడిరో, ఆ యా విధానాలేమిటో అనేక ఉదాహరణములను బయటకు తీయవచ్చు. ఉదాహరణ యూదీయ చరిత్రకారుడు జోసీఫస్ చేసిన ఒక వాంగ్మూలము తన్ను వెన్నంటి యుండిన రోమీయుల సమాచారము నిమిత్తము యూదీయ నియమమును వర్ణిస్తుంది. సాక్ష్యము ఇద్దరు లేదా ముగ్గురు సాక్షుల ఆధారంగా స్థాపించబడాలి అని చెప్పుతూ, "కాని స్త్రీల సాక్ష్యము, వారి నీచ ప్రవర్తన మరియు సాహసాన్నిబట్టి అంగీకరింపబడకూడదని" అతడు చేర్చాడు.[4] మరొక చోట తన వాంగ్మూలమును లేఖనాలకు ఆరోపించాడు, "స్త్రీ అన్ని విషయములలోను తన భర్త కంటె తక్కువైనదే,"[5] సగజంగానే, లేఖనాలు ఇటువంటి విషయమేమీ చెప్పడం లేదు. ఏ లెక్క ప్రకారమైనా, ఇటువంటి వాంగ్మూలములలో స్త్రీలకు అతి తక్కువ గౌరవము చూపింపబడింది. దీనికి తారతమ్యంగా, **జీవమను కృపావరముతో మీతో పాలివారైయున్నారని యెరిగి ... భార్యను సన్మానింపవలెనని** పేతురు భర్తలకు ఆదేశమురిచ్చాడు.

చర్చింపబడుతున్న అంశము భార్యలు తమ భర్తలకు లోబడి యుండుట గూర్చినదై యున్నందు వలన, భార్య అతనికి లోబడుచున్న అదే రీతిలో, భర్త కూడ ఆమెకు లోబడియుండవలెనను అర్థమును **అటువలెనే** అను పదము సూచింపవచ్చు, కాని భావం అది కాదు. ఈ సందర్భంలోని *homoiōs* అను గ్రీకు పదము "ఇంతే కాకుండా" లేదా "దీనికి అదనంగా" అని అర్థమిస్తుంది. భార్య, తన పక్షాన, తన భర్తకు లోబడియుండవలెను, భర్త, తన పక్షాన, తన భర్తకు లోబడియుండవలెను, భర్త, తన పక్షాన, తన భార్యతో కూడ **జ్ఞానము చొప్పున** కాపురము చేయుచుండవలెను. అతడు ఈ విషయంలో "ఆమె జీవమును కృపావరములో అతనితో కూడ పాలిభాగస్థురాలై యున్నదను" స్థాయికి తగినట్టు మెలగవలెను. అనగా కుటుంబములో భార్యలు మరియు భర్తలు ఒకరి యెడల మరొకరు సభ్యతతోను దయతోను మెలగవలెనని అపొస్తలుడు బోధించుచుండెను.

క్రైస్తవ భర్తలు మరియు భార్యలు ఒకే విమోచన మరియు ఒకే నిరీక్షణను పంచుకొందురు. కుటుంబ విషయాల్లో భార్యలు తమ భర్తలకు లోబడుదురు, లేక లోబడియుండవలెనను విషయం, గనుక వారు దేవుని యెదుట సమానమైనవారు కారని సూచించడం లేదు. **స్త్రీ యెక్కువ బలహీనమైన ఘటమని**[6] పేతురు భర్తలకు చెప్పినప్పుడు, ఆయన స్వయంవిదితమైన విషయాన్ని చెప్పుచుండెను: సామాన్యంగా స్త్రీ, పురుషుడు భౌతికంగా బలంతుడై యున్నంతటి బలముగలది కాదు. భర్త, అటువంటివాడే అయినట్లయితే, తన భార్యను బలవంతంగా లొంగదీసుకొనవచ్చు. భౌతికంగా ఆమెను దూషించవచ్చు, పేతురు మాటలు సారాంశంగా ఇలా వున్నాయి, "నీ భార్యను దూషించడానికి నీరు బలమున్నది, కాని ఇటువంటి ప్రవర్తన క్రైస్తవ నడవడికి బొత్తిగా వెలుపట ఉన్నది." భర్త తన భార్యతో కూడా "జ్ఞానము చొప్పున" అనగా, తెలివికలిగి, మర్యాద చూపిస్తూ – కాపురము చేసినప్పుడు ఇలా జరుగదు. స్త్రీ నైతికంగానైతేనేమి లేదా ఆత్మసంబంధమైన అవగాహనలోనైతేనేమి "బలహీనమైన ఘటము" కాదు. మొత్తం మీద, స్త్రీ కనీసం అనేక పరిస్థితుల్లో, ఆత్మసంబంధముగా భర్త కంటె ఎక్కువ బలమైనదని 3:1 సూచిస్తుంది. ఆమె తన భర్తను దేవునియొద్దకు అది సమీపంగా నడిపించడానికి అనేక అవకాశములు అందుబాటులో ఉంటాయి.

క్రైస్తవ భర్త "భార్యను సన్మానించవలెనని" చెప్పడానికి అపొస్తలుడు రెండు

కారణాలు చూపిస్తున్నాడు: (1) ఎందుకనగా ఆమె "జీవమను కృపావరములో భర్తతో కూడ పాలిభాగస్థురాలై యున్నది," (2) **మీ [భర్తల] ప్రార్థనలకు అభ్యంకరము కలుగకుండునట్లు**. 1:3, 4లో, పరలోకమందు వారి కొరకు దాచబడియున్న అక్షయమగు స్వాస్థ్యము గూర్చి అపొస్తలుడు తన పాఠక మహాశయులకు గుర్తుచేసాడు. భార్యలను పేతురు "పాలివారని" పిలిచినప్పుడు, ఒకరు దేవునితో కలిగియున్న సంబంధమునకును, ఒకరి పరలోక సంబంధమైన స్వాస్థ్యము గూర్చిన నిరీక్షణకును, స్త్రీపురుష భేదముతో (లింగముతో) నిమిత్తమేమియు లేదని ఆయన చెప్పుచుండెను. ఇంకా, క్రైస్తవుడైన భర్త తన భార్య యెడల అనాగరకంగా ప్రవర్తిస్తూ ఆమెను దూషించడానికి, ఆమెను ఏంచేయాలన్నా అది అతని చేతుల్లో ఉండింది. అయితే భర్త తన భార్యను సన్మానించని యెడల, అది దేవునికి అసంతుష్టి కలుగజేస్తుయడమేగాక, అతని ప్రార్థనా జీవితానికి అభ్యంతర కారణమౌతుందని పేతురు చెప్పుచుండెను. భార్య అతనికి లోబడియుండుటను భర్త తనకు సానుకూలము చేసుకుంటూ ఆమెను దూషించినప్పుడు, అతడు దేవునితో సహవసించుట కష్టతరమౌతుంది, అది బహు భారమైనదిగా కూడ ఔతుంది.

ఈ వాక్యభాగమునకును, 1 కొరింథీయులకు 7:5నకును మధ్య ఒక సంబంధమున్నది: "ప్రార్థన చేయుటకు మీకు సావకాశము కలుగునట్లు, కొంతకాలము వరకు ఉభయుల సమ్మతి చొప్పుననే తప్ప, ఒకరినొకరు ఎడబాయకుడి." గృహములోని జీవితం మరియు దేవునితో కూడ గడుపబడు జీవితం, ఈ రెండును ఎంతో సున్నితంగా ఒకదానితో మరొకటి అల్లబడియున్నవి. భర్త తన భార్యను సన్మానించడం కంటె తక్కువగా చూచినప్పుడు, అతడు దేవునికి విరోధంగా పాపము చేసినవాడౌతాడు. కుటుంబములో ఎటువంటి ఏవగింపు ఏర్పడినా, ప్రార్థన, ప్రాణాధారమైనంతటి శ్రేష్ఠమైన మతపరమైన చర్య, ఆట ంకపరచబడుతుంది. భార్య దూషింపబడినప్పుడు పురుషునికి దేవునికి మధ్య గల సంబంధము తెగిపోతుంది. తన భార్యను దూషించువానిని దేవుడు బాధ్యుడుగా లెక్క అడుగునని చెప్పుకొనడం మరీ ఎక్కువ బలముగా చెప్పుకొనబడు విషయమేమీ కాదు.

1 కొరింథీయులకు 7వ అధ్యాయంలో పౌలు పేర్కొన్నట్టుగా, ఒకడు దేవునితో కలిగియుండు సంబంధం విషయంలో కుటుంబ జీవితం మరొక విధంగా సమస్యలు సృష్టించవచ్చు. భర్త, లేక భార్య, లేదా ఇద్దరు కూడ, వారి జీవితంలో దేవునితో యిక పనిలేదన్నట్టుగా గాని, పట్టించుకొనకుండునంతగా గాని, లేదా మర్చిపోవునట్లుగా భర్త భార్యతో లేదా భార్య భర్తతో శారీరకంగాను, భావోద్రేకములలోను, మరియు సామాజిక సంబంధములలోను తలమునకలై యుండవచ్చు. ఇదే జరుగుతూవుందని దంపతులు అర్థంచేసికొన్నట్లయితే, ఇద్దరు కూడ దేవునితో సమయము గడుపడానికి, తమ్మునుతాము ప్రార్థనకు అప్పగించుకోడానికి, పరస్పర అవగాహనతో కొంత కాలము వేరుగా ఉండుటకు సమ్మతింపవచ్చునని పౌలు చెప్పుచున్నాడు. రెండు సందర్భాల్లోను, 1 పేతురు 3:7 మరియు 1 కొరింథీయులకు 7లోను, ఆత్మసంబంధమైన జీవితం మరియు కుటుంబ జీవితం ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయనేది స్పష్టంగా కనబడుతుంది.

ఒక పురుషుడు మరియు ఒక స్త్రీ వైవాహిక బంధంలో జీవితాంతము వరకు జోడింపబడి యుందురని తర్కించడానికి పేతురు ఎక్కువ సమయం తీసికోలేదు. అన్ని పక్షముల వారిలో ఏకీభావమున్నపప్పుడు ఏదైన ఒక విషయం గూర్చి వాదించాల్సిన అవసరమే లేదు. ఒకే భర్త

లేదా ఒకే భార్య ఉండటం బైబిలు బోధ ప్రకారమైన వివాహమునకు నిర్ణీత ప్రామాణికమై యున్నది. లైంగికత్వము దేవుడిచ్చిన వరమై యున్నది. గనుక ఈ వరము కూడ ఇతర వరముల వలెనే ఆనందంతో అనుభవింపబడవలెను. అదే సమయంలో, లైంగికత్వమును వ్యక్తము చేసికొనుటలోని ఆహ్లాదమును మించిన భావమున్నది మరొకటి లేదు. లైంగిక సంబంధము కేవలము ఒక తమాషాగా మారినప్పుడు, త్వరలోనే అది తమాషాగానే ఉండదనేది కూడ నిజమే. లైంగిక వాంఛను తృప్తిపరచుకొనడానికి భర్త భార్యను/భార్య భర్తను ఉపయోగించుకొనినప్పుడు, ఇరువురి మధ్య అనుబంధం లేనప్పుడు, అనురాగం లేనప్పుడు, నిబద్ధత లేనప్పుడు, ఫలితం అవమానం మరియు మించింది మరొకటి లేదు. ఇదే సంబంధంలోని సన్నిహితము మరియు నిబద్ధత పరిత్యజింపబడినప్పుడు, చెడుతనానికి సంభావ్యతగల విషయం మరొకటి బహుశా ఉండదు.

ఆది యందు మానవుడు ఒంటరివాడై యుండినప్పుడు, దేవుడు వాని కొరకు స్త్రీని, అతని భాగస్వామిగా ఉండుటకు యోగ్యురాలైన సుందరిని సృజించాడు. దేవుడు స్త్రీని సృజించినప్పుడు, ఆయన ప్రాథమిక ఉద్దేశం పురుషుని లైంగిక ఇష్టసిద్ధియే అయియుండియుంటే. ఆయన అంతఃపుర స్త్రీలనే సృజించియుండవచ్చు. ఏదెను తోటలో బహుభార్యత్వము లేదు. తొలి దంపతులు ఉనికి లోనికి వచ్చింది ఈ తోటలోనే. మా కుటుంబాన్ని ఎప్పటికీ నిర్దేశించడానికి దేవుడు ఒక నియమమును ఏర్పాటుగావించాడు: “కాబట్టి పురుషుడు తన తండ్రిని తన తల్లిని విడిచి, తన భార్యను హత్తుకొనును; ఏక శరీరమైయుందురు” (ఆదికాండము 2:24).

## నీతి కొరకు శ్రమనొందువారికి గల ఆశీర్వాదము (3:8–17)

### దేవుని ఆశీర్వాదములు కోరుతున్న పరిశుద్ధ జీవితము (3:8–12)

**8తుదకు మీరందరు ఏకమనస్కులై యొకరి సుఖదుఃఖములయందు ఒకరు పాలుపడి, సహోదరప్రేమ గల వారును, కరుణాచిత్తులును, వినయమనస్కులునై యుండుడి,
9ఆశీర్వాదమునకు వారసులవుటకు మీరు పిలువబడితిరి గనుక కీడుకు ప్రతికీడైనను దూషణకు ప్రతిదూషణయైనను చేయక దీవించుడి.**

> **10–జీవమును ప్రేమించి మంచి దినములు చూడగోరు వాడు చెడ్డదాని పలుకకుండ తన నాలుకను, కపటపు మాటలు చెప్పకుండ తన పెదవులను కాచుకొనవలెను. 11అతడు కీడునుండి తొలగి మేలుచేయవలెను, సమాధానమును వెదకి దాని వెంటాడవలెను. 12ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునను ఉన్నవి గాని ప్రభువు ముఖము కీడు చేయువారికి విరోధముగా ఉన్నది.**

**వచనం** 8. ఈ వచనంలో, లోబడుటకు సంబంధించి ఆయన చెప్పదలచిన దాని **మొత్తం సారాంశాన్ని** పేతురు చెప్పాలని ఆశించాడు. సంబంధిత మాటలు, వారు దాసులైనా లేక యజమానులైనా, భార్యలైనా లేక భర్తలైనా, పోలీసువారైనా లేక సామాన్య

పౌరులైనా, విశ్వాసులందరిని ఉద్దేశించినవై ఉన్నాయి. అంతకు మునుపటి వచనాల్లో, విశ్వాసులు అవిశ్వాసుల యెడల మరియు అవిశ్వాసుల యెదుట మెలగాల్సిన విధానము గూర్చి పేతురు తెలియజెప్పాడు.ఒకడు తన సాటి సహోదరులతో, తోటి మానవులతో ప్రవర్తించు తీరునుసరించి దేవునితో గల సరైన సంబంధం అభివృద్ధిచెందుతుంది, కాని ఒక క్రైస్తవునికి మరొక క్రైస్తవునితో గల బంధము యెడల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సివుంది (గలతీయులకు 6:10 చూడుము). పౌలు, కొలొస్సయులకు 3:12-14లో, క్రైస్తవులు ఒకరితో నొకరు ఎలా ప్రవర్తించాలో నిర్దేశించు సద్గుణముల సుదీర్ఘ జాబితా నిచ్చాడు. తన వంతుకు, తిరిగి జన్మించనివారు ఒకరితో మరొకరు వ్యవహరించు విధానమునకు సంబంధించిన ఒక ప్రవర్తనా నియమావళి జాబితాను పేతురు ఇదివరకే ఇచ్చాడు: దుష్టత్వము, కపటము, వేషధారణ, అసూయ, మరియు దూషణ మాటలు (2:1). అయితే విశ్వాసుల సమూహము లోపల వారిప్రవర్తన విస్తృతంగా భిన్నమైనదై ఉండాలి. పేతురు ప్రయోగిస్తున్న ప్రతి ఒక్క మాట వ్యాఖ్యానింపదగినదే.

వారు రక్షింపబడినవారి సమూహముతో కలిసి జీవించుచుండిన జీవితాల్లో, విధేయులైన విశ్వాసులు **ఏకమనస్కులై యుండవలసినది**. వారు ఒకే మనస్తత్వముగలవారై యుండవలెను. అక్షరాలా "ఏక మనస్కులై యుండుడి" అని అర్థమిచ్చు *homophrōn*, అనే గ్రీకు పదము, క్రొత్త నిబంధనలో ఇచ్చట మాత్రమే అగుపిస్తుంది. విశ్వాసుల మధ్య ఉండాల్సిన ఐక్యత క్రొత్త నిబంధనలో, ఎన్నటికినీ ముగియని ప్రధానాంశమై యున్నది. రెండవ శతాబ్దమునాటి తొలి రోజుల్లో, "వెల్లతో వాయించబడే వీణ వంటి వాయిద్యంలోని తీగలు శ్రుతిబద్ధం చేయబడియుండవలెనని" సంఘ నాయకుడైన ఇగ్నేషియస్, తన పాఠకులను బతిమాలాడు.[7] వారు "ఏకమనస్కులై యుండవలెనని" పేతురు ఇచ్చుచున్న పిలుపు, వారు సమష్టి స్వభావములలో పాలుపంపులుగలవారై యుండవలెననియు, క్రీస్తు శరీరములోని ఆతురతను మరియు ఆనందాన్ని అపహరించు అల్పమైన కలహాలకు స్వస్తిచెప్పడం ఉత్తమమనియు వారికి చెప్పడానికి అదొక విన్నపమై యుండింది. సంఘము ఎదుర్కొనుచుండిన ప్రతి సమస్య విషయంలోను విశ్వాసులందరు ఇదే విధంగా ప్రవర్తింపవలెనని అది పరోక్షంగా చెప్పుచుండిన ఆదేశమై యుండింది. దాని కంటె విశేషంగా వారు ఒకరి యెడల మరొకరు మర్యాదగా ప్రవర్తిస్తూ, సహేతుకంగా తర్కించాలనియు, తత్ఫలితంగా వారు నిజ క్రైస్తవ జీవితాన్ని ఒప్పుకొనడం మరియు అభ్యసించడంలో ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉండవలెననియు చెప్పడానికి అదొక మందలింపై యుండింది.

సుఖదుఃఖముల యందు పాలుపడుట అని అర్థమిచ్చుచున్న ఆంగ్ల పదము **sympathetic**, యొక్క మూలము *sumpathēs* అనే గ్రీకు పదములో ఉన్నది, తన పాఠక మహాశయులు ఏక మనస్కులై యుండుట మాత్రమే కాదుకాని వారు తమ హృదయస్పందన విషయంలో కూడ ఒకే స్థాయిలో ఉండాలని, అందరి భావోద్రేక బంధములలో పాలుపంచుకొనుచున్నవారై యుండాలని పేతురు ఆశిస్తున్నాడు. యేసు, మన ప్రధాన యాజకుడు, మానవ బలహీనతలయందు సహానుభూతిని ప్రదర్శిస్తున్నాడని హెబ్రీ పత్రిక రచయిత చెప్పుతున్నాడు (4:15). సహానుభూతి చూపిస్తున్నంత మాత్రాన అది ఆమోదించడం కాదు. అతని ప్రవర్తన అతనికి మరియు క్రీస్తు శరీరమను సంఘ సభ్యులకును అవమానము కలుగజేయవచ్చునని ఒప్పింపబడుతూ కూడ ఒకరు మరొకరి

బలహీనతలు మరియు ప్రయాసములలో వారి సహానుభూతిని ప్రదర్శింపవచ్చు. ఈ మాట, ఇంతకు మునుపటి దాని వలెనే, దాని వలెనే, దాని నామవాచక రూపంలో, క్రొత్త నిబంధనలో ఇచ్చట మాత్రమే అగుపిస్తుంది.

**సహోదర** (*philadelphos*) అని NASB అనువదిస్తున్న పదము, యేసు తమ ప్రభువై యున్నాడని ఒప్పుకొనువారిని గుర్తించు గుణలక్షణమై యుండవలెనని "సహోదర ప్రేమ" లేక "సహోదర దయ" పిలుపునిస్తుంది. 1:22, 23లో పేతురు ఇటువంటి పదమునే ప్రయోగించినప్పటికిని, ఈ రూపంలో, ఈ పదము క్రొత్త నిబంధనలో ఇచ్చట మాత్రమే అగుపిస్తుంది. ఈ విశేషణం దీనికి ముందటి పదమునుఅభివృద్ధిచేస్తూ దానిని తీవ్రతరం చేస్తుంది. విశ్వాసులు ఒకరి అనుభూతులలో మరొకరు పాల్గొనుట మాత్రమే కాదు, కాని వారి జీవితములు, జీవితాశలు, మరియు మేళ్లు కలిసికట్టుగా కట్టబడినట్లున్నాయను భావంతో, సోదర సోదరీమణుల సంక్షేమమును వెదకుచుండవలెను. క్రైస్తవులంతా ఒకే కుటుంబ సభ్యులై యున్నారు.

ప్రాచీన ప్రజలు, భావోద్రేకములకు కేంద్రమని, తరచుగా హృదయం గూర్చి కాదు, కాని పేగుల గూర్చి తలంచుచుండిరి. అపొస్తలుడు ప్రయోగిస్తున్న తరువాతి విశేషణం, **కరుణా చిత్తులును**, వారు ఒకరి యెడల మరొకరు "ఆరోగ్యకరమైన పేగులు కలిగియుండవలెనని" (*eusplanchnos*) విశ్వాసులను విన్నవించుకొనుచున్నది. NASB **దయాహృదయము** అని అనువదిస్తుంది, ఇదొక మంచి అనువాదమే, ప్రాచీన వైద్య సాహిత్యంలో, ఒకడు ఆరోగ్యవంతమైన పేగులు కలిగియున్నాడను అక్షరార్థము నిచ్చునదిగా ప్రయోగింపబడింది. క్రొత్త నిబంధనలో ఈ పదము ఇచ్చట మరియు ఎఫెసీయులకు 4:32లో మాత్రమే అగుపిస్తుంది, అయితే "దయ" లేక "దయగల" అని అర్థమిచ్చు ఇతర పదములు సామాన్యంగా అగుపిస్తాయి. పేతురు తన పాఠక మహాశయుల ఆత్మలనుపరిశీలనగా పరిశీలించడాన్ని కొనసాగిస్తున్నాడు, స్త్రీపురుషులను కలిసికట్టుగా కలిపియుంచు లోతైన భావోద్రేక బంధములను పెంపొందించుకొనవలెనని వారికి పిలుపునిస్తున్నాడు.

మనము అధ్యయనము చేయుచున్న విశేషణముల జాబితాలో చివరిది, **వినయమనస్కులై**, *tapeinophrōn*, మరి ముఖ్యంగా ఆసక్తికరమైనదై యున్నది. NASB ఈ పదమును **వినయము గల మనస్సు** అని అనువదిస్తుంది. లౌకికమైన, గ్రీకులు మరియు రోమనులు మిళితమై జీవించుచుండిన ప్రపంచంలోని ప్రజలు వినయముగల మనస్సునకు ఏమంత విలువనియ్యలేదు. ఆ రోజుల్లో గొప్ప వంశములో పుట్టినవారు ప్రజా ప్రశంసను చురుకుగా వెదికారు. తాము సాధించిన విషయాలను పలు చోట్ల ప్రసారం చేయడానికి వారు ఎవ్విధంగాను వెనుకాడలేదు[8]. పాశ్చాత్య సంస్కృతిలో, అతిశయోక్తులు పలుకుట గూర్చి ఎక్కువ యుక్తిపూర్వకంగా ఉండటానికి ఒకరు నేర్చుకొవచ్చు. మనము ఎక్కువ వినయమనస్కులమై యుండుటకు నేర్చుకొనియున్నామనేది సందేహమే. వినయమనేది, ఒకడు ఏదైన ఒక విషయమును, దానిని చేయడం ద్వారా అది అతనికి కలుగజేయు గొప్పతనమునుబట్టి కాదు, కాని దాని స్వతఃస్సిద్ధమైన విలువనుబట్టి సరైన విధంగా చేయు మనస్సు యొక్క ఒక స్థితియై యున్నది. ఇంత వరకు మనము చెప్పుకొనిన ఇతర పదములన్నీ ఒకరు సాటి సోదర సోదరీమణుల యెడల కలిగియుండాల్సిన స్వభావము గూర్చి చెప్పియున్నట్లయితే, ఈ పదము ఒకడు తన అంతర్యమును పరిశీలనగా

పరిశీలించుకొనవలెనని పిలుపునిచ్చుచున్నది. క్రైస్తవుడు తోటి విశ్వాసుల సంక్షేమము విషయమై చింతించుచుండవలెను; తన సొంత పేరుప్రతిష్టలు కాదు.

**వచనం 9**. ఇప్పుడు అపొస్తలుని ఆలోచనలు క్రైస్తవేతరులైన వారితో క్రైస్తవులు కలిగియుండాల్సిన సంబంధము మీదికి మళ్లాయి. ఇంకా కొన్ని వచనాల తరువాత (3:13), అణగద్రొక్కు లోకము యెడల విశ్వాసుల ప్రతిస్పందన ఎలా ఉండాలో అపొస్తలుడు చెప్పబోతున్నాడు. ముందటి వచనంలో ఆదేశింపబడిన లక్షణాలన్నీ **కీడుకు ప్రతికీడైనను దూషణకు ప్రతిదూషణయైనను** అను మాటలతో పొసగుచుండలేదు, కాని క్రైస్తవుడైనవాడు విశ్వాసుల విషయంలోనైతేనేమీ, అవిశ్వాసుల విషయంలోనైతేనేమీ ఇవ్విధంగా ప్రవర్తింపకూడదు. 'దెబ్బకు దెబ్బ' అను విధానం క్రైస్తవుని ప్రవర్తనలో ఎన్నడును చోటుచేసుకొనజాలదు, యేసే మనకు మాదిరి అంటూ పేతురు ఇదివరికే చెప్పాడు: "ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు" (2:23). పౌలు రోమీయులకు వ్రాసిన పత్రికలో, "మిమ్మును హింసించువారిని దీవించుడి; దీవించుడి గాని శపింపవద్దు" మందలించాడు (రోమీయులకు 12:14). ఇంకా, "కీడుకు ప్రతికీడెవనికిని చేయవద్దని" కూడ చేర్చాడు (రోమీయులకు 12:17). పౌలు రోమీయులకు వ్రాసిన పత్రిక మరియు పేతురు వ్రాసిన మొదటి పత్రిక మధ్య గల సమాంతరములు గణనీయమైనవై యున్నవి.

పగతీర్చుకొను విషయాన్ని దేవునికి వదిలిపెట్టలని పాత నిబంధన ప్రబోధిస్తుంది (ద్వితీయోపదేశకాండము 32:35; సామెతలు 20:22), కాని అది *lextalionis* తో, ప్రతీకార నియమముతో బలపరచబడింది: "కంటికి కన్ను, పంటికి పన్ను, చేతికి చెయ్యి, కాలుకు కాలు, వాతకు వాత, గాయమునకు గాయము, దెబ్బకు దెబ్బ" నియమమై యుండింది (నిర్గమకాండము 21:23–25). ఎర్నెస్ట్ బెస్ట్ మృత సముద్రపు కాగితపు చుట్టలలో నుంచి ఒక దానిని ఎత్తి చూపించాడు, సమాజంలోని సభ్యులందరు, "వెలుగు కుమారులను ప్రేమింపవలెననియు ... చీకటి కుమారులను ద్వేషింపవలెననియు" అది వారిని ప్రోత్సాహించింది.[9] ప్రతీకారము, ప్రవర్తనా నియమమై యుండకూడదని యేసు దానిని తృణీకరించాడు (మత్తయి 5:39). పేతురు కూడ అదే ఉద్భోధిస్తున్నాడు. దూషణ మరియు అవమానపరచడం, అన్యమతారాధికుల ప్రపంచంలో సంఘమును అణగద్రొక్కడానికి చేయబడుచుండిన ప్రయత్నాల్లో తమ్మునుతాము ప్రతిరక్షించుకోడానికి ప్రయోగింపబడుచుండిన యుద్ధోపకరణముల వంటివై యుండినవి. బహుగా దురాగతమైనదై యుండిన దూషణ పంపిణీ చేయబడింది. ప్రభువు దినాన క్రైస్తవులు సమావేశమైనప్పుడు వారు రక్తమును త్రాగుచుండిరనే కట్టు కథలు వ్యాపించుచుండినవి. వారు పిల్లలను బలి చేయుచు నరమాంసమును భక్షించుచుండిరని కొందరు చెప్పుచుండిరి. ఈ దూషణ లకు క్రైస్తవులు అదే విధంగా ప్రతిస్పందించి యుండవచ్చు. ఇటువంటి ప్రతీకార చర్యలు క్రైస్తవులకు తగవని పేతురు చెప్పుచుండెను.

క్రైస్తవులు, కీడుకు మరి ఎక్కువ ప్రతికీడు చేయుట మాత్రమే నిషేధింపబడలేదు, కాని వారు కీడుకు ప్రతిగా మేలు చేయవలెనని బోధింపబడిరి. శపింపబడుతూ అవమానపరచబడినప్పుడు, క్రీస్తు మనస్సును స్వాయత్తం చేసుకొనినవాడు దానికి **బదులుగా దీవించవలసినవాడై యుండెను**. యేసు ఇదే విధంగా బోధించాడు, "దుష్టుని ఎదిరింపక; నిన్ను కుడి చెంప మీద కొట్టువాని వైపునకు, ఎడమ చెంప కూడ త్రిప్పుము"

(మత్తయి 5:39). అపరాధము చేసినవాని యెడల ఆశీర్వచనపు మాటలు పలుకుట శ్రేయోదాయకమైన ఉదాసీనతతో ప్రతిస్పందించుటను మించినదై యున్నది. అనగా, అవతలి వ్యక్తి సంక్షేమమును కోరుతూ దానిని ప్రోత్సాహించుటయై యున్నది. అనగా, అతని దీర్ఘయుష్షును, మంచి ఆరోగ్యమును, మరియు ప్రగతిని - అతని జీవితాన్ని సుఖసంతోషమయం చేయువాటిన్నిటిని ఆశించుటయై యున్నది. వ్యతిరేకార్ధకంగా చెప్పుకున్నట్లయితే, ద్వేషాన్ని మనస్సులోనే ఉంచుకున్నట్లయితే అది క్రీస్తును పోలిన జీవితాన్ని పోషించు నీళ్ల బావిని విషపూరితం చేసినదౌతుందని పేతురు ధ్వనించుచుండెను. "కీడువల్ల జయింపబడక, మేలు చేత కీడును జయించుమని" పౌలు రాసాడు (రోమీయులకు 12:21).

అవమానపరచబడినప్పుడు దానికి ప్రతిగా "దీవించుట," మేలు చేయడం ద్వారా కీడును జయించడం, క్రైస్తవ అభ్యాసాల్లో పైపై పూతలతో కూడిన బాహ్య పనులు కావు. అవే ప్రధానమైనవై ఉన్నాయి. ఆశీర్వాదమునకు వారసులవుటకు మీరు పిలువబడితిరని అపొస్తలుడు తన పాఠక మహాశయునకు గుర్తుచేస్తున్నాడు. "యేసు క్రీస్తు ప్రత్యక్షతపై" తన దృష్టిని సారిస్తూ (1:7), కీడుకు బదులుగా మేలు చేయడం వారి స్వాస్థ్యములో (1:3, 4) ప్రధాన భాగమై యున్నదని పేతురు తన పాఠకులకు గుర్తుచేస్తున్నాడు. ప్రభువు అడుగుజాడలను అనుసరిస్తారని తమ్మునుతాము అప్పగించుకొనినప్పుడు వారు ఆలింగనము చేసుకున్న జీవితం, వారి స్వాస్థ్యములోని ముఖ్యమైన భాగమై యుండింది. క్రైస్తవులు ఇతరులను దీవించినప్పుడు వారు దీవెన పొందుదురు. క్రీస్తును పోలిన జీవిత విధానం నిత్య ఆశీర్వచనములకు నాంది కాదు; నిత్య ఆశీర్వచనముల నిమిత్తమై అంత కంటె తక్కువ విలువ చెల్లించనూలేము. క్రైస్తవ జీవితమే దీవెనయై యున్నది.

**వచనం 10.** పేతురు ఇంతకు మునుపే ప్రకటించిన సత్యమునకు చేదోడువాదోడుగాను, సత్యమును మరింత ఉన్నతమైన స్థాయికి తీసికొనివెళ్లడానికిగాను, అపొస్తలుడు కీర్తనలు 34:12-16లో గల మాటలను ఉదహరించి చెప్పుతున్నాడు. కీర్తనల గ్రంథంలో చెప్పబడింది LXXలో నుంచి తీసికొనబడినదై యున్నది, LXX, హీబ్రూ పాత నిబంధన యొక్క గ్రీకు అనువాదమై యున్నది, అది ఆ రోజుల్లో పేతురు సంబోధించిన గ్రీకు భాష మాటలాడుచుండిన ప్రజల మధ్య ప్రచలితమై యుండింది. 34వ కీర్తన అంతా కూడా అణగద్రొక్కబడుచున్నవారికి దేవుడు తన ప్రజలను విడిపించునను ఆశ్వాసమిస్తుంది, ఆ రోజుల్లో పేతురు పాఠకులు అణగద్రొక్కబడుచుండిరి గనుక ఈ సందేశం వారికి సరియైనదై యుంటుందని అతడు ఆశించాడు. కీర్తనలు 34:8లోని మాటలు పేతురు ఇదివరకే ఉపయోగించి చెప్పాడు: "ప్రభువు దయాళుడని మీరు రుచిచూచియున్న యెడల" (2:1). కీర్తనలోని **జీవమును ప్రేమించి మంచి దినములు చూడగోరుట** అను మాటలు ప్రస్తుత యుగములో జీవింపబడుతున్న జీవితాన్ని సూచిస్తున్నాయి. ఈ యుగములో మంచిగా జీవించవలెనని కోరుతున్నట్లయితే, **ఒకడు చెడ్డదాని పలుకకుండ తన పెదవులను కాచుకొనవలెనను విషయాన్ని** పేతురు కూడ విశ్వాసించాడు; కాని అతని మనస్సులో అంతకు మించిన ఆలోచనలుండినవి. అతని విశ్వాసం, అతని కళ్లెదుటే ఎప్పుడు కనబడుతుందా యని క్రైస్తవులు ఎల్లప్పుడు తన కనుదృష్టికి కష్టం కలిగించుకుంటున్నాడు. 1:6-9 మరియు 4:12-14లో వలె, విశ్వాసులు "యేసు క్రీస్తు ప్రత్యక్షత" కొరకు కనిపెట్టుకొని యున్నారు,

కాని ఈ మధ్యకాలంలో వారి ఆనందం చెప్పశక్యముకానిదై యున్నది. మంచి జీవితం ఇదే, మంచి దినములు ఇవే, అయితే వాటి కోసం వేచియుండటం కూడ జరుగుతుంది.

నాలుక. ఒకరి భక్తిపూర్వకమైన జీవితాన్ని కొలుచు వాయుభార మాపకం వంటిదై యున్నదనడానికి సంబంధించినంత వరకు పేతురు మరియు యాకోబు ఒకే మనస్తత్వంగలవారై యుండిరి. "ఎవడైనను మాటయందు తప్పనియెడల అట్టివాడు లోపము లేనివాడై, తన సర్వశరీరమును స్వాధీనమందుంచుకొన శక్తిగలవాడగునని" యాకోబు చెప్పుచున్నాడు (యాకోబు 3:2). నాలుక అదుపులో లేనట్లయితే, జీవముండదు, మంచి దినములుండవని పేతురు ఉదహరించి చెప్పిన కీర్తన రూఢిపర్చుతున్నది. క్రైస్తవులు దుర్భావములతో కూడిన దూషణల పాలౌతున్నప్పుడు, భక్తిపూర్వకమైన జీవితానికి నాలుకను అదుపులో పెట్టుకొనడం మరి ఎక్కువ కీలకమైన విషయమయ్యింది. కాబట్టి ఈ సందర్భంలో క్రైస్తవులు సహితం దుర్భాషలాడటానికిని ద్వేషించడానికిని మొదలుపెట్టి యుండినట్లయితే, వారు తమ మీదికి తామే దేవుని అనంగీకారమును కొనితెచ్చుకొని యుండెడివారే గాక, పొరుగువారైన అన్యమతారాధికుల అదనపు అనిష్టానికి కూడ గురయ్యేవారే.

**వచనము 11**. క్రీస్తు తన ప్రజలను పిలిచిన జీవితమునకు తగినట్టు జీవించడానికి నాలుకను తగు విధంగా అధీనంలో ఉంచుకొనడం మరియు ఉపయోగించుకొనడం ఎంత ప్రాముఖ్యమైనదై యుండిందో, అంతే ప్రాముఖ్యమైన ఇతర విషయాలు కూడ ఉన్నవి. దేవుని వారైన స్త్రీపురుషులు **కీడు నుండి తొలగి మేలు చేయుదురని** ఈ కీర్తన సెలవిస్తుంది. అది కూడా, "మంచి దినములు చూడగోరువారి" జీవిత విధానంలో భాగమై యున్నది. యేసు అన్యోన్య వైరుధ్యాన్ని తెలిపే గణనీయమైన ఒక విషయాన్ని ఈ విధంగా తెలియజెప్పాడు, "గోధుమ గింజ భూమిలో పడి చావకుండిన యెడల, అది ఒంటిగానే యుండును; అది చచ్చిన యెడల, విస్తారముగా ఫలించును. తన ప్రాణమును ప్రేమించువాడు, దానిని పోగొట్టుకొనును; ఈ లోకములో తన ప్రాణమును ద్వేషించువాడు నిత్యజీవము కొరకు దానిని కాపాడుకొనునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 12:24, 25). దానిని పోగొట్టుకొనువాడు, స్వార్థపరాయణుడే, "తన ప్రాణమును ప్రేమించువాడే." వ్యతిరేకార్థకంగా చూచినట్లయితే, ఒకడు జీవము కలిగి బ్రతుకగోరుచున్నట్లయితే, వాడు "కీడు నుండి తొలగిపోవలెను." నిర్మాణాత్మకంగా చూచినట్లయితే, "వాడు మేలు చేయవలెను."

ఒకడు సమాధానము వెంటబడి దానిని వెదకినప్పుడు కలిగే ఫలితం, జీవం. కీర్తనకారుడు మరియు పేతురు విషయంలో, సమాధానమనేది ఒకడు క్రైస్తవుడై యున్నాడని అనుకొననివానిలోని ఒక నిశ్చేష్టమైన లక్షణము కాదు. **సమాధానమును వెదకి దాని వెంటాడవలెనను** మాటల్లో కార్యశీలకమైన, యుద్ధప్రాతిపదకన ముందడుగు వేయుచున్న ఒత్తిడి కనబడుతుంది. LXXలో గల *eirēnē* అనే గ్రీకు పదము, హీబ్రూ భాషలోని *shalom* అను సమానార్థమిచ్చుచున్నది. హీబ్రూ భాషాప్రభావాన్నిబట్టి, కీర్తనలు 34:14లోని గ్రీకు పదము (MTలోని 34:15, LXXలోని 33:14) కూడ హితకరము, ఆరోగ్యము, రక్షణ, మరియు ఒకనికి వాని ప్రపంచంతో గల సామరస్యమైన సంబంధం అను అర్థమును కూడ ఇచ్చుచున్నది. క్రొత్త నిబంధన గ్రంథకర్తలు (లూకా తప్ప) యూదులై యుండిరి. వారి దృష్టిలో "సమాధానము," హెబ్రీయుల వాడుక ప్రకారం, వారు ఒకరి నొకరు కలిసికొనినప్పుడు మరియు ఒకరి నుంచి మరొకరు విడిపోవుచుండినప్పుడు అభినందనలు తెలుపుకొనుచుండిన

ఒక పదమై యుండింది. ఎదుటి వ్యక్తికి సమాధాన అభినందనమును నీవందిస్తున్నావంటే, అతని జీవితమంతయు మేలు చేత అలుముకొనబడి యుండవలెనని నీవు కోరుతూ ప్రార్థించు విషయాన్ని అది ప్రకటిస్తుంది. సమాధానమనగా, అది కేవలము కలహము లేకపోవడము మాత్రమే కాదు, అది దానిని మించినదై యున్నది. అది ఒకని ప్రక్కలోనే దేవుని సన్నిధి మరియు శక్తి ఉన్నవని తెలిసియుండుటనుబట్టి వాని అంతరంగములో అనుభవింపబడు సమాధానమును మించినదై యున్నది. సమాధానమునకు సమాజ కోణానికిని ఎల్లప్పుడు అవినాభావ సంబంధముంటున్నది. అది ఇతరులతో గల సమాధానమై యున్నది. పాపము సమాధానమును అపహరిస్తుంది. సమాధానము మరియు న్యాయము, అక్కచెల్లెండ్లు. ఒకడు మరొకని దూషించగల శక్తి లేదా అధికారము కలిగియున్నప్పుడు, సమాజంలో అన్యాయమును వ్యాపింపజేయు నియమ నిబంధనలు ఏర్పాటుగావింపబడినప్పుడు, సమాధానముండదు. సమాధానము కొరకైన వాంఛ, మానవులకు సంబంధించిన సకల విషయాల్లో సకల మానవులకు న్యాయము చేకూర్చబడవలెను, పేదల యెడల న్యాయముగా ప్రవర్తింపవలెను, సమాజంలోని వారందరు సమాజమంతటి శ్రేయస్సు కోసం పాటుపడగల అవకాశాలు అందరికీ అందుబాటులో ఉండవలెనను క్రైస్తవ ఆందోళనకు ఒక సాక్ష్యమై యున్నదఇ. ఈ అవగాహన చొప్పుననే సమాధానమనేది దేవుని బిడ్డల మనస్సుల్లో ఎల్లప్పుడు నెలకొని యుంటుంది. “మీకందరికిని సమాధానము కలుగును గాక”అని వ్రాస్తూ పేతురు ముగించాడు (5:14). “... శాంతముగలవారై, ఆయన దృష్టికి ... కనబడునట్లు జాగ్రత్తపడుడి” అను మందలింపును అపొస్తలుడు తన రెండవ పత్రికను దాదాపుగా ముగిస్తున్నప్పుడు రచించాడు (2 పేతురు 3:14). “నీకు సమాధానము కలుగును గాక. మన స్నేహితులు నీకు వందనములు చెప్పుచున్నారు. నా యొద్దనున్న స్నేహితులకు పేరు పేరు వరులను వందనములు చెప్పుము” అను మాటలతో యోహాను తన మూడవ పత్రికను ముగించాడు (3 యోహాను 15).

అభివందన వచనము (1:2) మరియు ఆశీర్వచనముతోపాటు (5:14) పేతురు ఈ పదమును ఇచ్చట మాత్రమే ప్రయోగించాడు. ఔను. ఆయన బుద్ధిపూర్వకంగానే ఈ పదాన్ని ప్రయోగిస్తున్నాడు. “సమాధానము” క్రైస్తవ జీవితములో ప్రమాదవశాత్తు ఉద్భవించే ఉప ఉత్పత్తి కాదను విషయాన్ని స్పష్టం చేయాలని ఆశిస్తున్నాడు. దీనితో పౌలు సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాడు. “కాబట్టి సమాధానమును, పరస్పర క్షేమాభివృద్ధిని కలుగజేయువాటినే ఆసక్తితో అనుసరింతుము” (రోమీయులకు 14:19). విశ్వాసుల మధ్య సమాధానము నెలకొని యుండాలని పౌలు తాపత్రయపడుచుండెను, కాని క్రైస్తవులు క్రైస్తవేతరులైన తమ పొరుగువారితో సమాధానము ప్రమాదవశాత్తు సంభవించదు. యేసు, “సమాధానపరచువారు ధన్యులు” అని సెలవిచ్చాడు (మత్తయి 5:9). సమాధానమును నెలకొల్పు విషయంలో క్రైస్తవులు, “సమస్త స్త్రీపురుషులను క్రీస్తు నందు సమాధానపర్చడానికి ప్రయాసపడవలెను, ఏలయనగా ఈ కార్యకలాపము ద్వారానే వారు ఉత్తమంగా దేవుని అనుకరించువారై యుంటూ, దేవుడు క్రీస్తునందు ఆరంభించిన దానిని ముందుకు కొనసాగిస్తూ, అదే విషయం పరిశుద్ధాత్మ యందును కొనసాగునట్లు” నిర్మాణాత్మకమైన ప్రేరణ శక్తులై యుందురు. ఇది వారికి మంచి ఆదర్శమై యున్నది.[10]

వారు క్రియాశీలకమైన వ్యూహరచనను వెంటాడవలెననియు, తత్ఫలితంగా వారికిని

ఇతరులందరికిని మధ్య సౌహార్దము తలెత్తవలెననియు పేతురు తన పాఠకులను విన్నవించుకొనుచున్నాడు. ఇట్టి క్రియాశీలకమైన వ్యూహరచనకు నాలుక స్వాధీనంలో ఉండుట మరియు నైతికంగా నీతిమంతమైన జీవితం అవసరమై యుండినవి. వ్యతిరేకార్థకంగా, ఒకడు "చెడ్డ మాటలు పలుకకుండ తన నాలుకను కాచుకొనవలెను." నిర్మాణాత్మకంగా, వాడు "మేలు చేయవలెను," "సమాధానమును వెదకి దాని వెంటాడవలెను." అప్పుడు దేవుని ఆశీర్వాదము వారికి స్వాస్థ్యముగా పరిణమిస్తుంది (3:9).

**వచనము 12**. కీర్తన 34 పేతురు పాఠకులకు గొప్ప అభయమును కలుగజేసింది. వారు క్రీస్తును అంగీకరించి, వారి పితరులు ఎరిగియుండి సేవించిన ప్రాచీన దేవతలను విడిచిపెట్టారు. అయితే పరిస్థితులు ఎందుకు విషమించాయి? ఈ విశాల విశ్వమంతటి ఏకైక దేవుడు వారి గూర్చి సరైన శ్రద్ధ ఎందుకు వహించలేదు? "దేవుడు మిమ్ములను మర్చిపోలేదు" అని అర్థమిచ్చు మాటలను కీర్తన తెలియజెప్పుతున్నది. విశ్వాసులు సరైనది చేసినప్పుడు, దేవుడు దానిని చూచును. దేవుడు వారి ప్రార్థనలు వింటాడు. ఇంకా, **ప్రభువు ముఖము కీడు చేయువారికి విరోధముగా ఉన్నది**. తీర్పు తీర్చుటకు ప్రభువు తిరిగి వచ్చినప్పుడు, నీతిమంతులను అణగద్రొక్కువారు ఆయనకు లెక్క ఒప్పజెప్పవలసి యుంటుంది. దేవుడు కీడు చేయువారికి విరోధియై యున్నాడు. దేవుడు తనదైన లోకంలో క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు. గనుక మనము నిరాశాపరులము కాకూడదు, విశ్వాసమును కోల్పోకూడదు. కీర్తనలో "ప్రభువు" అను పదము దేవుని సూచిస్తుంది. పేతురుకైతే తండ్రియైన దేవునికిని, కుమారుడైన దేవునికిని మధ్య తేడా లేశమైనా లేదు. ఆయన తన ఏకత్వంలో, "ప్రభువు ముఖము కీడు చేయువారికి విరోధముగా ఉన్నది." కాబట్టి క్రైస్తవులైనవారు వ్యక్తిగతమైన ప్రతీకారమునకు బదులుగా, దేవుడు తన కాలమందు, ప్రస్తుత దుష్ట యుగానికి తీర్పు తీర్చునని విశ్వసిస్తారు.

## క్రీస్తును మీ హృదయములలో ప్రభువుగా ప్రతిష్ఠించుకొనుడి (3:13-17)

**13మీరు మంచి విషయములో ఆసక్తిగలవారైతే మీకు హాని చేయువాడెవడు? 14మీరొకవేళ నీతినిమిత్తము శ్రమ పడినను మీరు ధన్యులే; వారి బెదిరింపునకు భయపడకుడి కలవరపడకుడి; 15-16నిర్మలమైన మనసాక్షి కలిగినవారై, మీలో ఉన్న నిరీక్షణనుగూర్చి మిమ్మును హేతువు అడుగు ప్రతివానికిని సాత్వికముతోను భయముతోను సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండి, మీ హృదయములయందు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్ఠించుకొనుడి; అప్పుడు మీరు దేనివిషయమై దుర్మార్గులని దూషింపబడుదురో దాని విషయమై క్రీస్తునందున్న మీ సత్ ప్రవర్తన మీద అపనిందవేయువారు సిగ్గుపడుదురు. 17దేవుని చిత్తమాలాగున్న యెడల కీడుచేసి శ్రమపడుటకంటె మేలుచేసి శ్రమపడుట బహు మంచిది.**

పేతురు పాఠకులు అవమానము మరియు దూషణ పాలగుచుండిరని 3:9 సూచిస్తుంది. గనుక వారు ఎదుర్కొనుచుండిన శ్రమల దృష్ట్యా, అయినను వారు దైవభక్తిగల జీవితములనే జీవించుచుండవలెనని విన్నవించుకోడానికి పేతురు కీర్తన 34ను ఉదహరించి చెప్పాడు, కాని ఈ కీర్తనలో కొన్ని ప్రశ్నార్థకమైన సందేహాలున్నాయి. "దేవుడు మా పక్షముగా ఉన్నట్లయితే,

మాకు ఈ విధమైన శ్రమలు ఎందుకు ఎదురౌతున్నాయి? మా జీవితములను ఇంత దౌర్భాగ్య స్థితిలోనికిదిగజార్చుతున్న వారిని మేము దీవించాలని ఎవరైనా గాని ఎలా ఆశిస్తారు?" అని పేతురు పాఠకులు ప్రశ్నించడానికి అది అవకాశములను కల్పిస్తుంది. కాబట్టి ఇప్పుడు అపొస్తలుడు ఈ విధమైన ప్రశ్నలకు సమాధానమీయడానికి సంసిద్ధుడౌతున్నాడు.

**వచనము 13.** మరొక పర్యాయము (1:6-9 చూడుము), శ్రమల నెదుర్కొనుచుండిన తన పాఠకులను పేతురు అతి స్పష్టంగా సంబోధిస్తున్నాడు. ఈ విభాగము (3:13-17) వాక్పటిమగల ఒక ప్రశ్నతో మొదలౌతుంది; సంబంధిత సమాధానం, ఊహించుకొనబడుతుంది. సహజంగానే, ఎవరైనా గాని, **మంచి విషయమై నీవు నిజముగా ఆసక్తిగలవాడవై యున్నావని నిన్ను నీవు రుజువుచేసికొన్నట్లయితే నీకు ఏ హానియు చేయరు**. అలా అయినప్పటికిని, ఈ అభిప్రాయానికి తరువాతి వాంగ్మూలములకును నడుమ కొంత ఉద్రిక్తత ఉన్నది. వారు సహించిన "అగ్ని వంటి మహా శ్రమ" (4:12) మరియు "క్రీస్తు నామము నిమిత్తము" (4:14) వారు స్వీకరించిన అసభ్యకరమైన నిందలు, రెచ్చగొట్టబడినవి కావని, భావించుకొనబడవలసి యున్నది. ఈ విషయాన్ని పేతురు అటుతరువాత చర్చిస్తున్నాడు, కాని ఇప్పటికైతే, తన పాఠకులకు యథార్థమును, భక్తిపూర్వకమునైన జీవితము గూర్చి నిర్దేశనములనిచ్చు కొన్ని సూత్రములను ఉపదేశించాలని పేతురు ఆశిస్తున్నాడు. ఆయన వారిని అటుతరువాత ఆదరిస్తున్నాడు, వారికి అభయమిస్తున్నాడు, కాని ప్రస్తుతానికి వారెదుర్కొంటున్న నిర్దాక్షిణ్యమైన బాధల దృష్ట్యా వారి భక్తిపూర్వకమైన ప్రవర్తనను బలపర్చాలని ఆందోళన చెందుతున్నాడు.

మామూలు పరిస్థితుల్లోనైతే లౌకిక ప్రభుత్వ పరిపాలకులు సత్యము పలుకువారిని, నిజాయితీలేమిని నిరాకరించువారిని, తమ కుటుంబ బాధ్యతలను పెంపొందించుకొనువారిని, మరియు ఇతరమైన అన్ని "మంచి విషయములలో ఆసక్తిపరులైనావారిని" అణచరు. ఈ మాటలు యెషయా 50:9లోని గత విషయాలను జ్ఞప్తికి తెచ్చుచ్చున్నవి: "ప్రభువగు యెహోవా నాకు సహాయము చేయును; నా మీద నేరస్థాపనచేయువాడెవడు?" "నాయకులు దుర్మార్గులకు ప్రతిదండన చేయుటకును, సన్మార్గులకు మెప్పుకలుగుటకును రాడు వలన పంపబడినవారని" పేతురు తన పాఠకులకు గుర్తుచేసినప్పుడే ఈ విషయాన్ని ఆయన ప్రస్తావించాడు (2:14). ఇంకా, కీడును పురికొల్పు పనులు క్రైస్తవులు ఎన్నడును చేయకూడదను సూత్రము వలెనే, తాను స్థాపింపవలెనని అపొస్తలుడు ఆశించుచుండిన సూత్రము ఎక్కువగా క్రైస్తవులు ఎన్నడైనను అన్యాయంగా శ్రమలనెదుర్కొనరని చెప్పడానికి ఎక్కువగా సంబంధించినది కాదు. "మీలో ఎవడును నరహంతకుడుగా గాని. దొంగగా గాని, దుర్మార్గుడుగా గాని, పరులజోలికిపోవువాడుగా గాని బాధ అనుభవింప తగదు" (4:15). "అన్యజనులు మిమ్మును ఏ విషయములో దుర్మార్గులని దూషింతురో, ఆ విషయములో ... వారి మధ్యను మంచి ప్రవర్తనగలవారై యుండుడని" పేతురు ఇదివరకే చెప్పాడు (2:12). క్రైస్తవులు అనుభవించు కీడు, తత్ఫలితంగా కలుగు నైరాశ్యమునుబట్టి కీడుకు ప్రతికీడు చేయడానికి ఎన్నడు ఒక సందర్భము కాకూడదు (3:9).

**వచనము 14.** పేతురు దీనికి ముందటి వచనంలో అడిగిన ప్రశ్న, క్రైస్తవుడు మంచి చేయుటనుబట్టి ఎన్నడును హానికలుగు పరిస్థితుల్లో చిక్కుకొనడను ధ్వనింపుగలది, స్పష్టంగా ఒక అతిశయోక్తియై యున్నది. అపొస్తలుడు ఇంతకు ముందే చెప్పిన విషయంలో వెనుకంజ

వేస్తున్నాడు, కాని యథార్థమైన ప్రవర్తన వలన కలుగు ఫలితాన్ని గూర్చి ఆశను మాత్రం విడిచిపెట్టలేదు. ఆయన క్రొత్త నిబంధనలో అరుదుగా అగుపించు వ్యాకరణ సంబంధమైన ఒక యుక్తితో మొదలుపెట్టాడు. **మీరొకవేళ ... శ్రమపడినను** అనే మాటలు ఇచ్ఛార్థక క్రియా రూపంలో ఉన్నవి. సంభవమగు సాధ్యతలేని ఏదైన ఒక విషయాన్ని సూచింప దలచినప్పుడు, అది గ్రీకు గ్రంథకర్తకు అందుబాటులో ఉండిన ఒక యుక్తియై యుండినది. జే. ఎన్. డి. కెల్లి చేసిన సంబంధిత భావానువాదము ఇలా వున్నది, "అలా అయినప్పటికిని, మంచి గూర్చి నీవు కలిగియున్న నీ నిష్ఠ నీకు కష్టము కలిగించవచ్చు ..."[11] "మంచి గూర్చి వారు కలిగియుండిన వారి నిష్ఠ పేతురు పాఠకులలో కొందరిని కష్టాల్లోపడవేసిందని స్పష్టమైతుంది. అజ్ఞానము, మూఢనమ్మకము, అసూయ, లేదా రాజకీయ ఒత్తిడులు కొన్ని పర్యాయాలు అమాయకులను శ్రమలపాలుజెస్తాయి. ఈ లక్షణాలకు లోకంలో కొరత ఏమీ లేకపోగా, క్రైస్తవుడు వాటిని ఎదుర్కొనునప్పుడు యథార్థమైన ప్రవర్తన వానికి బంధుశక్తి యౌతుంది.

పేతురు ప్రధానంగా **నీతి** గూర్చి ఆందోళన చెందుచుండెను. "మీరొకవేళ శ్రమపడినను, మంచి చేయుటయందు గల ఆసక్తినిబట్టి గాక, ఇతరమైన ఏ హేతువు వలనైనను అది మీకు కలుగకూడదు. కీడు చేయుటనుబట్టియైతే ఎన్నడూ కలుగకూడదని" పేతురు నొక్కి వక్కాణిస్తున్నాడు. మనము ఇదివరకే చూచినట్టుగా (2:24), మొదటి పేతురు పత్రికలో పేర్కొనబడుతున్న "నీతి," "నైతికంగా యథార్థమును, భక్తిపూర్వకమునైన ప్రవర్తనయై" యున్నది. అది పౌలు చెప్పుతున్న రీతిలో నీతి యని ఎంచబడలేదు (ఉదాహరణ రోమీయులకు 4:3–5 చూడుము). వ్యతిరేకార్థంగా చెప్పుకున్నప్పుడు, "నీతి" అనగా, ఆత్మకు విరోధంగా పోరాడుచుండు శరీరాశలకు దూరముగా ఉండుటయై" యున్నది (2:11). "నీతి నిమిత్తము" శ్రమ ఎదురైనప్పుడు, **మీరు ధన్యులే** అంటూ పేతురు తన పాఠకులకు అభయమిస్తున్నాడు. వారిని అణగద్రొక్కువారి విషయంలో ఆ ధన్యత సిగ్గుకరమైనదౌతుంది (3:15, 16).

"ధన్యులే" అను పదమునకు ఆధారంగా నిలుస్తున్న గ్రీకు పదము makarios, 3:9లో ప్రయోగింపబడిన అదే పదము కాదు. అచ్చట ఆ ఆశీర్వాదము నోటి మాటల్లో తెలియజెప్పాబడిన ధన్యతను గూర్చిన ప్రస్తావనయై యున్నది; ఇక్కడ ఇది విశ్వాసి తాననుభవిస్తున్నాడని తెలిసికొను ధన్యకరమైన పరిస్థితియై యున్నది. ఇది ధన్యతలకు సంబంధించిన పదమై యున్నది, ఎనిమిదవ ధన్యత, "నీతినిమిత్తము హింసింపబడువారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది" (మత్తయి 5:10). విశ్వాసుల ధన్యత దేనిలో ఉన్నది? (1) అది ప్రభువుతో కూడ మానవాళి విమోచనార్థమై అనుభవింపబడు శ్రమలను పంచుకొనుట వలన కలుగు ధన్యతయై యున్నది (4:13). పౌలు గణనీయంగా పలికిన మాటల్లోనే, "ఇప్పుడు ... నేను అనుభవించుచున్న శ్రమలయందు సంతోషించుచు, ... క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను" (కొలొస్సయులకు 1:24). (2) అది నమ్మకముతో విధేయులగువారి గూర్చి దేవుడు సంతోషిస్తున్నాడను ఎరుక వలన కలుగు నిశ్చయతకు సంబంధించిన ధన్యతయై యున్నది (1:22, 23). (3) అది "మీ విశ్వాసమునకు ఫలమును, అనగా ఆత్మ రక్షణను పొందునను" వాగ్దానములో (1:8, 9). నిరీక్షణను కనుగొనుట గూర్చిన ధన్యతయై

యున్నది.

చిట్టచివరి పదజాలము, **వారి బెదిరింపులకు భయపడకుడి, కలవరపడకుడి,** కొంచెం కష్టంగానే ఉన్నది. గ్రీకు భాషలో ఉన్న సంబంధిత పదజాలమును యింకా ఎక్కువ అక్షరార్థంగా అనువదించినట్లయితే, అది, "వారి భయమునకు భయపడకుడి" అని అనువదింపబడుతుంది. NRSV మరియు NIV బైబిల్ భాషాంతరీకరణములలో, "వారు భయపడే విషయాలకు మీరు భయపడకుడి" అని అర్థమిచ్చు అనువాదం కలదు, ఇది NASB అనువాదానికి చెప్పుకోదగినంతగా భిన్నమైన అభిప్రాయమై యున్నది. పేతురు యెషయా 8:12లోని చివరి మాటలను అనుకూలించుకున్నట్టుగా అగుపిస్తుంది. వారి చుట్టూర ఉన్న జనాంగములు భయపడుచుండిన విషయాలకు ఇశ్రాయేలు ప్రజలు భయపడకూడదని ప్రవక్తయైన యెషయా ఆశించుచుండెను, ఇది NRSV మరియు NIV అనువాదములకు చేదోడువాదోడుగా ఉంటున్నది. ఏది ఏమైనా, మూఢనమ్మకాలకు మరియు అవిశ్వాసులు భయపడుచుండిన దేవతలకు భయపడకూడదను మందలింపు, పేతురు ఆలోచనా ధోరణిలో సరిగా సరిపడుటలేదు. ఈ వచనాన్ని అక్షరార్థంగా మరొక విధంగా కూడ అనువదించవచ్చు: "వారికున్న భయమునకు భయపడకుడి," అనగా, "వారికి భయపడకుడి" అని మరొక విధంగా చెప్పినట్టున్నది. NASB బైబిలులోని అనువాదం వెనుక గల అర్థవివరణ ఇదే. సందర్భమునుబట్టి, NASB అనువాదము హర్షింపదగినదై యున్నది. క్రైస్తవులు అనుభవించు ధన్యత అభయము మరియు సమాధానము నొసగుచున్నది గనుక వారు బెదిరింపులు ఎదుర్కొనినప్పుడు **కలవరపడరు**.

**వచనము 15.** ఒకడు క్రైస్తవుడై యుండుట అనగా, "బైబిల్ బోధిస్తున్నదేమిటి?" అని అడుగుటకు ముందు, అతడు "యేసు ఏమి బోధించాడు?" అని ప్రశ్నించుకొనవలెను. "యేసు ఏమి బోధించాడు?" అని అడుగుటకు ముందు, అతడు "యేసు ఎవరై యుండెను?" అని ప్రశ్నించుకొనవలెను. "యేసు ఎవరై యుండెను?" అని అడుగుటకు ముందు, అతడు "యేసు ఎవరై యున్నారు?" అని ప్రశ్నించుకొనవలెను. **మీ హృదయముల యందు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్ఠించుడి** అని చెప్పినప్పుడు పేతురు ఈ చివరి ప్రశ్నకు సమాధానం చెప్పేసాడు. క్రైస్తవ విశ్వాసం నజరేయుడైన యేసు యొక్క వ్యక్తిత్వమును ఆధారం చేసుకొని నిర్మించుకొనబడినదై యున్నది. పేతురు విషయంలో, నజరేయుడైన యేసు మరియు ప్రభువైన క్రీస్తు, ఒక్కటే అయియుండిరి. ఆయన పొంతి పిలాతు సిలువవేసిన చారిత్రత్మక ఉపదేశకుడై యుండెను, మరియు ఆయన దేవుని కుడి పార్శ్వమున సింహాసనాసీనుడై ఏలుచుండు ప్రభువై యున్నాడు. అబ్రాహాము వలె గాక (రోమీయులకు 4:1–5), యేసు విశ్వాసమునకు మాదిరి మాత్రమే కాదు; ఆయన విశ్వాసమునకు విషయమై యున్నాడు. ఆయన ప్రభువు, క్రీస్తు, మరియు దేవుడు. "క్రీస్తును ప్రభువుగా ప్రతిష్ఠించుకొనుడి" అనగా, ఒకడు వాని అంతరాత్మలో ఆయనను పవిత్రుడుగా హత్తుకొని యుండుట; ఆయనకు విధేయులై, ఆయనను ప్రేమించుట. పేతురు మనస్సులో యింకను భక్తిపూర్వకమైన ప్రవర్తనను గూర్చిన అంశమే మొదలుచుండింది. శ్రమలు సహితం, అవి "నీతి నిమిత్తమైనవైనప్పుడు," బెదిరించువారి భయమును ఆమంత్రణము చేయకూడదు; దానికి బదులుగా, అది "క్రీస్తును ప్రభువుగా" చేసుకొనిన నూతన నిబద్ధతకు పిలుపునిస్తుంది.

శ్రమలు ఎదురైనప్పుడు ఒకరు ప్రదర్శించు ప్రతిస్పందన రెంచు స్థాయిలలో ఉంటుంది. క్రీస్తు పట్ల వాని ప్రతిస్పందన ఏమైయుంటుందో, శ్రమనొందువాడు తీర్మానించుకొనవలెను. శ్రమనొందువాడు "క్రీస్తును ప్రతిష్ఠించుకొనవలెనని" పేతురు చెప్పుతున్నాడు. శ్రమనొందువాడు నీతియుక్తంగా జీవించాలను తన దృఢసంకల్పమును పునరుద్ధరించుకొన్నప్పుడు వాడు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్ఠంచుకొనగలడు. రెండవది, వానిని హింసించువారి పట్ల వాని ప్రతిస్పందన ఏమైయుంటుందో, శ్రమల నెదుర్కొనువాడు తీర్మానించుకొనవలెను. వ్యతిరేకార్థకంగా చెప్పుకుంటే, అతడు "కీడుకు ప్రతికీడైనను, దూషణకు ప్రతిదూషణయైనను చేయకూడదు" (3:9), సరికదా, అతడు భయపడకూడదు, కాని ఇందు విషయంలో నిర్మాణాత్మకమైన ప్రతిస్పందన సహితం ఉన్నది. అతడు **హేతువు అడుగు ప్రతివానికిని సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండవలెను**. వారు చేయని నేరానికి క్రైస్తవులు శ్రమల నెదుర్కొనునప్పుడు, వారు ప్రదర్శించు దృఢసంకల్పము మరియు ఆనందమును హింసించువారు గమనించినప్పుడు, అది వారి ఆసక్తిని పెంచుతుందనేది దీని భావార్థమై యున్నది. వారు క్రైస్తవుడు సేవించుచున్న ప్రభువు ఎవరో, వాడు సహవసించు సహవాసమేమిటో, వాడు ఆనందానుభూతి చెందు నిరీక్షణ ఏమిటో ప్రశ్నించడానికి వారికి ఆదొక సదవకాశమౌతుంది.

వాడు కలిగియున్న **నిరీక్షణ గూర్చి హేతువు** అడుగు ప్రతివానికి సమాధానము చెప్పడానికి విశ్వాసి సిద్ధపడినవాడై యుండవలెను, అనగా, అతడు విశ్వసిస్తున్న విషయమేమటి, దానిని ఎందుకు విశ్వసిస్తున్నాడు, మరియు వాని ప్రస్తుత జీవిత విధానానికి గల హేతువేమిటో వివరించడానికి సిద్ధంగా ఉండాలి. చర్చింపబడుతున్న "హేతువు" సాంప్రదాయుకమైన న్యాయస్థానంలో కాదు; విశేషంగా అది "మిమ్మును అడుగు ప్రతి వానికి" సంబంధించినదై యున్నది. పేతురు "హేతువు" (*apologia*) అను పదాన్ని ప్రయోగిస్తున్నాడు, ఇది పౌలు కొన్ని సందర్భాల్లో ప్రయోగించిన అదే సాంప్రదాయికముకాని అవగాహనతో కూడినదై యున్నది, ఉదాహరణ "నన్ను విమర్శించువారికి నేను చెప్పు సమాధానమిదే" (1 కొరింథీయులకు 9:3). ఈ పదము న్యాయస్థానంలో కొనసాగుచుండు కార్యకలాపములను సూచించినప్పటికిని, ఈ సందర్భంలో "హేతువు" అనేది ఒక సామాన్య వివరణయై యున్నదని చెప్పుకొనవచ్చు. "సమాధానము చెప్పుటకు" అను పదజాలము ఒకే ఒక్క గ్రీకు పదము *logos*ను అనువదిస్తుంది, ఇది హేతుబద్ధత గూర్చి ధ్వనింపునిస్తున్న పదమై యున్నది. క్రైస్తవుని "నిరీక్షణ"ను గూర్చిన సహేతుకమైన వివరణ కొందరిని ఒప్పిస్తుంది, ఇంకొందరి నోరు మూయిస్తుందని పేతురు భావిస్తున్నాడు. క్రైస్తవులు వాంఛించుచుండిన నిర్మలమైన పాలు సహేతుకము లేక హేతుబద్ధమైన పాలైయుండెనని ఒకడు గుర్తుచేయబడుతున్నాడు (2:1-3).

అపొస్తలుడు క్రైస్తవులు వివరించాల్సిన హేతువును మాత్రమే కాదు, కాని దాని విధానమును గూర్చి కూడ చర్చించాడు. ఒకనిని నిందిస్తూ, అణగద్రొక్కుతూ ప్రశ్నించువారి యెడల, క్రైస్తవుడు **సాత్వికముతోను భయముతోను** సమాధానం చెప్పవలెను. "భయముతోను" అని అనువదింపబడిన పదము *phobos* అయియున్నది, ఇది "మృదువుగా" అని కూడ అర్థమిస్తుంది. NIVలో "సాత్వికము మరియు మర్యాద" అని అనువదింపబడి యున్నది. అదే విధంగా, విశ్వాసులు "ప్రేమ కలిగి సత్యము చెప్పుచుండవలెనని" పౌలు విన్నవించుకున్నాడు

(ఎఫెసీయులకు 4:15). "కల్పింపబడిన ప్రతి ఉపదేశమునకు ఇటు అటు కొట్టుకొనిపోవు" అపాయములో ఉండినవారి యెడల (ఎఫెసీయులకు 4:14) విశ్వాసులు ప్రదర్శించుచుండిన వైఖరి గూర్చి పౌలు ఆందోళన చెందుచుండెను, అయితే విశ్వాసులు క్రైస్తవేతరుల యెడల ఉదాసీనతతోను, దేవుని యెడల గౌరవముతోను స్పందించుచుండిన విధానం గూర్చి పేతురు ఆందోళన చెందుచుండెను. ఈ ఇరువురు అపొస్తలులు కూడ పరస్పరం విరుద్ధమైన దృష్టికోణములుగల వారిని సమీపించునప్పుడు విశ్వాసులు నిగ్రహము, సభ్యత మరియు సౌహార్దమును ప్రదర్శించవలెనని వారిని విన్నవించుకున్నారు. సత్యము మాట లాడినంత మాత్రాన లేదా హేతువు చెప్పినంత మాత్రాన అది సరిపోదు. విషయం ఎంత ప్రాముఖ్యమైందో, మనము మాటలాడు విధానం కూడ తరచుగా అంతే ప్రాముఖ్యమైనదై యుంటుంది.

**వచనము 16**. NASBలో, వ్యాకరణ రీత్యా క్రమమైన విరామ చిహ్నములు పెట్టబడుట, "సాత్వికముతోను భయముతోను" అను మాటలు, "హేతువు చెప్పుము" అను మాటల అర్థాన్ని విశేషణవంతం చేస్తూ, అవి క్రియావిశేషణ సంబంధమైన పదజాలమై యుండునట్లు అనుమతిస్తుంది. అనగా, ఒకడు తన విశ్వాసమును సాత్వికముతోను పూజనీయ భావంతోను వివరించవలెను. NASB, NRSV, NIV, REB, మరియు ఇతర భాషాంతరీకరణములు ఇదే విధంగా అనువదిస్తున్నాయి. ఏది ఏమైనా, ఈ పదజాలమును మరొక విధంగా కూడ అన్వయించుకొనవచ్చు. బహుశా వారు "నిరీక్షణ" కలిగియుండుటకుగల "హేతువు" గూర్చి సమాధానము చెప్పడము, వారు క్రీస్తు యెడల సాత్వికము మరియు పూజనాయభావము కలిగియుండుటను అనివార్యమైన అంశంగా చేస్తుందని పేతురు తన పాఠకులకు వివరించుచుండవచ్చు. ఇది సాధ్యమే, కాని బహుశా అలా భావించియుండలేదేమో. వారిని హింసించువారి యెడల వారు భక్తిపూర్వకంగా ప్రవర్తించవలెనని అపొస్తలుడు తన పాఠకులను ప్రోత్సాహిస్తున్నాడు. కీడుకు ప్రతికీడైనను చేయక, వారు దీవించవలసినవారై యుండిరి (3:9). ఈ పదజాలము, అవమానములకు బదులు ఆశీర్వాదములను కురిపింపవలెనని పేతురు ఇచ్చుచుండిన సలహాకు పొడిగింపై యున్నదనిఅర్థంచేసికొనుట మంచిది. అనగా, వారు కలిగియుండిన "నిరీక్షణ"కు గల హేతువును, వారిని హింసించుచుండినవారి యెడల ఎటువంటి దుర్భావము లేనివారి వలె, వారు సాత్వికము మరియు పూజనీయభావముతో తన పాఠకులు వివరించవలసి యుండినది.

**మనసాక్షి** అను పదమును (*suneidēsis*) పేతురు మూడు పర్యాయాలు ప్రయోగించాడు (2:19; 3:15, 16, 21). ఈ పదము పౌలు పత్రికల్లో అగుపించడం సర్వసామాన్యమే.[12] పాశ్చాత్య సంస్కృతిలో గల వ్యక్తిత్వవాదము,"మనసాక్షి" అను మాట పూర్తిగా వ్యక్తిగత సంబంధంగా అర్థంచేసుకొనబడునట్లు చేసింది. అది ఒకని అంతరంగంలో గల స్వరమై యుండి, వాని చర్యలను ఖండిస్తుంది లేదా వాటిని ఆమోదిస్తుంది. "మనసాక్షి" గూర్చిన గ్రీకు భావన, "మనసాక్షి" అనేది వ్యక్తిగతమైన చైతన్యమను దృష్టికోణంలో, ప్రజాదరణ పొందిన పాశ్చాత్య సంప్రదాయమునకు అనుగుణంగా సరిపోతుంది. తేడా ఏమనగా, ఇతరులతో గల సంబంధాల విషయంలో అది వ్యక్తిగతమైన చైతన్యమై యున్నదని ప్రాచీన ప్రజలు అర్థంచేసుకున్నారు. ఇతరులు ఒకనిని ఎలా ఆమోదిస్తున్నారు లేదా ఆమోదించడంలేదని వాడనుకొనుచుండిన భావమునకు సంబంధించినదై యుండింది. **నిర్మలమైన** "మనసాక్షి"

కలిగియుండుట అనగా, ఒకని గూర్చి దేవుడు మరియు తన సమకాలీనులు ప్రీతికరమైన తీర్పునిచ్చునట్లు వాడు తగు విధంగా ప్రవర్తించుటయై యుండింది. "మనసాక్షి" యొక్క నైతిక వైశాల్యం దేవునితోను ఇతరులతోను గల సహవాసంలో రూపుదిద్దుకొని ఉనికి గలదౌతుంది. ఒక వ్యక్తిలో నైతిక చైతన్యముగా "శూన్యంలో నుంచి" (*ex nihilo*) ఉద్భవించు "మనసాక్షి" గూర్చిన భావన పేతురునకు విదేశీ సరుకై యుండింది. విశ్వాసి "నిర్మలమైన మనసాక్షి" కలిగియుండవలసింది వానిని నిందించువారిని సిగ్గుపరచడానికి కాదు, కాని వాని "నిర్మలమైన మనసాక్షి" వారికి సిగ్గు కలుగునట్లు పరిణమించాలని పేతురు చెప్పుచుండెను.[13]

విశ్వాసి కలిగియుండిన "నిర్మలమైన మనసాక్షి" వాడు "హేతువు చెప్పవలసి వచ్చినప్పుడు" వానికి చేదోడువాదోడుగా ఉంటూ వానికి ధైర్యాన్ని కలుగజేస్తుంది. వాని మీద మోపబడు చెడు నిందలు వాని దూషించుటకే ఉద్దేశింపబడినవి కాని మరి దేనికిని కావని వానికి తెలియును. 1 పేతురు 2:12నకు మౌఖికమైన సమానాంతరములు అనేకం ఉన్నాయి. క్రైస్తవులపై మోపబడుచుండిన దూషణ యొక్క లక్షణం గూర్చి అపొస్తలుడు మనకు ఎటువంటి సూచన ఇవ్వడం లేదు, కాని అదేమైయుండవచ్చునో ఊహించుకొనడం కష్టమైన సంగతేమీ కాదు. శతాబ్దాలు గడుచుచుండిన కొలది, ప్రభు రాత్రి భోజన సంస్కారముతో సంబంధం గల రక్తమాంసములు (రొట్టె మరియు ద్రాక్షారసం), క్రైస్తవులు నరమాంసభక్షకులను నిందకు తావిచ్చాయి. క్రైస్తవులు సమావేశమైనప్పుడు వారు లైంగిక సంబంధములు కలిగియుండిరను నింద మోపబడింది. ఇంకా, నిరపాయకరంగానే అయినా, ఇతరులు పూజించుచుండిన దేవతలను క్రైస్తవులు ఆరాధించనందు వలన, వారు నాస్తికవాదులై యున్నారని నిందింపబడిరి. దేవతలు ఆరాధింపబడుచు, బల్యర్పణ లు గావింపబడుచుండిన బహిరంగ ఉత్సవములలో పాల్గొనడానికి నిరాకరించినందు వలన వారు మానవ జాతిని ద్వేషిస్తున్నారని నిందింపబడిరి. తన పాఠకులు ఎదుర్కొనుచుండిన ఇబ్బందులు మౌఖికమైనవని అవమానపరచబడుతూ దూషింపబడుట గూర్చి పేతురు చేయుచున్న ప్రస్తావన సూచిస్తుంది, అనగా, కనీసం ఈ సమయంలో, వారు అవశ్యముగా చెరసాలలో వేయబడలేదు మరియు హతమార్చబడలేదని అది అర్థమిస్తుంది.

క్రైస్తవుల "సత్ ప్రవర్తన," దూషణకు అర్థగౌరవమేమీ మిగిలియుండని విధంగా అది స్వయం విదితమైనదై యుంటుందని ఆశింపబడుతుంది. వారు "నిర్మలమైన మనసాక్షి" కలిగియుండినప్పుడు, దాని ఫలితం, **మీరు దేని విషయమై దుర్మార్గులని దూషింపబడుదురో దాని విషయమై క్రీస్తునందున్న మీ సత్ ప్రవర్తన మీద అపనింద వేయువారు సిగ్గుపడుదురు.** ఆధునిక పాశ్చాత్య సమాజం కంటె, గ్రీకులు మరియు రోమనులు మిళితమై జీవించుచుండిన ప్రపంచంలోని ప్రాచీన ప్రజల్లో, "మనసాక్షి" వలెనే, "సిగ్గు"ను గూర్చిన భావన యొక్క బలమైన సామాజిక పరిమాణం ఎక్కువగా ఉండింది. "సిగ్గు" అనేది అనుతాపము మరియు స్వయంనింద గూర్చిన అంతరంగ లక్షణంకాని పరిస్థితియై ఉండింది. విశేషంగా, అది సామాన్యంగా ఒకని సమకాలీనుల చేత ద్వేషింపబడుచుండిన పనులు చేయుచుండిన దాని ఫలితంగా ఏర్పడిన వైఖరై యుండింది. "సిగ్గు" అనేది లేకుండా ఉండుట యనగా, "నిర్మలమైన మనసాక్షి" కలిగియుండుటయై యుండింది. ఇటువంటి సందర్భంలో, ఒకని ప్రవర్తన విషయంలో ఎటువంటి మన్నింపైనను లేకుండానే ఇతరులు వారి సాటి పౌరుల

కళ్లల్లో కళ్లుపెట్టి చూడగలుగుచుండిరి. క్రైస్తవులలో "క్రీస్తు నందున్న సత్ ప్రవర్తనను" క్రైస్తవేతరులు ఎంత ఎక్కువగా గమనించుచుండిరో, వారి సొంత చర్యలే, సిగ్గుకరమైనవై ఉండినవని, వారి సమకాలీనుల చేతనే తీర్పు తీర్చబడుట గూర్చి వారిలో కలిగిన చైతన్యవంతము అంత ఎక్కువయ్యింది. ఈ విధంగా, విశ్వాసులు తమ శత్రువుల నోళ్లను మూయించవలసి యుండింది. వారి సత్ ప్రవర్తనను దూషించినవారిని బదులు దూషించడం, యేసు మనకు చూపిన మాదిరికి తగని చర్యయై యుండింది (2:23).

**వచనము 17**. పేతురు తన పాఠకులు ప్రదర్శించాల్సిన యథార్థ ప్రవర్తన, సిగ్గులేని విధానంలో జీవించడం అను విషయాలను విడిచిపెట్టడం లేదు. ఒక క్రొత్త మతం నిష్పాక్షికంగా అంగీకరింపబడటం ఎల్లప్పుడు కష్టమైన పరిస్థితిగానే ఉంటుంది. క్రొత్త మతమును హత్తుకొనినవారు ఒక సమాజంలో సంభవించు పలువిధములైన తప్పుడు పనులనుబట్టి అనివార్యంగా నిందింపబడుదురు. గనుక ఈ విషయంలో క్రైస్తవులేమీ మినహాయింపబడలేదు. అవిశ్వాసులైన సమాజ సభ్యులు విశ్వాసులైనవారిని వాస్తవమైన వారి దుష్ప్రవర్తనను బట్టి హింసించడానికి ఎప్పుడైనను, ఎవ్విధంగానైనను అవకాశం ఇవ్వకూడదని పేతురు ఆందోళన చెందుచుండెను. **దేవునిచిత్తమాలాగున్న యెడల**, శ్రమలు ఎదురౌతాయని పేతురు చెప్పుచుండెను; అట్లయినను అట్టి దూషణలో సత్యము లేశమాత్రమైనను ఉండకూడదని ఆయన ఆశించాడు. "హింసించుచుండినవారు తరచుగా వారు హింసించుచుండినవారి చేత ఉద్రేకపరచబడుచుండిరి, గనుక వారు హింసింపబడుచుండినవారి సత్ ప్రవర్తన చేత క్రీస్తునంగీకరించలేదని" బెస్ట్ వ్యాఖ్యానించాడు.[14] విషయం ఇలా ఉండినప్పటికిని, **మీరు దేని విషయమై దుర్మార్గులని దూషింపబడుదురో దాని విషయమై అపనిందవేయబడుచున్నారని** మీ "నిర్మలమైన మనసాక్షి" సాక్ష్యముగా నిలువవలెనని పేతురు వారిని విన్నవించుచాడు.

విశ్వాసులు "తప్పుడు పనులు చేసి శ్రమనొందుటకు బదులుగా, దాని కంటె సరైనది చేసి శ్రమనొందుట మేలని" ఈ వచనం పిలుపునిచ్చునప్పుడు, దీనిని రెండు విధాలుగా అర్థంచేసికొనవచ్చు. క్రైస్తవులు చేసిన నేరములు వాస్తవమైనవే అయినప్పటికిని, వారు ప్రతీకార చర్యలు చేపట్టినప్పుడు, అవిశ్వాసులు వారిని యింకా ఎక్కువగా హింసంచడానికి అది వారికి అవకాశాన్నిస్తుంది (2:20; 3:9). కీడుకు ప్రతికీడు చేయడం, తప్పును రెట్టింపు చేస్తుందే కాని తగ్గించదు. విషయం ఇదైయున్నట్లయితే, అవసరమైతే, ప్రతీకార చర్య చేపట్టకుండానే, అపనిందలతో శ్రమలనుభవించుట ఉత్తమము. అపొస్తలుడు 2:12లో చెప్పిన విషయాన్నే మరొక విధంగా వ్యక్తచేస్తున్నట్టున్నది: "అన్యజనుల మధ్య మీ ప్రవర్తన శ్రేష్ఠమైనదిగా ఉండునట్లు కాపాడుకొనుడి."

మరొక సాధ్యత ఏమనగా, చెడు పనులు చేసి రానైయున్న లోకంలో శ్రమనొందుట కంటె, మంచి పనులు చేస్తూ ఈ లోకంలో శ్రమలనుభవించడమే మేలని పేతురు తన పాఠకులను హెచ్చరించుచుండెను. ఈ రెండవ అనువాదం ఆకర్షణీయమైందిగా ఉన్నది ఎందుకనగా పేతురు తన పత్రికను రాస్తునంత సేపు ప్రభువు రాకడ గూర్చిన విషయం అతని మనస్సులో మెదలుచునే యుండింది.[15] ఈ రెండింటిలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకొనుట కష్టమైనదే, కాని మొదటి అనవాదం ఎక్కువ సంభవనీయమైందిగా ఉన్నది. తన పాఠకులు దూషణకు ఎవ్విధంగాను తావీయని జీవిత విధానాన్ని అన్యజనుల ముందర భక్తిపూర్వకమైన మాదిరిని ప్రదర్శించాలని అపొస్తలుడు ఆందోళనచెందుచుండెను.

మనుష్యుల మెప్పును సంపాదించుకొనవలెనను ఉద్దేశంతో ప్రదర్శింపబడు మతసంబంధమైన మనుగడకును (మత్తయి 6:1), అందరి యెదుటను అతని ప్రవర్తన యథార్థమైనదై యుండాలను న్యాయసమ్మతమైన ఆందోళనకును మధ్య క్రైస్తవుడు జాగ్రత్తతో కూడిన సమతుల్యమును నిర్వహించుకొనుచుండవలెను. విశ్వాసి తన పేరుప్రఖ్యాతుల గూర్చి ఆందోళన చెందడం సరైనదే, జ్ఞానియైన ఒక యూదుడు ఇలా చెప్తున్నాడు, "నీ పేరుప్రఖ్యాతుల గూర్చి ఆలోచించుము; అది వేలకొలది గొప్ప బంగారు నిక్షేపముల కంటెను దీర్ఘకాలం జీవించియుంటుంది."[16]

## మన పాపముల కొరకు మరణించాడు
## (3:18-22)

**[18]ఏలయనగా మనలను దేవునియొద్దకు తెచ్చుటకు, అనీతిమంతులకొరకు నీతిమంతుడైన క్రీస్తు శరీరవిషయములో చంపబడియు, ఆత్మవిషయములో బ్రతికింపబడి, పాపముల విషయములో ఒక్కసారే శ్రమపడెను. [19-20]దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవాహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా, అవిధేయులైనవారి యొద్దకు, అనగా చెరలో ఉన్న ఆత్మలయొద్దకు, ఆయన ఆత్మరూపిగానే వెళ్లి వారిని ప్రకటించెను. ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటిద్వారా రక్షణ పొందిరి. [21]దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా శరీరమాలిన్యము తీసివేయుట కాదు గాని యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనసాక్షినిచ్చు ప్రత్యుత్తరమే. [22]ఆయన పరలోకమునకు వెళ్లి దూతల మీదను అధికారులమీదను శక్తులమీదను అధికారము పొందినవాడై దేవుని కుడి పార్శ్వమున ఉన్నాడు.**

అన్యాయస్థమైన మానవాళి యొక్క పాపముల నిమిత్తము యేసు అనుభవించిన ప్రత్యామ్నయ శ్రమానుభవము గూర్చిన సూటియైన వాంగ్మూలముతో, పేతురు క్రొత్త నిబంధనలో అత్యంత కష్టతరమైన వాక్యభాగములలో ఒక దానిని పరిచయం చేస్తున్నాడు. ఏది ఏమైనా, ఆయన మనముందుంచిన సూక్ష్మమైన సంగతులను, ఆయన మాటల సమగ్రమైన ప్రభావమును మనము అర్థం చేసికొనవలెననునది స్పష్టమౌతుంది. విశ్వాసులు, వారు బాప్తిస్మము పొందిన సమయంలో వారి పాపము నుంచి రక్షింపబడినవారై యున్నారు. రక్షింపబడినవారుగా, దేవుని కుడి పార్శ్వమున కూర్చుండి ఏలుచుండువాని ఆశీర్వాదములను వారు పంచుకొందురు. తన ప్రజలను రక్షించడానికి సిలువ మీద మరణించిన ఆ క్రీస్తే ఇప్పుడు సమస్త పరలోక మరియు ఇహలోక అధికారములన్నిటిని ఏలుచున్నాడు. దీని మూలమున, ప్రస్తుత కాలమందు శ్రమనొందుచున్నవారు సంతోషించి ఆనందించవచ్చు.

**వచనము 18.** పేతురు, **క్రీస్తు** అనుభవించిన శ్రమల గూర్చి ఆలోచించకుండా, శ్రమల గూర్చి ఆలోచించలేకపోయాడనియు, క్రీస్తు మన **పాపముల నిమిత్తము మరణించాడని** కూడా జ్ఞాపకం చేసికొనకుండా, క్రీస్తు శ్రమల గూర్చి ఆలోచించలేకపోయాడనియు చెప్పుచున్నట్టుగా ఉన్నది. 2:19, 20లో చెప్పబడిన దాసుల శ్రమ, ఇదే విధమైన ఆలోచనా పరంపరల

ధోరణికి దారితీసింది. యేసుక్రీస్తు జీవితమంతయు ఆయన అనుభవించిన శ్రమల ద్వారా చిత్రింపబడిందని చెప్పుకొనడంలో కొంత వివేకమున్నది, కాని ఆయన మానవుల పాపము నిమిత్తము శ్రమ అనుభవించిన విషయం పేతురు మనస్సును ఆకట్టుకొనుచున్నది. యేసు మానవాళి పాపముల నిమిత్తమై ప్రత్యామ్నాయంగా మరణించాడను విషయం క్రొత్త నిబంధన యందంతటను ప్రస్ఫుటంగా ప్రచురింపబడి యున్నది. ఈ విషయాన్ని పౌలు తన వాగ్ధాటితో మక్కాణించాడు: “మనమాయనయందు దేవుని నీతి అగునట్లు, పాపమెరుగని ఆయనను మన కోసము పాపముగా చేసెను” (2 కొరింథీయులకు 5:21).

2:21–25లో,పేతురు క్రీస్తు చూపిన మాదిరిపై తన దృష్టిని కేంద్రీకరించాడు, కాని ఆయన చూపిన మాదిరి ఈ వచనంలో అంత ముఖ్యమైన విషయంగా అగుపించడంలేదు. యేసు శిష్యులు **ఒక్కమారే, అనీతిమంతుల కొరకు నీతిమంతుల వలె మరణించడం** ద్వారా వారు ఆయన చూపిన మాదిరిని అనసరించుచున్నవారై యుండాలని పేతురు ఆశించలేదు. యేసు శిష్యులు అనుభవించాల్సివుండిన శ్రమలు ఏవైనా, యేసు వహించిన విధంగా (2:24) వారు పాపమలను వహించజాలరు, సరికదా వారు **ఆత్మ విషయములో బ్రతికింపబడజాలరు**. ఈ వచనంలో గల పేతురు ఉద్దేశం, **మనలను దేవుని యొద్దకు తెచ్చుటకు** యేసు మరణించాడని ఉపదేశించుటకు ఆశించినంతగా, వారు ఎలా శ్రమననుభవించాలో యేసు వారికి చూపించాడని ఆయన తన పాఠకులకు గుర్తుచేయాలని ఆశించినంతటి గంభీరమైనది కాదు. యేసు ఒక్కమారే మరణించాడను విషయం హెబ్రీ పత్రిక రచయితకు, తరచుగా పేర్కొనబడిన ప్రధానాంశమై యుండింది (హెబ్రీయులకు 7:27, 28; 9:12, 26, 28; 10:10, 14).

పాపము కొరకు క్రీస్తు మరణించడంలో విశిష్టత మరియు చరమత్వం ఉన్నాయి. “పాపముల విషయములో క్రీస్తు ఒక్కసారే శ్రమపడెను” అను మాటల్లో గల ధ్వనింపు ఇదే. పాపియైనవాడు దేవునితో సమాధానపడుటకు మానవుల పాపము నిమిత్తము అదనంగా శ్రమపడాల్సిన అవసరంలేదు. సిలువ, సంపూర్ణంగా చాలినదై యుండింది.[17] అహరోను యాజకత్వము చేసినట్టుగా, క్రీస్తు ఏటేటా బల్యర్పణ గావించలేదని హెబ్రీ పత్రిక రచయిత తర్కిస్తున్నాడు; విశేషంగా “అనేకుల పాపములను భరించుటకు ఒక్కసారే” ఆయన తనను తాను అర్పించుకొన్నాడు (హెబ్రీయులకు 9:24–28). హెబ్రీ పత్రికలో, యేసు యాజకుడు మరియు బల్యర్పణయునై యున్నాడు.పేతురు రాసిన మొదటి పత్రికలో, ఆయన ప్రధానంగా ఒక బల్యర్పణయై యున్నాడు, “అనీతిమంతుల కొరకు నీతిమంతుడైనవాడుగా” ఒక అమాయకమైన అర్పణయై యున్నాడు.

పేతురు యొక్క ఆది పాఠకులు మరియు తదనంతరపు పాఠకులు “అనీతిమంతులు” జాబితాలో చేరుదురు. పౌలు మరియు పేతురు కూడ ఇదే విషయాన్ని రూఢిపర్చారు: “అందరు పాపము చేసారు” (రోమీయులకు 3:23). అమాయకమైన ఆయన మరణమునుబట్టి క్రీస్తు “మనలను దేవుని యొద్దకు తెస్తున్నాడు.” పేతురు ఈ విషయాన్ని 2:24, 25లో పేర్కొన్నాడు, కాని ఇక్కడ అపొస్తలుడు ఒక అడుగు ముందుకు వేసాడు. క్రీస్తు అనుభవించిన శ్రమ మరియు ఆయన సిలువమీద మరణించడం అసలు విషయము యొక్క అంతము కాదు. సిలువ, ఓటమి కాదు. నిజానికి ఆయన **శరీర విషయములో చంపబడినప్పటికిని**, దేవుడు సిలువను విజయంగా మార్చాడు. ఆయన “ఆత్మ విషయములో

బ్రతికింపబడ్డాడు.” రెండవ వాంగ్మూలము, పేతురు పలుకునని మనము నిజముగా ఆశించునది కాదు. యేసు “శరీరవిషయములో చంపబడుట” మాత్రమే కాదు, కాని ఆయన ఆత్మ విషయములో బ్రతికింపబడ్డాడు. మేకులు దిగగొట్టబడుట వలన కలిగిన గాయాల్లో తోమా తన చేతి వ్రేలును ఉంచి స్వయంగా తెలిసికొనవచ్చునని ప్రభువు తోమాను ఆహ్వానించినప్పుడు, ఆయన ఈ విషయాన్ని సుస్పష్టంగ గావించాడు (యోహాను 20:25, 27). యేసు శరీర పునఃరుత్థానుడగుట గూర్చి పేతురు పేర్కొనడం లేదు. అతని దృక్పథం భిన్నమైనదై యుండింది. “శరీర విషయములో” యేసు ఆయనను సిలువవేసిన వారి చేతుల్లో మరణించాడు. “ఆత్మ విషయములో” ఆయన బ్రతికింపబడ్డాడు.

ఈ మాటలతో పేతురు క్రొత్త నిబంధనలోని అత్యంత కష్టతరమైంది, నిశ్చయంగా ఈ పత్రికలో అత్యంత కష్టతరమైనదే, వాక్యభాగము లోనికి మధ్యస్థంగా మళ్లాడు. 1930లో, J. A. MacCulloch ఈ వాక్యభాగాన్ని మరియు ఇతర వాక్యభాగలను లోతుగా తరచి చూసాడు, ఎందుకనగా అవి ఆది సంఘములో పట్టువిడువక కొనసాగుచుండిన సాంప్రదాయానికి అనగా, యేసు సిలువవేయబడిన తరువాత ఆయన మృతుల లోకానికి వెళ్లాడను సాంప్రదాయానికి సంబంధించినవై ఉండినవి.[18] మెక్ కుల్లోచ్ అన్వేషణా రచనలు ప్రచురింపబడినప్పటి నుంచి, పండితోత్తములు ఈ వాక్యభాగాముసు పరిశీలనగా పరిశీలించడానికి గణనీయమైన సమయమును మరియు సొమ్మును వెచ్చించారు. పేతురు మాటలకు అనేకమైన వివరణమలు ఇవ్వబడినవి. సంబంధిత విషయాలు జటిలమైనవై ఉన్నాయి. వాటన్నిటిని విడమర్చి వివరించడం కష్టం. NASB అనువాదం, పైన పేర్కొనబడింది, “ఆత్మ” ‘‘spirit’’ అను పదాన్ని కేపిటల్ లెటర్‌తో ‘‘spirit’’గా రాయడం లేదని చెప్పుకొనడం ఈ సమయంలో సమంజసమైనదౌతుంది. ఈ పదము పరిశుద్ధాత్మకు సంబంధించినదని తీర్మానించుకొని అనవాదకులు నిలకడగా ఈ పదమును కేపిటల్ లెటర్‌తో పేర్కొన్నారు. NASB వలె గాక, NIV ఈ పదమును కేపిటల్ లెటర్‌తో అనువదించుచున్నది. పేతురు పరిశుద్ధాత్మ గూర్చి ప్రస్తావించుచుండెనని అనువాదకులు నమ్మారు. అయితే గ్రీకు భాషలో, ఈ రెండు సందర్భములలోను అది సందర్భమునబట్టి నిర్ధరించుకొనవలసినదే. NASB మరియు NIV ఈ రెండు పదాల్లో దేనిని ఎంపికచేసికొనినను, సంబంధిత అర్థవివరణము ఇవ్వబడుతుంది.

**వచనములు 19-20.** ఈ వచనాలు వెనువెంటనే ప్రశ్నలు లేవదీస్తుంది. దేనిలోనైతే అనే పదములోని సంబంధ బోధక సర్వనామము యొక్క పూర్వాంశము, అంత స్పష్టంగా లేదు. దీనికి ముందటి వచనంలోని సర్వనామమునకు అతి సమీపంగా ఉన్న పదము, “ఆత్మ”యై యున్నది, దీనిని NIV పరిశుద్ధాత్మగా భావిస్తుంది. అలాగైతే, NIV అనువాదము “దేని ద్వారానైతే” అని చెప్పడానికి బదులుగా, “ఎవరి ద్వారానైతే” అని చెప్పడంలో ఆశ్చర్యమేముంటుంది! యేసు పరిశుద్ధాత్మ ద్వారా, అనగా, **పరిశుద్ధాత్మ అనుగ్రహించిన శక్తితో** వెళ్లి వారికి ప్రకటించెనని NIV అనవాదమును అనుసరించువారు అర్థంచేసికొంటారు. NIV అనువాదము సమర్థనీయమైనదేనా? గ్రీకు విభక్తి ప్రత్యయము enను “ద్వారా” అని అనవదించడం సాధ్యమే, గనుక ముందటి వచనంలోని “ఆత్మ”ను గ్రీకు సర్వనామము సూచించునట్లు వచనంలోని వ్యాకరణం అనుమతిస్తుంది. విషయం ఇదేయున్నట్లయితే, “ఎవరి ద్వారానైతే” అని అనువదించడం, ఎంచుకొనదగినది కాకపోయినప్పటికిని,

అంగీకరింపదగినదే ఔతుంది. పేతురు చెప్పదలచింది ఇదే అయియుండిందా అన్నదే ప్రశ్న. NIV అనువాదం, పాఠకునికి సాధ్యమయ్యే అనువాదమునే చూపించింది, కాని ఈ అనువాదం వచనమును సరైన అర్థముతో అనువదించిందా అన్నదే ప్రశ్నార్థకమై యున్నది.

"ఏదైతే" లేక "ఎవరైతే" అను సర్వనామము పరిశుద్ధాత్మను సూచింపవచ్చు, కాని అది అవశ్యముగా అదే అయియుండనవసరం లేదు. అనువాదములు, ముఖ్యంగా ఇటీవలి అనువాదములు, దీనిని ప్రతిబింబింపకపోయినప్పటికిని, "దేనిలోనైతే" (*en hōi*) అనే గ్రీకు పదజాలము పేతురు రాసిన మొదటి పత్రికలో నాలుగు పర్యాయాలు అగుపిస్తుంది (1:6; 2:12; 3:16; 4:4). ఈ పదమును NASB నిలకడగా "దేనిలోనైతే" లేదా "ఇందులో" అని అనువదిస్తుంది. ఈ పదజాలము అగుపించు ఇతర సందర్భములలో, సర్వనామము, సందర్భానుసారంగా దానికి ముందున్న తలంపును సూచిస్తున్నట్టు అగుపిస్తుంది. ఈ విధంగా 1:6లో, "ఇందువలన మీరు మిక్కిలి ఆనందించుచున్నారు" అని పేతురు రచించినప్పుడు, "ఇందువలన" అను పదము 1:3–5 వచనములలో వర్ణింపబడిన పరిస్థితులన్నిటిలో, ఏవో కొన్ని నిర్దిష్టమైన పరిస్థితులలో కాదు, అన్నిటిలో ఆనందించుటను సూచిస్తుంది. అదేవిధంగా, మనముందున్న వచనంలోని, "దేనిలోనైతే" అను పదము "ఆత్మ"ను కాదు, కాని క్రీస్తు గూర్చి దానికి ముందున్న వర్ణనను, చంపబడియు, తిరిగి బ్రతికింపబడెనను వర్ణనను సూచింపవచ్చు. బహుశా, మరణ పున:రుత్థానములతో సంబంధముగల సంఘటనల ప్రక్రియలో, యేసు "వెళ్లి ప్రకటించెనని" పేతురు చెప్పుచుండవచ్చు. అలాగైతే, వికల్పకమైన విషయాలు ఇలా ఉంటాయి: (1) యేసు పరిశుద్ధాత్మ ప్రాతినిధ్యముతో వెళ్లాడు, లేక (2) ఏదో ఒక ఆత్మసంబంధమైన విధానములో వెళ్లాడు, లేదా (3) ఆయన మరణ పున:రుత్థానములకు సంబంధించిన సంఘటనల సందర్భములో వెళ్లాడని పేతురు చెప్పుచుండవచ్చు. మొదటి రెండు ఎంపికలలో సర్వనామమునకు ముందున్న పూర్వాంశము "ఆత్మ"యై యున్నదని అర్థంచేసికొనబడుతుంది. మొదటి సందర్భంలో, అది పరిశుద్ధాత్మయై యున్నాడు (NIV చెప్పేది ఇదే); రెండవ సందర్భంలో, ఉత్పత్తివిషయకముగా అది "ఆత్మ సంబంధమైన ఒక విధానములో" అని అర్థమిస్తుంది (NASB చెప్పేది ఇదే). "ఏదైతే" యొక్క పూర్వాంశము "పరిశుద్ధాత్మ"యై యుండవచ్చు లేదా "ఆత్మ"యై యుండవచ్చు. లేదా క్రీస్తు చంపబడియు మరలా బ్రతికింపబడిన పరిస్థితియై యుండవచ్చు. ఒకరు అనువాదమును గైకొనినను, అది అతడు మిగతా వాక్యభాగమును అర్థంచేసికొను విధానమును ప్రభావితం చేస్తుంది.[19] సంబంధిత సాధ్యాసాధ్యాల మధ్య గల ఎంపిక గూర్చిన విషయాన్ని ప్రస్తుతానికి మనము ఈ వచనములు లేవదీయుచున్న ఇతర విషయాలను వివరంగా అన్వేషించేంత వరకు వాయిదా వేద్దాము.

ప్రశ్నలు కొనసాగుచున్నవి. "ఆయన వెళ్లి ప్రకటించెను" అను మాటలను అక్షరార్థంలో అర్థంచేసికొనవచ్చు లేదా అలంకారికంగా అర్థం చేసికొనవచ్చు, అనగా, యేసు తానే వ్యక్తిగతంగా వెళ్లియుండవచ్చు లేదా అభౌతికంగా వెళ్లియుండవచ్చు, లేదా మరొకరిని ప్రతినిధిగా పంపడం ద్వారా వెళ్లియుండవచ్చునని మరొక మాటలో చెప్పుకొనవచ్చు. ఏది ఏమైనా, యేసు **చెరలో ఉన్న ఆత్మల యొద్దకు** వెళ్లి వారికి ప్రకటించెనని పేతురు చెప్పినప్పుడు, "చెరలో నున్న ఆత్మలు" అను మాటలకు అలంకారయుక్తమైన అర్థం ఆవశ్యకమౌతుంది. అక్షరార్థమైన ఇనుప కడ్డీలు కలిగియుండి, కావలాదారులుండిన చెరలో అక్షరాలా ఆత్మలు

చెరపట్టబడి యుండుట అనేది మన అవగాహనకు ఆవల నున్న విషయమౌతుంది. ఆత్మలు ఏదో ఒక విధమైన చెరలోఉన్నాయి, కాని అది మానవులమైన మనమెరిగిన చెరసాల కాదు. NASB అనువాదంలో, "ఇప్పుడు" అని అర్థమిచ్చు పదము *ఏటవాలుగా* నున్న అక్షరములలో రాయబడి యున్నదనే విషయాన్ని గమనించండి, అనగా ఈ పదము గ్రీకు భాషలో లేదని అర్థమిస్తుంది. కాబట్టి NASB అనువాదము "ఇప్పుడు" అను మాటను చేర్చడం ద్వారా యేసు వారికి ప్రకటించినప్పుడు ఆత్మలు "చెరలో" లేవనియు, కాని పేతురు తన పత్రికను వ్రాయుచుండినప్పుడు చెరలో ఉండినవనియు సూచిస్తుంది. సందర్భాన్ని ఆధారం చేసుకొని, NASB అనువాదం "ఇప్పుడు" అని చేర్చడం ద్వారా సరైన పని చేసిందో లేదో పాఠక మహాశయుడు తీర్మానించుకొనవలెను.

యేసు వెళ్లి వారికి ప్రకటించిన "ఆత్మలు" అక్షరాలా "చెరలో" లేనట్లయితే, అవి ఎక్కడున్నట్టు? "చెరలో" అనగా అర్థమేమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం, యేసు వెళ్లి ప్రకటించిన ఈ "ఆత్మలు" ఎవరై యుండిరి అనే విషయంపై ఆధారపడి యుంటుంది. 3:19, 20 ప్రకారం, ఆత్మలు, నోవహు కాలంలో అవిధేయులైనవారై యుండిరి. ఈ ప్రస్తావన దుష్ట దూతలు అనగా, ఆది 6:1-4లోని "దేవుని కుమారుల" గూర్చినదై. జలప్రళయమునకు ముందు జీవించియుండిన వారి గూర్చినదై యున్నదని కొందరు వాదిస్తుంటారు. ఆది 6:1-4లో వలె, "నరుల కుమార్తెలను" భార్యలుగా చేసికొనిన "దేవుని కుమారుల" గూర్చి అసాధారణమైన సమకాలీన ఆసక్తి ఉండినదనేది నిజమై యుండగా, "దేవుని కుమారుల" (అది ఎవరైయుండినా లేదా వారు ఏమైయుండినా) గూర్చి పేతురు తన ఆసక్తిని కనుపరచడంలేదు. దేవుడు అతని కాలమందలి ప్రజలకు తీర్చనై యుండిన తీర్పు గూర్చి పేతురు ఆందోళన చెందుచుండెను. దేవదూతలకు తీర్చబడు తీర్పు గూర్చి పేతురుకు ఆసక్తి లేదు. అతని కాల మందలి అవిధేయులైన ప్రజల వలనే, నోవాహు కాలమందలి అవిధేయులైన ప్రజలు దేవుని ఆగ్రహమును పురికొల్పారు. "నరుల చెడుతనము భూమి మీద గొప్పదనియు, వారి హృదయము యొక్క తలంపులలోని ఊహఅంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా చూచెను" (ఆదికాండము 6:5). నోవహు కాలంలో అవిధేయులై యుండిన "ఆత్మలు" ఆ నాటి తరములోని దుర్మార్గులైన ప్రజలై యుండిరి.

మనుష్యులను "ఆత్మలు" అని సంబోధించడం అది అసాధారణం, కాని ఏనాడో చనిపోయినవారిని అపొస్తలుడు యుంకేవిధంగా పేర్కొనగలడు? ఆ మాట యొక్క సాధారణ అర్థం ప్రకారం, వారిప్పుడు శరీరధారులైన ప్రజలై యుండలేదు, సజీవంగా ఉన్నవారిని అపొస్తలుడు "జీవాత్మలు" – "souls" - అనియు (*psuchai*, 3:19, 20); మృతులైనవారిని "చిదాత్మలు" – "spirits" - అనియు సంబోధించాడు. "ఆత్మలు" అని పేతురు ప్రయోగిస్తున్న పదము కొంత మేరకు హెబ్రీయులకు 12:9లో "ఆత్మలకు తండ్రియైనవానికి" ఎదురెదురుగా శరీర సంబంధులైన తండ్రులుంచబడిన సందర్భంలో ప్రయోగింపబడిన పదము వలె ఉన్నది. పేతురు వలెనే, హెబ్రీ పత్రిక రచయిత "ఆత్మలు" అను పదాన్ని శరీరరీతిగాలేనివారి విషయంలో ప్రయోగించాడు. "ఆత్మలు" "చెరలో" ఉండెనని పేతురు చెప్పుచున్నప్పుడు, నోవహు కాలంలో తిరుగుబాటుదారులై యుండిన ప్రజలు, వారు శరీర రీతిగా లేనప్పటికిని, మృతుల లోకంలో నిర్బంధింపబడి యుండిరని అతడు రూఢిపర్చుచుండెను. "ఆత్మలు" నోవహు తరములోని అవిధేయులైన ప్రజలై యుండిరి. పేతురు ఈ విషయాన్ని రాస్తుండిన

సమయంలో వారు పాతాళలోక ప్రదేశంలో ఉండిరి. అదే, వారి చెర. ప్రవక్తల గూర్చి సుపరిచితులై యుండినవారికి పాతాళలోక ప్రదేశం చెరయై యుండు సంగతి క్రొత్త విషయమేమీ కాదు. ఉదాహరణ యెహెజ్కేలు, పరాక్రమకారులైన ఐగుప్తు బలాఢ్యులు పాతాళమునకు, చెర వంటిది గాక, ఛాయారూపమైన ప్రదేశానికి పోవుట గూర్చి వర్ణించాడు (యెహెజ్కేలు 32:18-32). పేతురు పేర్కొనుచున్న "చెర" యెహెజ్కేలు గ్రంథంలోని పాతాళ ప్రదేశముతో సమానమైనదై యున్నది.

సారాంశంగా చెప్పుకుంటే, యేసు మృతుల ప్రపంచంలోనికి, నిర్దిష్టంగా నోవహు కాలములో అవిధేయులై యుండినవారి యొద్దకు వెళ్లి, వారికి "ప్రకటించాడు." యేసు ఒక సందేశాన్ని అంతటా ప్రకటించాడు. *Kerussō* అనే పదం ఏదైన ఒక సందేశము చాటింపుచేయబడుటను సూచించు సమష్టి క్రియాపదమై యున్నది. 4:6లో పేతురు *euangelizō* అను క్రియా పదాన్ని ప్రయోగిస్తున్నాడు, అనగా "సువార్తను ప్రకటించుట" యని అర్థం, కాని అది ఇచ్చట వర్తించదు. యేసు మృతులకు ఏమని ప్రకటించాడు లేక చాటింపు చేసాడు? అసలు, మృతులైనవారికి ఆయన దేనినైనాగాని ఎందుకు ప్రకటించాలనుకుంటాడు? ఈ ప్రశ్నలకు సమాధానమీయడానికి, ఈ వచనం గూర్చి మేము మొదట్లో లేవదీసిన విషయాన్ని చూడాల్సివుంటుంది. సర్వనామమునకు పూర్వాంశం ఏమైయున్నది? "దేనిలోనైతే" అను మాట అర్థమేమిటి?

3:18లోని చివరి మాట గ్రీకులోను, NASBలోను "ఆత్మలు" అయియున్నది. యేసు శరీర సంబంధమైన ప్రదేశంలో, దాని సరిహద్దుల నిర్భంధంలో ఉన్నప్పుడు చంపబడెను; ఆత్మ సంబంధమైన ప్రదేశంలో ఆయన బ్రతికింపబడెను. 'యేసు బ్రతికింపబడెను. అని పేతురు మామూలుగా ఎందుకు చెప్పలేదు? "ఆత్మ విషయములో బ్రతికింపబడెను" అని ఎందుకు చెప్పాలి? 2:5లో అపొస్తలుడు "ఆత్మ సంబంధమైన మందిరము" మరియు "ఆత్మ సంబంధమైన బలులు" అని పేర్కొనబడిన దాని ద్వారా కొంత సహాయం లభించవచ్చు. మందిరము మరియు బలులు భౌతిక సంబంధమైనవి కావని పేతురు భావిస్తున్నాడని అర్థమౌతుంది. అవి "ఆత్మ సంబంధమైనవై" యుండుట నిస్సందేహంగా అవి దేవుని సంతోషము మరియు దేవుని ఆమోదము కొరకే ఉద్దేశింపబడినవై యుండెనని తెలియుచున్నది, అయితే అవి కూడ అభౌతికమైనవై యుండినవి. "ఆత్మ" అనేది శరీరసంబంధమైనది కానిదై యున్నట్టుగానే, ఆత్మ సంబంధమైన అనేది అక్షరార్థము కానిదై యుండవచ్చు. 2:5లో "ఆత్మ సంబంధమైన" అను ప్రయోగము యేసు మరణమును జయించుట గూర్చి పేతురు కలిగియుండిన గ్రహింపునకు ఒక సూచనయై యుండగలదు. యేసు సిలువవేయబడిన తరువాతనే దేవుడు ఆయనను సజీవునిగా చేసాడు, కాని యేసు అదే శరీరమును, అన్ని కోణాల్లోను భౌతికమైన శరీరము, ఆయన సిలువవేయబడక మునుపుండిన శరారమును కలిగియుండలేదు. "ఆత్మ విషయములో బ్రతికింపబడిన" అభౌతికమైన, శరీర సంబంధమైనదికాని కోణం, 3:19, 20లోని "దేనిలోనైతే" అనే పదప్రయోగంలో చేరిపోయింది. శరీర విషయములో ఉండుటకును లేదా ఆత్మ విషయములో ఉండుటకును మధ్య గల తేడాను పౌలు చూపించాడు (కొలొస్సయులకు 2:5). ఒకడు శరీర విషయములో దూరంగా ఉన్నప్పటికి, అక్షరాలా భౌతికంగా అచ్చట ఉండనప్పటికిని, "ఆత్మ విషయములో ఉండుట" సాధ్యమనేది విదితంగా విశదమౌతుంది.

యేసు "ఆత్మ విషయములో బ్రతికింపబడెను" అని చెప్పిన మీదట, పేతురు ఆలోచన మరొక వైపు మళ్లింది. యేసు క్రీస్తు మానవులను దేవునితో సమాధానపరచడం, పాపముల నిమిత్తము ఆయన మరణించడం, మరియు ఆయన పున:రుత్థానము మొ॥ విషయాల నుంచి, క్రైస్తవులను హింసిస్తూ వారిని అణగద్రొక్కుచున్న లోకుల దృష్టిలో క్రైస్తవుల ప్రవర్తన నిజమైనదని నిరూపించుట గూర్చిన విషయానికి మళ్లుతున్నాడు. పేతురు మనస్సు ప్రభువు ప్రత్యక్షత మరియు ఆయన ప్రత్యక్షత సమయంలో తీర్చబడు తీర్పు మీదికి వెళ్లింది. తీర్పును ప్రధానంశం, అతనిని నోవాహు గూర్చి ఆలోచింపజేసింది. దేవుని సమస్త మానవాళికి సార్వత్రిక తీర్పు తీర్చిన మరొక సమయముండింది. నోవాహు కాలము నాటి తీర్పు క్రీస్తు లేకుండా జరుగలేదని తన పాఠకులు తెలిసికొనవలెనని పేతురు ఆశించుచుండెను. ఆత్మ సంబంధముగా, అభౌతికంగా, నోవాహు తన తరములోని ప్రజలకు ప్రకటిస్తూ వారిని హెచ్చరించినప్పుడు, అతడు వారికి ఒక దైవ సందేశమును చాటింపుచేసినప్పుడు, నోవాహు ద్వారా మాటలాడుచుండింది క్రీస్తే. క్రీస్తు, మోషే ద్వారా లేదా యెషయా ద్వారా మాట లాడాడని పేతురు అంతే బలముగా చెప్పగలిగియుండెను, కాని నోవాహు పొంతనగలవాడై యుండెను ఎందుకనగా దేవుడు నోవాహు కాలములో లోకానికి తీర్పు తీర్చాడు. ఆ నాడు దేవుడు తననుతాను, తన శక్తిని మరియు తన సంకల్పమును త్ర్యక్షపరచుకున్నాడు. దేవుడు తననుతాను పేతురుకు, అతని పాఠకులకు, మరియు వారిని హింసించువారికిని ఈ విశాల విశ్వవ్యాప్తి తీర్పులో ప్రత్యక్షపరచుకుంటాడు. యేసు నోవాహు ద్వారా ఆత్మ విషయంలో మాటలాడాడు గనుక తీర్పువచ్చింది. అదే విధంగా, యేసు ఆత్మ సంబంధంలో పేతురు మరియు ఇతర అపొస్తలత్వ సాక్షుల ద్వారా మాటలాడుచుండెను వారి చాటింపుల వెనువెంట తీర్పు కచ్చితంగా జరుగుతుంది.

ఈ వాక్యభాగమును గూర్చిన గ్రహింపు అగస్టీను కాలమును (క్రీ.శ. ఐదవ శతాబ్దము) గుర్తుచేస్తుందనియు, సమర్థవంతులైన ఆధునాతన విద్వాంసులు చేసిన ప్రతివాదనతో సమర్థింపబడిందనియు చెప్పడం మాత్రమే మిగిలిపోతుంది. యేసు వెళ్లి ప్రకటించడమనే విషయం ఆత్మసంబంధమైన, అనగా, అభౌతికమైన విషయమని చక్కగా అర్థం చేసికొనబడవచ్చు. దేవుని తీర్పు సమీపముగా ఉండిన సమయములో, అది సార్వత్రికమైనదైయుండిన సందర్భంలో, దేవుని అధికార ప్రతినిధియై యుండిన నోవాహు ద్వారా యేసు మాటలాడాడు. నోవాహు మాటలాడినప్పుడు, యేసు మాటలాడాడు; పేతురు మాటలాడినప్పుడు, యేసు మాటలాడాడు.

3:19, 20 మరొక విధంగా కూడ అర్థంచేసికొనబడుతుంది, ఇది ఆలోచింపదగినదే. సిద్ధాంతము, అనగా ఆయన సిలువవేయబడుటకు మరియు పున:రుత్థానుడగుటకు మధ్య కాలములో యేసు అక్షరాలా మృతుల యొద్దకు వెళ్లాడనుట, *Descensus* అని పిలువబడుతున్న విషయం, ప్రాచీన సంఘములో అది సామాన్యమైన సంగతై యుండింది. ఆయన పాతాళ లోకానికి వెళ్లడంలో గల ఉద్దేశం గూర్చి నానా విధములైన వివరములు చెప్పుకొనబడుచుండినవి. బహుశా విజయమును చాటించి, విశ్వాసులైనవారికి అభయమిచ్చి వారికి తననుతాను ప్రత్యక్షపరచుకొని, దుర్మార్గులైనవారికి దండన ప్రకటించుకై యుండవచ్చు. అపొస్తలుల కార్యములు 2:27 మరియు ఎఫెసీయులకు 4:9 వంటి వాక్యభాగములు ఈ సిద్ధాంతమునకు తోడు చేసికొనబడినవి. రూఫినస్ కాలంలో (దాదాపు క్రీ.శ. 360లో), అది

దాని తరువాతి రూపంలో వెలుపడిన అపొస్తలుల విశ్వాస సూత్రములో, “ఆయన పాతాళ లోకమునకు దిగెను” అను పదజాలము ఉండింది. యేసు అంత్య కాలము కొరకు ఆత్మలు వేచియుండు ప్రదేశానికి, సిలువవేయబడిన తరువాత దొంగతో కూడ వెళ్లిన స్థలానికి (లూకా 23:43). అంత్య తీర్పు నిమిత్తము విధేయులైనవారు మరియు అవిధేయులైనవారు వేచియుండు చోటికి దిగెనని తర్కింపబడింది.

*Descensus* లో “రెండవ తరుణము”ను ఉపదేశించు వేదాంతమును చూడటానికి కొందరు ప్రయత్నించినప్పటికిని, ఈ సిద్ధాంతములో దాని ధ్వనింపు ఉండనవసరము లేదు. యేసు పాతాళమునకు దిగిపోవుటలో ఇతర హేతువులున్నాయి. యేసు సిలువవేయబడిన తరువాత, ఆత్మ విషయములో బ్రతికింపబడినప్పుడు, అక్షరాలా వెళ్లి కొన్ని ఆత్మలుండిన లోకంలో లేదా మృతులైనవారి ఆత్మలకు ప్రకటిచాడను విషయాన్ని పేతురు తన పాఠకులకు గుర్తుచేసాడనునది అరుదుగా ఊహించడానికి కూడ వీలు లేనిదై యున్నది. ఏది ఏమైనా, పేతురు భావం ఇదే అయియున్నట్లయితే, దీనికి ముందున్న ఆలోచనలతో ఆయన మాటలకుగల పొంతనను అర్థంచేసికొనడం కష్టతరమౌతుంది. యేసు పాతాళము లోకములోనికి దిగుట యాదృచ్ఛికమైన ఒక ఆలోచనగా సందర్భానుసారమైనదై యున్నది. ఇంకా, ప్రకటించడానికి యేసు పాతాళ లోకము లోనికి దిగెనను భావన, గట్టిగా చెప్పుకుంటే, మిగతా క్రొత్త నిబంధనలో నుంచి లభించు పరోక్ష తోడ్పాటుగా నిలుస్తున్నది. ఈ విధంగా దిగుటను పేతురు సూచించాడనేది ఊహించుటకు కూడ వీలు లేని విషయం కాదు; సరికదా, అది సంభావ్యం కూడ కాదు. “దేనిలోనైతే” అను సర్వనామము యొక్క పూర్వాంశము మరియు దీనికి ముందటి వచనంలోని చివరి మాట “ఆత్మ”యై – ‘‘spirit’’ – యున్నది గనుక ఆత్మ – ‘‘spirit’’ – అను మాట ఆంగ్లంలో చిన్న ‘ఎస్’ తో వ్రాయబడాలనునది మా అభిప్రాయమై యున్నది. “దేనిలోనైతే” అనే పదములను పేతురు ప్రయోగించిన ఇతర సందర్భాల్లోని సర్వనామము, దానికి ముందున్న సందర్భాన్ని సూచిస్తున్నట్లు అగుపిస్తుంది, కాని ఇచ్చుటి పదప్రయోగం మినహాయింపైనదై యున్నది. ప్రతి సందర్భమును దాని దాని సందర్భాన్నిబట్టి గ్రహించవలెను. 3:19, 20లో సర్వనామము వాడబడిన విధానమునుబట్టి, అది “ఆత్మ”ను, దాని సమీప పూర్వాంశమును సూచిస్తుందని అర్థంచేసికొనుట స్వాభావికమే.

**వచనములు 19, 20**. పేతురు ఈ పత్రికను రచించుచుండిన కాలములో పాతాళ లోకములో ఉండినవారు, **ఒకప్పుడు అవిధేయులై యుండినవారు**, క్రీస్తు తన సందేశమును ప్రకటించినవారై యుండిరి. నోవాహు కాలములో జీవించియుండిన వారి అవిధేయత, పేతురు కాలములో క్రైస్తవులను హింసించుచుండినవారి అవిధేయతకు సమాంతరమై యుండింది. ఈ రెండు సందర్భాల్లోను, అవిధేయత “సజీవులకును మృతులకును తీర్పు తీర్చుటకు సిద్ధముగా ఉన్నవానికి” లెక్క ఒప్పజెప్పవలసినదై యున్నది (4:5). ప్రజల దుర్మార్గ ప్రవర్తన ఆలోచనరహితమైన ప్రతిచర్యగా దేవుడు జలప్రళయానికి ముందుండిన లోకాన్ని నాశనం చేయలేదు. **పూర్వము నోవాహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండిన విధంగా**, పేతురు దినములలో సహితం దేవుని దీర్ఘశాంతం కనిపెట్టుచుండింది. తన రెండవ పత్రికలో, “... యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, దేవుడు

దీర్ఘశాంతముగలవాడై యున్నాడని" అపొస్తలుడు చెప్పాడు (2 పేతురు 3:9). సజీవులై యుండిన తన తరమునకు నోవాహు ప్రకటించినప్పుడు, క్రీస్తు నోవాహు తరమునకు ప్రకటించాడు. నోవాహు తరము, ఆ చాటింపును నమ్మలేదు. అంతములో, నోవాహే నిజమని నిరూపింపబడ్డాడు; నమ్మనివారికి తీర్పు తీర్చబడింది. పేతురు తరము వారికి సహితం ఇదే జరుగబోతుంది.

క్రీస్తు, సమయమంతా జలప్రళయమునకు ముందుండినవారిని నోవాహు నోటి మాటల ద్వారా, అనగా "నీతిని ప్రకటించిన" వాని (2 పేతురు 2:5) ద్వారా హెచ్చరించుచుండగా, దేవుడు కంటికి కనబడు మరియు చెవికి వినబడు ఇతర హెచ్చరికలను ఇచ్చుచుండెను. **ఓడ సిద్ధపరచబడుచుండిన సమయంలో** నోవాహు ప్రకటించుచుండెను. క్రీస్తునకు అధికార ప్రతినిధియై యుండిన నోవాహు వలె, పేతురు కూడ తన తరములోని ప్రజలకు దృశ్యమైన హెచ్చరికల నిచ్చుచుండెను. పేతురు మరియు ఇతర అపొస్తలత్వ సాక్షుల ప్రబోధముల ద్వారా, సంఘము ఆవిర్భావమొందుచుండింది. అతకు ముందు అపొస్తలుడు సంఘమును "ఆత్మ సంబంధమైన మందిరమని" సంబోధించాడు (2:5). నోవాహు తరములోని వారిలో కొందరు వారి చుట్టూర ఉండిన దుర్మార్గత నుండి దూరంగా ఉండటానికి అవసరమైన ఆశ్రయము కొరకు వెదకడం ద్వారా రక్షింపబడినట్లుగా, పేతురు తరములోని వారిలో కొందరు ఆత్మ సంబంధమైన దేవుని మందిరములో ఆశ్రయమును కనుగొనడం ద్వారా రక్షింపబడుచుండిరి. పేతురు సంబోధించుచుండిన క్రైస్తవులు సహితం, దేవుని తీర్పు వచ్చినప్పుడు ఆశ్రయించడానికి వారికి కూడ ఒక ఓడ ఉండింది. పేతురు పాఠకుల కొరకు 2:5లోని "ఆత్మ సంబంధమైన మందిరము" మరియు "పరిశుద్ధ యాజకత్వము," 3:19, 20లోని ఇదే "ఓడ"యై యుండింది. క్రైస్తవులు కొద్ది సంఖ్యలో ఉండిరనేది నిజమే, కాని **నోవాహు** ఓడను సిద్ధపరచినప్పుడు, నీటి ద్వారా రక్షింపబడుటకు కొందరు, అనగా **ఎనిమిది మంది మాత్రమే ఉండిరి**. పేతురు సమకాలీనుల తరములోని వారిలో కొద్దిమంది రక్షింపబడుట ఆశ్చర్యము కలిగించనవసరం లేదు.

**నోవాహు**, ఓడ, మరియు నోవాహు తరములోని దుర్మార్గుల గూర్చిన సామ్యము (ఇది దాదాపుగా రూపకాలంకారము వంటిదే) ఈ విషయానికి చక్కగా సరిపోయింది. ఏది ఏమైన, నోవాహు తరములోని ఎనిమిది మంది **నీటి ద్వారా రక్షింపబడిరని** పేతురు చెప్పుచున్నప్పుడు, ఈ విషయాన్ని మనము కొంచెం జాగ్రత్తగా అర్థంచేసుకొనవలెను. గ్రీకు మూల గ్రంథ పాఠం, ఎక్కువగా అక్షరార్థమైనదైయున్న అనువాదం, "వారు నీటి ద్వారా రక్షింపబడిరని" చెప్పుచున్నది. ఇదొక వింతైన వాంగ్మూలమై యున్నది. ఈ ఎనిమిది మంది "నీటి ద్వారా" కాదు కాని "నీటి నుంచి" రక్షింపబడిరని ఈ గ్రంథ పాఠము చెప్పుచున్నదని ఒకరనుకొనవచ్చు. అయితే నిశ్చయంగా వారు జలప్రళయము ద్వారా రక్షింపబడలేదు. అంతే కదా? బహుశా, ఈ ఎనిమిది మంది దేవుడు తమ సమకాలీనులపై తీర్చుచుండిన తీర్పు నుంచి "నీటి ద్వారా" రక్షింపబడిరని పేతురు భావించియుండవచ్చు. ఇదే అతని భావమైనట్లయితే, వారిని రక్షించింది నీళ్లే అని అర్థమౌతుంది. నీళ్లు ఇహమందు మానవాళి పాపములను కడిగివేసి, అవిధేయులు అనుభవించుచుండిన అదే తీర్పు నుంచి ఎనిమిది మందిని రక్షించాయి. నీళ్లు కడిగియుండకపోయినట్లయితే, వారు ఇంకను వారిని చుట్టుముట్టియుండిన దుర్మార్గతలోనే చిక్కుకొని యుందురు.

"ఇంతకూ పేతురు ఈ 'నీళ్ల' సంగతి ఎందుకు ప్రస్తావిస్తున్నట్టు?" అని ప్రశ్నించడం పొంతనలేని ప్రశ్నేమీకాదు. ఎందుకు ప్రస్తావించాడో, తరువాతి వచనం దీనిని స్పష్టంచేస్తుంది. పేతురు చర్చించుచుండిన అంశం నోవాహు తరములోని ఎనమండుగురి రక్షణయై యుండింది. అపొస్తలుడు కొనసాగిస్తున్న అంశం తన పాఠకుల రక్షణయై యున్నది. నోవాహు కాలమందలి ఎనమండుగురి వలె, పేతురు సంబోధించిన క్రైస్తవులు, (1) దేవుడు తీర్పు తీర్చినప్పుడు (2) నీటి ద్వారా వారి సమకాలీనుల నుంచి కాపాడి సంరక్షింపబడిరి. ఇలా జరిగిందని భావించినను, సామ్యము మొత్తమంతా సరైనదై యుండదు, కాని దేవుడు గతంలో తన చర్యలు చేపట్టిన విధానమునకును, ప్రస్తుతం వారి యెడల తన చర్యలు చేపట్టుచుండిన విధానమునకును మధ్య సమాంతరములుండినవను అభయమును పేతురు తన పాఠకులకు సమకూర్చడానికి పోలికలు సరిపోతాయి. వారు అక్షయమగు బీజములో నుంచి "తిరిగి పుట్టింపబడిరని" పేతురు అంతకు మునుపు చెప్పాడు. వారు క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందినప్పుడు వారు తిరిగి పుట్టింపబడిరి (1:3, 4, 22, 23పై గల వ్యాఖ్యానము చూడుము). నీటి బాప్తిస్మము ఆయనను ధరించడానికి (గలతీయులకు 3:27), ఆయన ప్రజలగుటకు, ఆయన స్వాస్థ్యములో పాలుపంచుకొనడానికి సాధనమయ్యింది. నోవాహు కాలములోని ఎనమండుగురి రక్షణ అనేక విధాల్లో పేతురు పాఠకుల రక్షణకు సమాంతరమైన యుండింది. నోవాహు కాలము నాటి నీళ్లు, నోవాహు మరియు అతని కుటుంబము, వారి తరము యొక్క ప్రభావముల చేత ప్రభావితులు కాకుండునట్లు ఇహలోక దుర్నీతిని కడిగివేసాయి. బాప్తిస్మము నీటిలో, వారి పాపములను తీసివేయడానికి యేసు రక్తమునకుండిన శక్తిని పేతురు పాఠకులు అనుభవించారు. బాప్తిస్మము తన పాఠకుల మనస్సుల్లో నెలకొల్పిన భావమునుబట్టి, వారు రక్షింపబడినట్టుగానే, నోవాహు నోటి మాటల ద్వారా క్రీస్తు సందేశము ప్రకటింపబడినవారు "నీటి ద్వారా" రక్షింపబడిరని వారు గుర్తెరుగవలెనని అపొస్తలుడు ఆశించాడు.

**వచనము 21.** పేతురు రాసిన మొదటి పత్రికలో **బాప్తిస్మము** అను మాట ఇంత స్పష్టంగా అగుపించు చోటు ఇదొక్కటే; ఈ వాక్యభాగములో దీనికున్న ప్రాముక్యత గూర్చి ఎటువంటి సందేహమైనను ఉండనవసరము లేదు. NASB అనువాదంలోని **దానికి సాదృశ్యమైన** అనే మాటలు పేతురు మాటల ప్రభావాని బలహీనం చేస్తున్నాయి. ఎక్కువగా అక్షరార్థమైన కోణంలో చూచినట్లయితే, నీళ్లు "దృష్టాంతమై" (*antitupos*) యుండెనని పేతురు చెప్పుచున్నాడు. క్రొత్త నిబంధనలో ఈ పదము అగుపించడం ఇది రెండవసారి, మరొక పర్యాయం ఇది హెబ్రీయులకు 9:24లో అగుపిస్తుంది. సంబంధిత అంశము, రక్షణ, నోవాహు దినము నాటి నీళ్లు, వారిని చుట్టుముట్టి యుండిన దుర్నీతిమయమైన తరములో నుంచి ఎనమండుగురిని రక్షించినప్పుడు, అది **ఇప్పుడు మిమ్మును రక్షించుచున్న** బాప్తిస్మమునకు ఒక నమూనా లేక చిహ్నం లేదా, ముందుఛాయయై యుండింది.

తన పాఠకులు "బాప్తిస్మము" యొక్క ప్రాముఖ్యత గూర్చి అదివరకే ఉపదేశింపబడియున్నారని అపొస్తలుడు బావిస్తున్నాడు. అది ఏదో ఒక మామూలు యాంత్రికమైన చర్య కాదని వారు గ్రహించి యుందురు. దాని సార్థకత మొదట "మనలను దేవుని యొద్దకు తెచ్చుటకు, అనీతిమంతుల కొరకు నీతిమంతుడైన" క్రీస్తు చేసిన కార్యములో అనగా "పాపముల విషయములో ఒక్కసారే మరణించిన సంఘటనలో"

నుంచి ఉబికి వస్తుంది (3:18). రెండవదిగా, అది తన పాఠకులు ప్రదర్శించు విశ్వాస సహితమైన ప్రతిస్పందనలో నుంచి పెల్లుబికి వస్తుంది. "బాప్తిస్మము," రక్షణకు ఒక సంబంధమైన అంశము కాదనే విషయం స్పష్టంగా తెలుస్తుంది; అది "అంతరంగములో కార్యము జరిగించిన కృపకు బాహ్య ప్రతిస్పందనకు" దగ్గరగా ఉన్నది. క్రీస్తు సిలువ మీద మరణించినప్పుడు ఆయన చేసినట్టుగా, ఒకడు బాప్తిస్మము పొందినప్పుడు అదే విధంగా ప్రతిస్పందిస్తూ వాని పాపములను తీసివేస్తాడు. "బాప్తిస్మము" మానవ చర్యయే, కాని అది దైవికమైన చర్య కూడా అయియున్నది. పశ్చాత్తాపపడిన విశ్వాసి బాప్తిస్మము పొందినప్పుడు రక్షింపబడును (రోమీయులకు 6:3, 4). కేల్విన్, జ్వింగ్లి, మరియు ఇతర సంఘసంస్కర్తలు, రోమన్ కథోలిక్ మతవాదముల గూర్చి చేసిన అనేక విమర్శల విషయంలో వారు సరిగా సమర్థింపబడదగినవారై యుండిరి, కాని బాప్తిస్మములో విశ్వాసం వ్యక్తంచేయబడినప్పుడు దేవుడు కార్యం జరిగిస్తాడను భావమనను నిరాకరించినప్పుడు వారు పొరపాటుపడ్డారు.

క్రైస్తవ సాంప్రదాయంలో బాప్తిస్మము గూర్చిన చారిత్రాత్మకమైన మూలములు లేనందువలన క్రీస్తు సంఘాలు ఒక వింతైన దృష్టికోణం కలిగి ఉన్నాయని సూచించడం ద్వారా డి. ఏ. కార్సన్ పొరపాటుపడ్డాడు.[20] బాప్తిస్మము లేకుండా క్రీస్తునందుండుట గూర్చి క్రైస్తవ్యమునకు సంబంధించిన ఆది శతాబ్దముల కాలంలో ఎవరును భావించెడివారు కాదు.[21] ఫ్రెడ్ గీలి ఈ క్రింది విధంగా రచించినప్పుడు సరైన పనినే చేసాడు,

> బాప్తిస్మము, మానవులు నిత్య జీవమునకు సార్థకంగా పిలువబడిన సమయమై యుండింది. అది లోకములో నుంచి సంఘములోనికి ప్రవేశించడానికి సంబంధించిన పవిత్ర కర్మాచారమై యుండింది, ప్రస్తుత అంధకారమయమైన ఈ దుష్ట లోకంలో నుంచి దేవుని కుమారుని ప్రేమ రాజ్యము లోనికి తిరిగి పుట్టినట్టులుండింది, క్రైస్తవున్ని లోకంలో నుంచి సార్థకంగా వేరుచేస్తూ వానిని సంఘములో స్థాపించుచున్నదని బహిరంగముగా ఒప్పుకొనబడుచుండిన చర్యయై యుండింది.[22]

ఇలా ఎన్ని ఉదాహరణములనైనా ఎత్తి చూపించవచ్చు. క్రొత నిబంధనలోను ఆది సంఘములోను, బాప్తిస్మము, మత పరివర్తనము, మరియు పాపముల పరిహారము, వేరుచేయబడజాలనంతటి సంబంధం కలిగియుండినవని క్రీస్తు సంఘములతో సంబంధంలేని అనేక మంది బైబిలు పండితులు సూచిస్తుంటారు. క్రొత్త నిబంధనలోని క్రైస్తవుల అభ్యాసముల చేత అధునాతన సంఘమునకు నిర్దేశనమియ్యబడవలసిన విధి విధానం విషయంలో వారు ఏకీభవించకపోవచ్చు, కాని బాప్తిస్మమియ్యబడని క్రైస్తవుడున్నాడనువంటి విషయం ఆది సంఘానికి ఏమీ లేకుండినదని అర్థంచేసుకునేవారు చాలా మంది ఉన్నారు. "బాప్తిస్మము ఇప్పుడు మిమ్ములను రక్షించుచున్నదని" రాయడం ద్వారా పేతురు దీనిని సుస్పష్టం గావించాడు. "క్రీస్తులోనికి బాప్తిస్మము ఇప్పుడు మిమ్ములను రక్షించుచున్నదని" రాయడం ద్వారా పేతురు దీనిని సుస్పష్టం గావించాడు. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారని" పౌలు రాసినప్పుడు (గలతీయులకు 3:27). క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందనివారు తమ్మునుతాము ఆయనను ధరించుకొన్నవారు కాదనేది స్పష్టమైన

ధ్వనింపై యున్నది. క్రీస్తును ధరించినవారు మాత్రమే క్రైస్తవ స్వాస్థ్యలో పాల్గొందురనేది కూడ అంతే సమానంగా స్పష్టమౌతుంది.

పేతురు స్పష్టం చేస్తున్నాడు. "బాప్తిస్మము" యొక్క ప్రాముఖ్యత భౌతికమైన ఆచారములోనే ఉన్నదని అనుకొనువాడెవడైనను క్రొత్త నిబంధన బోధను అపార్థంచేసుకున్నవాడౌతాడు. ఎడ్వర్డ్ గోర్డన్ సెల్విన్ మాటల్లో చెప్పుకుంటే, బాప్తిస్మమనగా, "కేవలము శరీర సంబంధంగా కడుగబడుట కాదు, కాని మానవుడు నైతికంగా తనను తాను సంపూర్ణంగా క్రీస్తునందు బయలుపరచబడిన దేవునికి సమర్పించుకొనడమై యున్నది."[23] సరికదా, "బాప్తిస్మము" కేవలము దేవునికిని ఆయన ప్రజలకును మధ్య చేసుకొనబడిన ఒక ఒడంబడిక సంకేతం కూడా కాదు. సున్నతి, దీనికి తారతమ్యంగా, కేవలము ఒడంబడిక సంకేతంగా మాత్రమే ప్రయోజనపడిన ఒక భౌతిక సంబంధమైన చర్యయై యుండింది. ఎనిమిది దినముల వయస్సున్న బిడ్డకు సున్నతి చేయబడినప్పుడు దేవుడు చర్య చేపట్టలేదు. సున్నతికి మనపే, యూదుల పిల్లలు, వారి జన్మత: దేవుని ప్రజల సంఖ్యలో లెక్కింపబడినవారై యుండిరి. ఒక విశ్వాసి బాప్తిస్మము పొందుట ద్వారా **నిర్మలమైన మనస్సాక్షి కొరకు దేవుని బతిమాలినప్పుడు**, దేవుడు తగిన చర్య చేపట్టును, ఎందుకనగా "పాపముల కొరకు క్రీస్తు మరణించెను" (3:18); **యేసు క్రీస్తు తన పున:రుత్థాన మూలముగా** విజయీభవుడని ఘోషింపబడింది గనుక దేవుడు తగిన చర్య చేపట్టును. ఒకడు క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందినప్పుడు, వాని నూతన జన్మమునుబట్టి వారు స్వత:స్సిద్ధంగా దేవుని ప్రజల్లో ఒక భాగమౌతాడు.

యేసు మన "నిర్మలమైన మనస్సాక్షి" కొరకు సిలువ మీద చెల్లించిన విమోచన క్రయధనమునకు బాప్తిస్మము ఒక ప్రత్యుత్తరమై యున్నది. పేతురు దృష్టిలో, "మనస్సాక్షి" అనేది ఆధునిక సంభాషణలో చెప్పుకొనబడే అదే విషయమై యుండలేదు. ఇచ్చటి "మనస్సాక్షి" ఒకని అంతరంగములోని ఏదో ఒక నిమ్మళమైన స్వరం కాదు. విశేషంగా, అది, ఒకని స్థానము దేవుని యెదుటను, సాటి మానవుల యెదుటను ఏమైయున్నదో, దాని గూర్చి వానికి గల అవగాహనయై యున్నది. ఒకడు బాప్తిస్మము పొందాడు గనుక, అది వాని "నిర్మలమైన మనస్సాక్షి" వాడు, దేవుడు మరియు తన సాటి మానవుల మధ్య పంచుకొనబడు జ్ఞానమై యున్నది. దేవుని యెదుట వాని స్థానం దేవుని సొంత ప్రజల్లో ఒకడైనయున్న దానిగా ఉన్నదనియు, ఆయన ప్రత్యక్షమైనప్పుడు బయలుపరచబడు స్వాస్థ్యమునకు వాడు వారసుడై యున్నాడనియు అది వానికి ఆత్మవిశ్వాసమును మరియు అభయమును ఇస్తుంది. "మనస్సాక్షి" అనేది, ఈ రోజుల్లోని ప్రజల కంటె, పేతురు జీవించియుడిన లోకంలో బహు భారమైన సామాజిక పరిమాణము కలిగియుండింది.

"బాప్తిస్మము" అనగా శరీరము కడుగబడుట యని పేతురు అర్థం చేసుకున్నాడని మనము తెలిసికొనవలెను. దాని ప్రాముఖ్యతకును, కడుగబడుటకును సమీప సంబంధముండింది. బాప్తిస్మమనగా నీటిని చిలకరించుటయై యున్నదని లేదా కొన్ని నీటిని బాప్తిస్మము పొందగోరుచున్న వ్యక్తి మీద కుమ్మరించడమై యున్నదని మనము అర్థంచేసుకున్నట్లయితే, పేతురు మనముందుంచుచున్న సాదృశ్యం ఛిన్నాభిన్నమైపోతుంది. దీనికి తోడుగా, "బాప్తిస్మము," ఒక "నిర్మలమైన మనస్సాక్షి" కొరకు దానిని పొందుతున్నవాని పక్షమున ఇవ్వబడుతున్న "ప్రత్యుత్తరమై యున్నదని" పేతురు చెప్పుచున్నాడు. బాప్తిస్మము పొందువాడు తనంతట తానే ప్రత్యుత్తరము చెప్పుకొనునట్లు చాలినంత పరిపూర్ణుడై

యున్నాడనేది అంతర్భావమై యున్నది. బాప్తిస్మము పొందగోరువాడు, వాడు నశించిన స్థితిలో ఉన్నాడని గుర్తిస్తూ, నీటిలో ముంచబడుటకును, "నిర్మలమైన మనస్సాక్షి" కొరకు విన్నవించుకొనుటకును చాలినంతటి వయస్కుడై యున్నాడనేది పేతురు అర్థంచేసుకున్న బాప్తిస్మమై యున్నది.

**వచనము 22.** క్రొత్త నిబంధనలో కీర్తనల గ్రంథం ఉదాహరించి చెప్పబడినంతగా, పాత నిబంధనలోని ఇతరమైన ఏ గ్రంథమైనను పేర్కొనబడ లేదు,[24] మరియు కీర్తన 110 ఉదాహరించి చెప్పబడినంత తరచుగా ఇతరమైన ఏ కీర్తనయు చెప్పబడలేదు, ఇంకా, 110వ కీర్తనలోని, "**ప్రభువు** నా ప్రభువుతో సెలవిచ్చిన వాక్కు: 'నేను నీ శత్రువులను నీ పాదములకు పీఠముగా చేయువరకు, నా కుడి పార్శ్వమున కూర్చుండుము' అని" (కీర్తనలు 110:1) చెప్పబడినంత తరచుగా ఏ భాగము చెప్పబడలేదు. యేసు క్రీస్తు **పరలోకమునకు వెళ్లి, దేవుని కుడిపార్శ్వమున ఉన్నాడని** తన పాఠకులు తెలిసికొనవలెనని పేతురు ఆశించుచుండెను. యేసు క్రీస్తునకు ఒక చారిత్రాత్మకమైన పరిమాణమున్నది. ఆయన మానవుడై యుండెను, కన్య గర్భమున జన్మించాడు, నజరేతులో పెరిగి పెద్దవాడయ్యాడు, ఆయన ఒక ప్రబోధకుడు, ఒక ప్రవక్త. ఆయన ఈ లోకములో ఉండినప్పుడు గ్రుడ్డివారిని చూపునిచ్చాడు, అద్భుతకరమైన రీతిగా ఐదువేలమందికి ఆహారం పెట్టాడు, తన ముగ్గురు శిష్యుల కళ్లెదుటే ఆరోహణమయ్యాడు. పొంతి పిలాతు కాలమందు మరియు యూదుల చేత (తన సొంత ప్రజల చేత) విన్నవించుకొబడినందు వలన, రోమనులు ఆయనను సిలువవేసారు. మూడవ దినమున, ఆయన దేవుని శక్తి చేత మరలా సజీవుడుగా లేపబడెను. ఈ సంఘటనలు మరియు ఇతరమైనవి వాస్తవికమైన కాలములో సంభవించడం క్రైస్తవ విశ్వాసమునకు మౌలికమై యున్నవి, కాని ఇది ఇంతటితో ముగియలేదు. క్రీస్తును అనుభవించడానికి కేవలము ప్రాచీన విషయం గూర్చిన జిజ్ఞాన సరిపోదు. **దూతల మీదను అధికారుల మీదను శక్తుల మీదను అధికారము పొందిన మీదట** ఆయన పరలోకమునకు వెళ్లాడు, యేసు ఒక మానవుడుగా ఎవరై యుండెనో అను విషయమును మించిన వివరములో పేతురు ఆసక్తిగలవాడై యుండెను; యేసు, దేవుని కుమారుడుగా ఎవరై యుండెనో అను విషయం కూడ పేతురు ఆసక్తిగలవాడై యుండెను.

"కుడి పార్శ్వమున కూర్చుండుట" అనే పదజాలమునకు, దాని ప్రతీకాత్మకత దానికే ఉన్నది. "కుడి పార్శ్వము" అను మాటలు వెంటానే సన్నిహితమును మరియు అధికారమును సూచిస్తాయి. తండ్రి కుమారుల మధ్య నుండు సంబంధము గూర్చిన సకల వివరాలను గ్రహించడానికి ప్రయత్నించడం ఆశారహితమే ఔతుంది. వారు ఒక్కటై యున్నారు, కాని అదే సమయంలో తండ్రియైన దేవుడు సింహాసనాసీనుడై యుండాగా, కుమారుడైన యేసు ఆయన కుడి పార్శ్వమున ఉన్నాడు. ఇచ్చట పేతురు త్రిత్వ సిద్ధాంతమునకు సంబంధించిన సూక్ష్మాతిసూక్ష్మమైన విషయాలను పేర్కొనడం లేదు. దేవునితో యేసు కలిగియుండిన సంబంధం సృష్టిలోని ఇతరమైన దేనితోను పోల్చబడజాలనంతటిదని ఒప్పుకొనవలెను మరియు నిశ్చయపరచవలెననుదే అతని ఆందోళనయై యున్నది. "అధికారములు మరియు శక్తులు" అన్నియు, అవి దేవదూతలకు సంబంధించినవైనా లేక ఇహమునకు సంబంధించినవైనా, ఆయన ఆజ్ఞాధీనంలో ఉన్నాయి. ఇంకా, ఆయన తన ప్రజలను ఏలుచున్నాడు. ఆయన వారి గూర్చి తగు శ్రద్ధ వహిస్తున్నాడు, వారిని ఒక క్రమశిక్షణ

లో ఉంచుతున్నాడు మరియు వారిని నడిపిస్తున్నాడు. ఆయన వారి దయాళుడైన రాజై యున్నాడు.

## అన్వయము

**జీవమును ప్రేమించువారి కొరకు (3:8-12)**

ద్వేషము, దౌర్జన్యము, శాపములు, మరియు కోపతాపములున్న ప్రపంచంలో జీవించుచున్నవారు మన చుట్టూర ఎందరో ఉన్నారు. ఇలాంటివారిని చీదరించుకోవాలో లేక జాలిపడాలో అర్థంమవదు. ఇట్టి జీవితానికి పేతురు మాటలకును గల తారతమ్యమును చూడండి:

> విషయమంతటినీ క్రోడీకరించి చెప్పుకుంటే, మీరందరు సామరస్యంగా కలిసిమెలిసి యుండుడి, సహానుభూతి, సహోదర ప్రేమ, జాలిగుండెగలవారును, వినయమనస్కులునై యుండుడి; కీడుకు ప్రతికీడు లేదా దూషణకు ప్రతిదూషణ ఎవనికిని చేయవద్దు, కాని దానికి బదులుగా వారిని దీవించండి; ఏలయనగా మీరు దీవెనను స్వాస్థ్యముగా పొందవలెనను ఉద్దేశంతోనే పిలువబడి యున్నారు (1 పేతురు 3:8).

ఈ మాటల్లో పేతురు ఏమి చెప్పలేదో దానిని మనము గుర్తించుట ముఖ్యమై యున్నది. జీవము, దాని సంపూర్ణమైన మంచితనముతో, ఒకడు కూడబెట్టుకొనిన సిరిసంపదల వలని ఫలితము కాదు. అది, ప్రజలు గొప్ప అధికారముగలవారగుట వలన కలుగునది కాదు. మంచి జీవితమనగా, బలవంతడొకడు తన చుట్టూర ఎంత మందిని పోగుచేసుకొని తన అజ్ఞాధీనంలో ఉంచుకుంటున్నాడనేది కాదు. సంతృప్తి, మంచి జీవితాలు ఈ విధంగా చేకూరవు. క్రీస్తునెరుగుటయే, ఇందుకు సరైన మార్గమని ఆయన ప్రజల్లో అనేకులు అర్థంచేసుకున్నారు.

క్రైస్తవులు పరలోక ఆనందం కోసం వాంఛిస్తారు; కాని ఆయన రాజ్యము, పరలోక రాజ్యము, ఆయనను ఆలింగనము చేసికొనినవారి మధ్య మానవ చరిత్రలో అప్పటికే ప్రవేశించినదని యేసు సుస్పష్టం గావించాడు. నెరవేరవలసింది యింకా ఉన్నది, కాని క్రీస్తునందు పరలోక రాజ్యము మన మధ్యమలోనే ఉన్నది. ఈ రాజ్యమును ఆనందంగా అనుభవించడానికి క్రైస్తవులు ప్రభువు తిరిగి వచ్చు పర్యంతం వేచియుండాల్సిన అవసరం లేదు (లూకా 17:20బి, 21 చూడుము).

క్రీస్తునందుండుట అనగా, అది రానైయున్న లోకమును గూర్చినది మాత్రమే కాదు. ఈ యుగంలో జీవం కలిగి జీవించడానికి అవసరమగు కీలకమైన విషయాన్ని దేవుడు తన ప్రజలకు తెలియజెప్పాడు. పేతురు మనముందుంచుచున్న సూత్రము సరిపడు విధంగా దీనిని ఆరంభిస్తున్నది.

*మొదటిగా, దయగలవారై యుండుటకు మర్చిపోవద్దు.* దయ అనగా చిన్న చిన్న విషయాల్లో కనుపర్చబడు ప్రేమయై యున్నది. ఒకరిని చూచినప్పుడు చిరునవ్వు చిందించుట, తలుపును తెరచి పట్టుకొనుట, వృద్ధులైన వారిని చదివి వినిపించుట, ఇంటిలో నేలను తడిబట్టతో తుడుచుట, మరొకరు నీతో పంచుకొను సమస్యలను సావధానంగా ఆలకించుట,

మరొకరి చేతిని ఆదరణపూర్వకంగా పట్టుకొనుట. దయలో, సౌజన్యం మరియు సభ్యత మిళితిమై ఉంటాయి.

మనలో అనేకులము అందరి ముందర ఔదార్యబుద్ధిగలవారము, ఆలోచనాపరులము, మరియు సౌహార్ద్రహృదయము గలవారమై యుండవచ్చు; ఆలోచనారహితమైన క్షణాలలో మన అసలు బండారం బయటపడుతుంది. దయ అనగా అప్పుడప్పుడు ఇవ్వబడు అధికారపూర్వక ఆజ్ఞలకు లోబడుట కాదు; అది జీవితంలోనే నరనరాన ప్రవహిస్తుంది. దయకు అంతము లేదు. యేసు చేసిన పనులు మరియు ఆయన జీవితమును పేతురు క్రోడీకరించి చెప్పదలచినప్పుడు, యేసు ప్రదర్శించిన దయను తెలియజెప్పు మాటలు ఉపయోగిస్తున్నాడు: "దేవుడాయనకు తోడైయుండెను గనుక ఆయన మేలుచేయుచు, అపవాదిచేత పీడింపబడిన వారినందరిని స్వస్థపరచుచు సంచరించుచుండెను" (అపొస్తలుల కార్యములు 10:38). మార్కు వ్రాసిన సువార్తలో, యేసు యొద్దకు ఒక కుష్ఠరోగి వచ్చి, ఆయన యెదుట మోకాళ్లూని, "నీకిష్టమైతే, నన్ను శుద్ధునిగా చేయగలవని" పలికాడు. యేసు కనికరపడి, ఆ కుష్ఠరోగిని ముట్టి, వానిని స్వస్థపరచాడు (మార్కు 1:40, 41). యేసు ఈ కుష్ఠరోగి యెడల చేసిన కార్యమును అదారంచేసుకొని ఆయనకుండిన అద్భుతకరమైన శక్తి గూర్చి ఏమి చెప్పుకున్నప్పటికిని, ఆయన వానిని స్వస్థపరచాడంటే, అది కేవలము దయతో కూడిన ఒక కార్యమై యుండింది.

*రెండవది, కీడుకు ప్రతిగా మేలు చేయుట పరలోక రాజ్యమును ఆనందంగా అనుభవించుటకుగల మార్గమై యున్నది.* పేతురు తన ఆలోచనను కొనసాగిస్తున్నాడు: "ఆశీర్వాదమునకు వారసులవుటకు మీరు పిలువబడితిరి, గనుక కీడుకు ప్రతికీడైనను, దూషణకు ప్రతిదూషణయైనను చేయక దీవించుడి" (1 పేతురు 3:9). ఈ నియమము ప్రకారం క్రైస్తవులు ఎంత మేరకు జీవించగలిగితే, అంత వరకు వారు దేవుని రాజ్యము కొరకు వేచియుండాల్సిన అవసరం లేదు. దేవుని రాజ్యం వారి మధ్యే ఉన్నది.

అంతకు మునుపు తన పత్రికలో, యేసు క్రీస్తు శ్రమలను ప్రస్తావిస్తూ పేతురు ఇలా చెప్పాడు: "ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు; ఆయన శ్రమపెట్టబడియు, బెదిరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్నుతాను అప్పగించుకొనెను" (1 పేతురు 2:23). యేసు దూషింపబడ్డాడు మరియు నిందింపబడ్డాడు, కాని కీడుకు ప్రతి కీడు ఎన్నడును చేయలేదు. దానికి బదులుగా, ఆయన దయ చూపించాడు.

ప్రతీకారచర్యకు సంబంధించిన నియమము, మానవజాతికి అత్యంత మౌలికమైన నియమములలో ఒకటై యున్నది. పాత నిబంధన దీనిని "కంటికి కన్ను" అని చెప్పుచున్నది (లేవీయకాండము 24:19, 20). దేవుని రాజ్యములోని ప్రజల జీవిత విధానంలో భిన్నమైన నియమమున్నది, అది కీడుకు ప్రతికీడు చేయవద్దను నియమము. పేతురు జాతీయ, రాష్ట్రీయ చట్టముల గూర్చి మాటలాడుట లేదు. ఆయన తన శ్రోతలను వ్యక్తిగతంగా సంబోధించుచుండెను. "పగతీర్చుకొనవలెనను విషయం మిమ్ములను హరింపజేయనీయకండి" అని పేతురు చెప్పుచుండెను. ఈ అపొస్తలుడు "దేవుని రాజ్యము" అను పదజాలమును ప్రయోగించలేదు. కాని విశేషంగా అతడు జీవము గూర్చి మాటలాడుచుండెను. జీవము, దేవుని రాజ్యమై యున్నది. ఒకని జీవితంలో 'దెబ్బకు దెబ్బ' లేదా

'కీడుకు ప్రతికీడు' అనేదే పెత్తనం చెలాయిస్తున్నట్లయితే, వాడు జీవమును ఎన్నడును కలగియుండలేడు.

క్రీస్తు కొరకు శ్రమలననుభవించుట అనగా ఏమిటో పేతురు సంబోధించుచుండిన క్రైస్తవులు ఎరిగియుండిరి. వారు అనుభవించుచుండిన శ్రమలకు ప్రతిగా ప్రతీకార చర్యలు చేపట్టడానికి వారికి శక్తి మరియు అవకాశములుండినవి. కొన్ని సంవత్సరాల క్రితం, టెక్సాస్ నగరంలో ఒక అమ్మగారుండిరి, ఆమె చెప్పుకోదగినంతటి సంపన్నురాలే. విషయమేంటే, ఆమె భర్త మరొక స్త్రీతో అక్రమ సంబంధం కలిగియుంటున్నాడని ఈమె తెలిసికొన్నది. ఒక దినాన, తన భర్త మరొక స్త్రీతో ఒక హోటల్ గదిలో ఉన్నాడని తెలిసికొని, అతడు బయటికి వచ్చు వరకు కాచుకొని యుండింది, అతడు బయటకు రాగానే తన కారును వేగంగా వెనుకకు నడిపించి అతన్ని గుద్దేసింది. అతడు చచ్చిపోయాడు, ఆమె కూడ. ఆమె ప్రతీకారం తీర్చుకున్నది. ఇలా పగతీర్చుకొనడం ద్వారా ఎంత సంతోషం కలుగుతుందని ఆమె ఊహించుకొని యుంటుంది? అన్యాయము పోషించుచు అనేకులు నిద్రపోతున్నారు. వారు చేపట్టాల్సిన తరువాతి చర్య ఏమైయుండాలో, దానిని ఎలా చేపట్టాలో, ప్రతీకారం ఎలా తీర్చుకోగలరో ఊహించుకుంటుంటారు. ఇటువంటి ఆలోచనా ప్రపంచంలో నివసించే మనస్సులు దేవుని రాజ్యమునకు ఎంతో దూరంలో ఉంటున్నవి.

ఒకడు మనస్సుకు వ్యధకలిగించెడు మాటలు అతని యెడల పలుకబడినప్పుడు, మరొకడు అతనిని అవమానపరచినప్పుడు, లేదా అతని గూర్చి నిస్సారమైన వ్యాఖ్యానం చేసినప్పుడు, అటువంటి విషయం అతని యెడల ఎన్నడూ జరుగలేదన్నట్టుగా పట్టించుకొనక ఉండగలిగినట్లయితే అది ఎంతో ధన్యకరమౌతుంది. దూషణకు ప్రతిగా దీవెన వచనం పలికినప్పుడు జీవితం ఫలప్రదమగు ప్రతిఫలమౌతుంది. మనము శత్రువులను ఎలా సంహరించగలమో అందుకు అత్యంత సార్థకమైన విధానాన్ని యేసు ప్రభువు బోధిస్తున్నాడు. అతన్ని స్నేహితునిగా చేసుకో.

*మూడవది, నీ నాలుకను అదుపులో ఉంచుకొనుము.* అతడు 1 పేతురు 3:10, 11 వ్రాయుచుండగా, అపొస్తలుడు కీర్తనలు 34:12, 13ను గుర్తుకు తెచ్చుకొనుచున్నాడు: "బ్రతుక గోరువాడెవడైన నున్నాడా? మేలునొందుచు అనేక దినములు బ్రతుక గోరువాడెవడైన నున్నాడా? చెడ్డమాటలు పలుకకుండ నీ నాలుకను, కపటమైన మాటలు పలుకకుండ నీ పేదవులను కాచుకొనుము." యేసు, "నేను మీతో చెప్పునదేమనగా, మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శదినమున లెక్క చెప్పవలసియుండును. నీ మాటలనుబట్టి నీతిమంతుడవని తీర్పునొందుదువు. నీ మాటలనుబట్టియే అపరాధివని తీర్పు నొందుదువు" అని చెప్పాడు (మత్తయి 12:36, 37). వారి నాలుకను తమ అదుపులో ఉంచుకొనడానికి విఫలులగువారు దేవుని రాజ్యములో ప్రవేశింపరు.

*సారాంశం.* దుర్దశ, దుఃఖం మరియు బాధలు గల లోకంలో కూడ జీవమునకు గల మార్గము తెలిసినవారుంటారు. వారి కుటుంబములు, వారందరికి ఇవ్వబడు మర్యాద, వారి గూర్చి ఇతరులు చెప్పుకొనెడి విషయాలు మరియు విధానం, వారు చిందించు చిరునవ్వులు – ఇవన్నీ జీవితంలోగల సమాధానం మరియు సంతోషం గూర్చి సాక్ష్యమిస్తాయి. క్రీస్తు జీవితమునకు తోడగు మూడు అంశాలను పేతురు మనముందుంచుతున్నాడు. (1) దయగలవారమై యుండుటకు జ్ఞాపకముంచుకొనుట, (2) కీడుకు ప్రతిగా మేలు

చేయుట, మరియు (3) నాలుకను అదుపులో ఉంచుకొనుట.

**ప్రత్యామ్నాయ పరిహారము (3:18)**

ప్రత్యామ్నాయముగా ఏదైనా ఒక కార్యము చేయడమనగా మరొకరి అనుభవముల ద్వారా దానిని చేయడమని అర్థం. ఆయన చేయని పాపములకు యేసు సిలువశ్రమల ననుభవించుట అత్యంత మౌలికమైన క్రైస్తవ సిద్ధాంతములలో ఒకటై యున్నది. యేసు గూర్చి యోహాను ఇలా చెప్పుచున్నాడు, "పాపములను తీసివేయుటకై ఆయన ప్రత్యక్షమాయెనని మీకు తెలియును; ఆయనయందు పాపమేమియు లేదు" (1 యోహాను 3:5). యేసు పాపరహితుడై యుండినందు వలననే ఆయన మనము చేసిన పాపములకు ప్రత్యామ్నాయంగా సిలువశ్రమల ననుభవించాడు. ఈ విధంగా, మన పాపముల కొరకైన విమోచనా క్రయధనం చెల్లింపబడింది. పాపమునకు విరోధమైనదై యుండిన దేవుని ఉగ్రత, ఆయన కోరుచుండిన న్యాయము, సిలువ మీద తీర్చబడింది. మనము శత్రువులమై యుండినప్పటికిని, మనము క్షమింపబడినవారముగా ఆయన సన్నిధి ప్రసన్నత లోనికి తేబడితిమి. యేసు చేత మనకనుగ్రహింపబడిన ఈ జీవమును మనము ప్రస్తుత కాలమందు పంచుకొనుచున్నాము, మన ప్రభువు తన మహిమలో తిరిగి వచ్చుననేది మన నిరీక్షణ యై యున్నది. ఆయన ప్రజలైన వారు పంచుకొనడానికి దేవుని ఆశీర్వాదముల సంపూర్ణత భవిష్యత్తులో ఉంటుంది.

---

సూచనలు

[1]Origen *Contra Celsum* 3. 55. [2]"అలంకారము" అని అర్థమిచ్చునట్లు అనువదింపబడిన పదము *kosmos* అయియున్నది, ఈ పదము క్రొత్త నిబంధనలో తరచుగా వ్యతిరేకార్థక సంకేతంతో వాడబడుచు, "ప్రాపంచికమైన" మొదలగు అర్థమిచ్చింది. ఈ వచనంలో అటువంటి భావమేమీలేదు. వారు నివసించుచుండిన విశాల విశ్వం అందమైందనియు, అది తగిన ప్రమాణంలో ఉన్నదనియు గ్రీకులు దాని గూర్చి ఆలోచించుకొనుచుండిరి. ఈ విధంగా, 'అలంకారము' అను మాట అందమైన మరియు అలంకారయుక్తమైన ప్రతి విషయంలో ప్రయోగింపబడింది. [3]J. Ramsey Michaels, *1 Peter*, Word Biblical Commentary, vol. 49 (Waco, Tex.: Word Books, 1988), 159; Plutarch *Moralia* 141E. [4]Josephus *Antiquities* 4.8.15. [5]Josephus *Against Apion* 2.25. [6]గ్రీకు పదజాలమును NASB అనువాదం చక్కగా ఇముడ్చుకున్నది. ఎక్కువ అక్షరార్థంగా చూచినట్లయితే ఈ మాటలు, "మీ కంటె బలహీనురాలు, స్త్రీజాతి సంబంధమైన ఘటము" అని చెప్పుచున్నవని తెలుస్తుంది. "స్త్రీజాతి సంబంధమైన" అని అర్థమిచ్చునట్లు అనువదింపబడిన పదము *(gunaikeios)* క్రొత్త నిబంధనలో ఇచ్చట మాత్రమే అగుపిస్తుంది. "ఘటము" *(skeuos)* అను పదము నానా విధాలుగా వాడబడింది. అది ఏదో ఒక విధమైన వస్తువును, కొన్ని పర్యాయములు ఒక జాడీని లేదా వస్తువులను ఉంచడానికి ఉద్దేశించిన పాత్రను సూచిస్తుంది. ఇచ్చట వాడబడిన దానికి వలె, అది 1 థెస్సలొనీకయులకు 4:4, 5లో సూచిస్తున్నట్లుగా, స్త్రీ యొక్క భౌతిక శరీరమును సూచిస్తుంది. [7]Ignatius *Philadelphians* 1. [8]అతడు రచించిన ఉత్తరములలో ప్లిని ది యంగర్ (క్రీ.శ. రెండవ శతాబ్దము తొలి రోజులు) బిడియములేని ఔత్సుకతతో రోమీయులైన అధికారులు వారి సొంత మహిమ కొరకు ప్రాకులాడుచుండిన విషయము గూర్చి విశదపరచు తాత్కాలిక వ్యాఖ్యానం చేసాడు. అతడు తన స్నేహితుడైన మాగ్సిమస్‌కు రాస్తూ వుండిన ఒక ఉత్తరంలో, ఒక్కొక్కరు మూడు దేనారముల దిన బత్తెము (చెప్పుకోదగిన వేతనమే!) ఇవ్వబడుచు, నిర్దిష్టమైన ఒక ఉపన్యాసకుని కూటములో కూర్చోని అప్పుడప్పుడు అతనిని ప్రశంసిస్తున్న కేకలు వేయడానికి కిరాయి పనివారుగా ఉండిన ఇద్దరు దాసుల గూర్చి పేర్కొన్నాడు. ఉపన్యాసకుడు ఏమి ఉపన్యాసించుచుండెనో ఈ దాసులకు ఏమీయు తెలియదు, గనుక "సరైన సంకేతం తెలియక, ఉపన్యాసకున్ని ఏ సమయంలో లేదా ఏ సందర్భంలో ప్రశంసించాలో అర్థంకానందువలన, వారు తప్పుచేయుచుండిరి" (*Pliny the Younger Letters* 2.14). [9]Ernest Best, *1 Peter*, The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1971), 130; *The Community Rule* (1QS) 1.4. [10]Carroll Stuhl-

mueller, Dianne Bergant, et al., eds. *The Collegeville Pastoral Dictionary of Biblical Theology* (Collegeville, Minn.: Liturgical Press, 1996), 714.

[11]J. N. D. Kelly, *A Commentary on the Epistles of Peter and of Jude,* Black's New Testament Commentaries (London: Adam & Charles Black, 1969), 141. [12]"అంతరాత్మ ప్రబోధములచే పనులు చేయు" అను భావంతో ప్రయోగింపబడిన పదము – "conscientiousness" – కోసం, 2:19పై గల వ్యాఖ్యానము చూడుము. [13]3:15, 16లో వలె "(చెప్పు)టకు, (చెప్పు)నట్లు" అని అర్థమిచ్చునట్లు అనువదింపబడిన పదము *hina,* అప్పుడప్పుడు తనంతటానే దాని అర్థాన్ని వ్యక్తంచేస్తుంది. Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick William Danker (Chicago: University of Chicago Press, 2000), 477 చూడుము. [14]Best, 134. [15]ఈ అనువాదమునకు సంబంధించిన సందర్భం మైఖల్స్, 191–92, చేత చక్కగా చెప్పబడింది. [16]Sirach 41:12 (REB). [17]పరలోకంలో క్రీస్తు యొక్క అనవసరమైన బల్యర్పణ కలదనియు, పరిశుద్ధ యూఖరిస్తు ఆచరింపబడునప్పుడు యేసు వాస్తవంగా శ్రమనొందననియు రోమన్ కథోలిక్కుల వేదాంతం చెప్పుచున్నది. పేతురు మరియు హెబ్రీ పత్రికలో చేయబడిన ప్రకటనలు ఈ సిద్ధాంతమునకు ప్రాధాన్యతనిచ్చుటలేదు.*The Oxford Dictionary of the Christian Church,* 2d ed., ed. F. L. Cross and E. A. Livingstone (Oxford: Oxford University Press, 1974), 475–77 లోని "Eucharist" చూడము. [18]యేసు పాతాళ లోకములోనికి దిగుటకు సంబంధించినంత వరకు, మెక్‌కుల్లోచ్ ఇలా రాస్తున్నాడు, "యేసు పాతాళ లోకములోనికి దిగుట, ఆయన మరణమును మరియు పాతాల లోకమును జయించుట, ఆయన వెళ్లి మృతులకు ప్రకటించుట, మరియు ఆత్మలు విడుదలనొందుట గూర్చి ఎక్కువగా ప్రసిద్ధికెక్కి ప్రజాదరణ పొందిన నమ్మకం, కనీసం రెండవ శతాబ్దము నుంచైనా లేదు కాని అది క్రమేపి అధికతరమయ్యింది" (J. A. MacCulloch, *The Harrowing of Hell: A Comparative Study of an Early Christian Doctrine* [Edinburgh: T. & T. Clark, 1930], 45). [19]*En hoi* అను పదజాలము ఇతర విధాలుగా కూడ అర్థంచేసుకొనబడింది. ప్రత్యామ్నాయ పదాలుగా వాటి స్థానంలో జాబితాగా ఇవ్వబడినవి బలమైన అలంబనముగలవై యున్నవి. దీనిలోని వ్యాకరణమునకు సంబంధించిన విషయాల గూర్చి చర్చించాల్సిన స్థలం ఇది కాదు. ఆసక్తిగలవాడు ఖరిబీనీబిలిజిరీ, 205ను సంప్రదించవచ్చు. [20]D. A. Carson, "Reflections on the Book *I Just Want to be a Christian* by Dr. Rubel Shelly." పరిశోధక వ్యాసమును website: www.mun.ca/rels/restmov/texts/rmeyes/carson.htmlలో చూడవచ్చు. కార్సన్ ఇలా రాస్తున్నాడు, "అదే సమయంలో, అది [the American Restoration Movement] బాప్తిస్మము గూర్చిన ఒక దృక్పథమును అభివృద్ధి వేసింది, ఈ దృక్పథం దాదాపుగా the American Restoration Movement చేత ప్రాతినిధ్యం వహింపబడిన వారికి వెలుపల ఏ సంఘ సమూహమువారి చేతనైనను అనుకూలించుకొనబడ లేదు." ఊహించుకొనబడుచున్నట్టుగా, ఒకడు బాప్తిస్మము పొందినప్పుడు దేవుడు తన చర్యను చేపట్టి విధేయుడైన విశ్వాసి యొక్క పాపములను తొలగించునని the American Restoration Movement వారు అనుకూలించుకున్నారని కార్సన్ గ్రహించిన దృక్పథమై యున్నది. వాస్తవానికి, ఈ దృక్పథము సంఘ చరిత్రకు సంబంధించిన ప్రాచీన మరియు ఆధునిక కాలములనుంచి మరియు నానావిధములైన క్రైస్తవ సాంప్రదాయముల నుంచి అధికార పత్రాల ఆధారంతో రుజువుచేయబడవచ్చు.

[21]Everett Ferguson రెండవ శతాబ్దము నుంచి మూల గ్రంథ పాఠములను సేకరించాడు. బాప్తిస్మము పాప విమోచనార్థమైనదై యుండినదని ఆ కాలములోని సంఘముల యొక్క పెద్ద పెద్ద విభాగములు అర్థంచేసుకున్నవని ఇవి చూపించుచున్నవి. ఇది క్రొత్త నిబంధన కాలమునకు ఆవల సజీవంగా నిలిచియుండిన సిద్ధాంతమై యుండింది. ఆయన ఇలా రాస్తున్నాడు, "బాప్తిస్మము గూర్చి రెండవ శతాబ్దము నాటి వాంగ్మూలములలో ఉండిన ఏకీభావము మరియు బలము, సంఘము యొక్క తొలి రోజుల నుంచే బాప్తిస్మమునకు మరియు పాపక్షమాపణకు మధ్య సూటియైన సంబంధముండుట సంభావ్యమే అని తెలియజేయుచున్నవి." (Everett Ferguson, *Early Christians Speak* [Austin, Tex.: Sweet Publishing Co., 1971], 38). [22]Fred Gealy, "The First and Second Epistles to Timothy and the Epistle to Titus, Introduction and Exegesis," in *The Interpreter's Bible,* ed. George A. Buttrick (New York: Abingdon Press, 1955), 11:453. [23]Edward Gordon Selwyn, *The First Epistle of St. Peter: The Greek Text, with Introduction, Notes, and Essays,* Thornapple Commentaries, 2d ed. (London: Macmillan & Co., 1947; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1981), 83. [24]"ఉదహరణముగా ఎత్తి చూపించుట" అను మాటలు ఒకరు అర్థం చేసికొనడం సమస్యాత్మకంగా ఉంటున్నది. United Bible Societies వారి చేత ప్రచురింపబడిన క్రొత్త నిబంధన యొక్క గ్రీకు మూల గ్రంథ పాఠముల పాత కూర్పుల అనుబంధములో "ఉల్లేఖనముల సూచికలు" ఉండినవి. ఉదహరణముగా ఎత్తి చూపింపబడిన దానిని మనము ఒక ఉల్లేఖనముతో సమానం గావించినట్లయితే,

కీర్తనల గ్రంథంలోనివి అత్యధిక సంఖ్యలో ఉన్నాయి. ఏబీఐవారి చేత చేపట్టబడిన అత్యంత అధునాతనమైన మూల గ్రంథ పాఠ్య కూర్పులోని "ఉల్లేఖనముల సూచిక" స్థానంలో, "పూర్వ విషయాల పరోక్ష ఉల్లేఖనములు మరియు మౌఖిక సమాంతరముల సూచిక" చేర్చబడింది. విస్తృతమైన ప్రమాణములను ప్రయోగిస్తూ చూచినట్లయితే, కీర్తనల కంటె ఎక్కువ సర్వసాధారణంగా ఎత్తి చెప్పబడినవి పాత నిబంధనకు సంబంధించిన ఇతర పనులు ఉన్నాయి.